ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ — సజల శ్రద్ధ


సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదక మండలి
కందర్ప రామచంద్రరావు
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
పొన్నూరు హైమవతీశాస్త్రి
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి

సంపుటి 10 - సంచిక 6
**అక్టోబర్ 2009**
**విడిప్రతి రూ॥ 10.00**
**సం॥ చందా రూ॥ 110**
**3 సం॥ చందా రూ॥ 310**
**10 సం॥ చందా రూ॥ 1050**

Please send drafts in favour of
SRI VEDAMATA
GAYATRI TUST
BUSINESS DIVISION,
HYDERABAD


## వైజ్ఞానిక ఆధ్యాత్మికత

వైజ్ఞానిక ఆధ్యాత్మికతలో వైజ్ఞానిక జీవన దృష్టి, జీవన విలువల సమన్వయం ఉంటుంది. వైజ్ఞానిక జీవన దృష్టిలో మూఢ విశ్వాసాలకు, ఆచారాలకు ఎటువంటి స్థానం లేదు. దీనిలో తర్కం, ఔచిత్యం, ఉద్దేశ్యం, సత్యాన్వేషణ ఉంటాయి. దీనిలో ప్రయోగ పరిణామాలే ప్రామాణికం. వేదాలలో ఋషులు దీనినే "సత్యమేవ జయతే" అన్నారు.

వైజ్ఞానిక సత్యాలు ఆధ్యాత్మిక విలువలు పరిష్కరించబడిన సహ అనుభూతిలో పూర్ణత్వం చెందుతాయి. భావసంవేదనల నుంచే సమస్త సద్గుణాలు బయటకు వస్తాయి. ఎక్కడ సానుభూతి లోపిస్తుందో అక్కడ సద్గుణాల లేమి కనిపిస్తుంది. చాలా మంది విజ్ఞానానికి, ఆధ్యాత్మికకు పొంతన ఉండదని భావిస్తుంటారు. ఇవి రెండు ఒకదానికొకటి విరుద్ధం కావు. విజ్ఞానంతో కూడిన పరస్పర పూరకాలు.

ఆధ్యాత్మిక ప్రయోగాలు మనిషిని సత్యాన్వేషిగా తీర్చిదిద్దుతాయి. సానుభూతిపరునిగా ఈ ప్రయోగాలు సమాజంలో ఆధ్యాత్మిక మానవతా వాదులను ఇనుమడింపచేస్తాయి. ఈ సత్యాన్ని యుగ ఋషి, పండిత శ్రీరామశర్మ ఆచార్య తమ సమాధి స్థితి శిఖరాలపై ప్రకాశ స్తంభాలుగా ఆవిష్కరించారు. దీనిలోనే ప్రజ్వలించుచున్న క్రాంతి దీపాలు యుగం యొక్క భవిష్యత్తును ఉజ్జ్వలంగా చేస్తాయి.

*(అఖండ జ్యోతి జూలై, 2009)*

పత్రిక అందనివారు, పత్రికకు సంబంధించిన సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు క్రింది నంబర్లను సంప్రదించగలరు.
**(1) 9652862601 (2) 9032674117**

కొయ్య విత్తనాలను చల్లి పంట కోసం ఎదురుచూడడం మూర్ఖత్వం.

# విషయ సూచిక


1. **సంపాదకీయం :** వైజ్ఞానిక ఆధ్యాత్మికత 1
2. **విషయసూచిక-సద్గురు వచనామృతం :** ఆలోచనకూ పనికి సమన్వయం ఎలా? 2
3. **వేదమంత్రం :** బ్రాహ్మణులను, వేదమూర్తులను గౌరవించాలి 3
4. **వర్తమానభారతం :** ఈ దేశానికి కావలసింది 'నానో'లు కాదు-వాస్తవదృష్టి 4
5. **ఉపాసనకు రెండు పాదాలు : జపం-ధ్యానం** ధ్యానం అంటే ఏమిటి? ఎందుకు? ఎలా?-1 7
6. **పరమపూజ్య గురుదేవుల జన్మ శతాబ్ది :** 2400 కోట్ల మంత్రజపం 8
7. **ధారావాహిక : పరమేశ్వరుని చిరునామా-5** జీవన అస్తిత్వపతనం 9
8. **సంస్కృతీ మూర్తి పరమపూజ్యగురుదేవులు :** విభూతి జ్ఞాన యజ్ఞం-అద్భుత ముద్ర 12
9. **ధారావాహిక : హనుమత్‌కథామృతం-18** హృదయాకాశంలో సూర్యోదయం 13
10. **ఆధ్యాత్మిక విజ్ఞానం :** వైజ్ఞానిక పరిశోధనలలో అలుపులేని యాత్ర 14
11. **ధారావాహిక : భక్తిగాథ-23 :** వ్రజగోపికల ప్రేమ భక్తి సాధనకు పరాకాష్ఠ 16
12. **తత్వచింతన :** యోగము మనలను బ్రహ్మాండ రూపంలో గల శక్తి సాగరముతో కలుపుతుంది 18
13. **ధారావాహిక : నా స్మృతిపథంలో గురుదేవులు-37** దురాచారాలు-నిర్మూలన 21
14. **ప్రత్యేక వ్యాసం (గాంధీ జయంతి సందర్భంగా) :** మహాత్ముడు మళ్లీ మళ్లీ పుడుతూనే ఉన్నాడు-మనమే వెతుక్కోవాలి మరి! 24
15. **ధారావాహిక : దివ్యజీవన దర్శనం-66** ప్రత్యక్ష చర్యకు జవాబు రక్షణ చర్య 27
16. **పరమ పూజ్య గురుదేవుల అమృతవాణి :** నేటి ప్రజ్ఞావతారుడైన యుగ దేవత యొక్క అప్పీలు-2 28
17. **మారుతున్న యుగంలో ఊహించని మార్పులు** 31
18. **ధారావాహిక : దేవ సంస్కృతీ సౌరభం-28** భారతీయ సంస్కృతియే దేవ సంస్కృతి 32
19. **మహిళాజాగరణ :** మహిళకు గడ్డు రోజులు 34
20. **కుటుంబ నిర్మాణం కోసమై మానసిక పోషణ** 35
21. **మనం-మన ఆరోగ్యం** 37
22. **మహాశక్తి సాక్షాత్కారం** 38
23. **శక్తిని సక్రమంగా వాడుకోవడమే సంయమం** 41
24. **నా వారితో నా మాట :** శతజయంతి ఉత్సవాల రూపురేఖలు-9 జన్మశతాబ్ది విలక్షణ కార్యక్రమం ప్రారంభం అయింది 42
25. ఏ పుస్తకంలో ఏమున్నది? 45
26. **శాంతికుంజ్ హరిద్వార్‌లో సంజీవనీ విద్యా శిక్షణా శిబిరం** (ఒక సమీక్ష) 46
27. **వార్తలు** 47




# సద్గురు వచనామృతం

## జీవితం, సిద్ధాంతం

క్రమబద్ధమైన జీవితానికి ప్రథమ ఆవశ్యకతలు ఏమంటే సిద్ధాంతం, ఆచరణ ద్వారా దాని నిరూపణ. ఇందులో 'కర్తవ్యం' ప్రపథమం కర్తవ్యానికి అతి స్పష్టమైన అర్థం ఏమంటే – తన పనిలో తన్మయత్వం, ఇతరుల పనులలో ఇతరులకు మార్గం చూపుతానని పదేపదే చెప్పే వ్యక్తికి తన మార్గం అసలు తెలియదు.

జీవితం యొక్క రెండవ సిద్ధాంతం "నిజాయితీ". చెప్పేదే చేయి, చేసేదే చెప్పు అన్నది దీని మూల మంత్రం. రకరకములయిన టక్కరులకూ, మోసకారులకూ, కపటులకూ, దూరంకావడం దాని పని. నిజాయితీ వలన మనిషిపట్ల విశ్వాసం ఉత్పన్నమవుతుంది. ఈ విశ్వాసమే సంపూర్ణ సుఖం సమృద్ధులకు జనని

నాలుగవ సిద్ధాంతం 'ఉదారత'. మితవ్యయంతో దీనికి పరోక్ష సంబంధం ఉన్నది. మితవ్యయం చేయని వాడు ఉదారుడు కాలేడు.

"ఆత్మ సంయమనం" జీవితం యొక్క అయిదవ, ఆఖరి సిద్ధాంతం.

సిద్ధాంతాలు అయిదూ విజయానికి అయిదు మార్గాలు. జీవనపథానికి వెలుగు చూపే అయిదు కిరణాలు. ప్రారంభంలో ఆచరణ ద్వారా వీటి నిరూపణ కష్టం కావచ్చు. అయితే అభ్యాసం మనల్ని ఈ సిద్ధాంతాలతో మమేకం చేస్తుంది.

*(అఖండజ్యోతి, అక్టోబరు, 1951)*

అనువాదం-ఊటుకూరు సత్యనారాయణ గుప్త

## పండుగలు

**నవంబర్ 2009**

| | |
|---|---|
| 02-11-09 | గురునానక్ జయంతి |
| 14-11-09 | నెహ్రూ జయంతి |
| 28-11-09 | గీతా జయంతి |

**డిశంబర్ 2009**

| | |
|---|---|
| 01-12-09 | దత్తాత్రేయ జయంతి |
| 31-12-09 | అర్థచంద్రగ్రహణం |

**మంత్రాల్లో అర్థం మనకు కావాలి - భావం భగవంతునికి కావాలి.**

వేద మంత్రం

# బ్రాహ్మణులను, వేదమూర్తులను గౌరవించాలి

**ఉగ్రో రాజా మన్యమానో బ్రాహ్మణం యో జిఘత్సతి ।**
**పరా తత్ సిచ్యతే రాష్ట్రం బ్రాహ్మణో యత్ర జీయతే ॥**

**(అథర్వవేద 5/19/6)**

**భావార్థం :** ఏదేశంలో బ్రాహ్మణులు, వేదవేత్తలు బాధింపబడుతారో ఆ దేశం జ్ఞానహీనమై నశించిపోతుంది.

**సందేశం :** బ్రాహ్మణుని, విద్వాంసుని, ఋషి యొక్క దృష్టి చాలా నిశితంగా, ప్రకాశవంతంగా ఉంటుంది. వారి కన్నులు దూరదూరాలను చూడగలుగుతాయి. వారు దూరదర్శులై, సమయం యొక్క అవసరం తెలుసుకోగల్గుతారు. సమాజాన్ని దోష–దుర్గుణాల నుండి విముక్తం చేయడానికి ప్రయత్నం చేస్తారు. దేశంలోని నాగరికులందరినీ శీలవంతులు, సంస్కారవంతులు, జ్ఞానవంతులుగా చేయడానికి నిరంతర సంఘర్షణ చేస్తారు. ఒక్క సూర్యుడు అంధకారాన్నంతటినీ అంతం చేస్తాడు. అదేవిధంగా బ్రాహ్మణుని ద్వారా వ్యాపింపచేసే జ్ఞానం సమాజంలో వ్యాపించిన అజ్ఞానం, దురాచారాలు, దురాలోచనలను నశింపచేస్తుంది. దురాచారం యొక్క శక్తి కంటే సదాచారం యొక్క శక్తి అనేకరెట్లు ఎక్కువ. పనికిమాలిన ఆలోచనలు, భ్రష్టఆచరణ ఇవే నేటి సమస్యలు, నిజమైన బ్రాహ్మణ విద్వాంసుడే వీటిని మార్చగల సమర్థుడు.

సమాజంలో అటువంటి యోగ్యవ్యక్తులను గౌరవించాలి, వారికి ఋణపడి ఉన్నామని భావించాలి. నారదుడు ఆ ఋషి పరంపరకు ప్రతినిధి. వారు ప్రతి సమయంలో, ఎంత కష్టమైనా భరించి సమాజంలో వ్యాపించిన సమస్యలను, చెడ్డ సంప్రదాయాలను తొలగించడంలో నిమగ్నమయ్యేవారు. అంతటా ఆయనను గౌరవించేవారు. భగవంతుడి దర్బారులోనికేకాక, ఏవిధమైన ఆటంకం లేకుండా ఆయన అంతఃపురములోనికి కూడా వెళ్ళుతూ ఉండేవారు. రామరాజ్యం దీని వల్లనే సంభవం అయింది.

ఉత్కృష్ట రాజ్యవ్యవస్థ, సమాజ వ్యవస్థ 'నిందక్ నియరే రాఖియే' (విమర్శించేవారిని దగ్గర ఉంచుకోండి) అనే భావనపై ఆధారపడి ఉన్నది. దోషదుర్గుణాల గురించి తార్కికంగా నచ్చచెప్పి, సన్మార్గంలో నడిపించే యోగ్యులు విద్వాంసులైన వ్యక్తులను ఎల్లప్పుడూ గౌరవనీయులుగా భావించేవారు.

నేడు ధర్మం, జాతీయత, జ్ఞానం, సదాచారాల గురించి చెప్పిన వారిని కొట్టి, అవమానిస్తున్నారు. దీని ఫలితంగా నలువైపులా అజ్ఞానధూమం వ్యాపిస్తున్నది. ప్రజలలో సత్యం అసత్యాల తేడా తెలుసుకొనే వివేక బుద్ధి నశించిపోతున్నది, దేశం తిరిగి బానిస మార్గంలో ముందుకుపోయి నశించేస్థితికి చేరుకుంటున్నది.

నిజాయితీ పరులు, సత్యనిష్ఠులైన వ్యక్తులు వెదికినా దొరకడం లేదు. ఉన్న కొద్ది మందీ ఉపేక్ష, వెక్కిరింత, కష్టాలు భరిస్తూ ఉన్నారు. ఫలితంగా స్వాభిమానం వదలి స్వార్థలాభంకోసం ఎంతకైనా దిగజారటానికి సిద్ధపడుతున్నారు. 'యథా రాజా తథా ప్రజా' సామెత చరితార్థమవుతున్నది. భ్రష్టాచారాలు, కుట్రల చర్చ అంతటా జరుగుతున్నది. ప్రతివ్యక్తి భ్రష్టాచరణయే సఫలతకు సరియైన దారియని విశ్వసిస్తున్నాడు. దేశంలో నలువైపులా అజ్ఞానం అరాచకత్వం వ్యాపించిన ఫలితంగా విదేశీభక్తులు అన్ని విధాలా మన ఈ దుష్ప్రవృత్తుల నుండి లాభం పొంది, ఈ బంగారు భూమిని తమ చేత చిక్కించుకునే ఎత్తులు వేస్తున్నారు.

ఇప్పటికీ సమయం మించిపోలేదు. మనం మేల్కొనాలి. దేశంలోని నిజమైన విద్వాంసులు, వేదవేత్తలు చూపిన మార్గాన్ననుసరించి, దేశం యొక్క, మనయొక్క, స్వాభిమానాన్ని రక్షించుకోవాలి. దేశాన్ని పతనం కాకుండా చూచుకోవాలి. దేశహితంలో ఇది బ్రాహ్మణుల కర్తవ్యం.

★★★

**వందసార్లు విఫలం అయినా, 101వ సారి ప్రయత్నించే వ్యక్తి విజయాన్ని సాధిస్తాడు.**

వర్తమాన భారతం

# ఈ దేశానికి కావలసింది 'నానో' లు కాదు-వాస్తవదృష్టి

## లే! నిలబడు! కన్నులు తెరచిలక్ష్యాన్ని చేరుకో.

ఈనాడు ఎక్కడ చూచినా అజ్ఞానమే విస్తరించి ఉంది. "మనకు ఏం కావాలి? మన లక్ష్యం ఏమిటి?" అన్న ఆలోచనే రావడం లేదు. లోకం అంతా ఒకమాయాజాలంలా తయారయింది. అధికారులు తయారు చేసిన రాజనీతి సూత్రాలు నడుస్తూ ఉన్నాయి. కాని స్వాతంత్ర్యం వచ్చి 62 సంవత్సరాలు గడిచినా దూరదృష్టితో వాస్తవాన్ని గ్రహించలేకపోతున్నారు. చిన్న చిన్న లక్ష్యాలను ముందుంచుకుని పనులు చేస్తున్నాం. దాని ద్వారా మరికొన్ని సమస్యలు పుట్టుకొస్తున్నాయి. ఏ దేశం అయినా ప్రగతిని సాధించాలి అంటే దూరదృష్టితో ఆలోచించాలి. లక్ష్యం స్పష్టంగా ఉండాలి. క్రింది విషయాన్ని మన పాలకులు బాగా అర్థం చేసుకోవాలి.

**"ఉత్తిష్ఠత జాగృత ప్రాప్యవరాన్ని బోధత!" (1,3,14)**

"లే, కన్నులు తెరువు! మహాపురుషుల మార్గదర్శనంతో లక్ష్యాన్ని చేరుకో! ఎక్కడా ఆగవద్దు."

## అజ్ఞానాంధకారంలో నీతిశాస్త్రజ్ఞులు నిద్రిస్తున్నారు.

మన నీతిశాస్త్రజ్ఞులు గాఢనిద్రలో మునిగిఉన్నారు. వారి జీవితం అజ్ఞానాంధకారంలోనే గడిచిపోతుంది. లేచి కూర్చుని కూడా కునికపాట్లు పడుతున్నారు. ఆ మత్తు వదిలితే కాని దేశానికి మేలు చేసే ఆలోచనలు రావు. రాజనీతిజ్ఞుల ధ్యాస పూర్తిగా ఈ అయిదు సంవత్సరాలలో ఏదో విధంగా సాధ్యమయినంత జనాన్ని ప్రోగుచేసుకొని, తన స్థానాన్ని నిలబెట్టుకోవడం మీదనే ఉంటుంది. దానికోసం ఎదుటివారిపై కాలుదువ్వుతూ ఉంటారు. వారింకా సావధాన చిత్తంతో దేశాన్ని గురించి ఆలోచించేది ఎప్పుడు? సమయం అంతా వాగ్దానాలు చేయడానికే సరిపెడుతున్నారు. గడచిన 20 సంవత్సరాలలో చేసిన వాగ్దానాలు లక్షను దాటి పోయాయి. వాటి నుండి కనీసం వెయ్యి పూర్తి అయి ఉండవచ్చు.

మన **"బ్యూరోక్రసి"** యొక్క నిద్ర రోజంతా వదలడం లేదు. రోజూ ఆఫీసుకు వెళ్లుతారు. పని చేయడం మొదలు పెట్టారంటే సాయంకాలం వరకు చేస్తూనే ఉంటారు. ఈ మధ్యలో ఎన్ని టీలు త్రాగుతారో? ఎన్ని కాఫీలు త్రాగుతారో? ఇంకా ఏమేమి త్రాగుతారో లెక్క చెప్పలేం. అయినా వారి నిద్ర విడిపోదు. తమకర్తవ్యాన్ని గుర్తు చేసుకోరు. వారు కనుక జాగ్రత్తగా నడుచుకోవడం మొదలు పెడితే తప్పక లక్ష్యాన్ని చేరుకుంటారు. "భారతదేశ పునర్నిర్మాణం" లక్ష్యంగా పెట్టుకోవాలి. "అందరికీ ఆరోగ్యం-అందరికీ విద్య" అందించాలి. ఏ కోణం నుండి చూచినా దేశాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దాలి. దేశంలోని ప్రతిభావంతులైన, శ్రేష్ఠులైన ఉన్నతాధికారులు ఐ.ఎ.ఎస్; ఐ.ఎఫ్.ఎస్; ఐ.పి.ఎస్ దృష్టికోణం మారాలి. అప్పుడు దేశానికి ఉజ్జ్వల భవిష్యత్తు లభిస్తుంది, కాని పరిస్థితులు చూస్తుంటే మసక మసగ్గా కనిపిస్తున్నాయి. మన ఆశలు ఎంత వరకు నెరవేరుతాయో వేచిచూడాలి. అన్నీ చిక్కుల్లో చిక్కుకుంటూ ఉంటాయి. ఇంతో అంతో శ్రేష్ఠత్వం మిగిలితే దాన్ని కూడా ధ్వంసం చేయడానికి సిద్ధంగా ఉన్నారు.

## ఈ నాటి నచికేతులకు యమ ధర్మరాజు యొక్క సందేశం.

యమధర్మరాజు-నచికేతుల యొక్క సంవాదం చాలా మహత్వపూర్ణమయినది. "నచికేతుడా! లే! లేచినిలబడు! మత్తులో జోగవద్దు. అజ్ఞానం నుండి బయటపడు. లేస్తూనే చైతన్యాన్ని పొందు. మేలుకో, లేదు అన్న మాటను రానీయకు. సోమరితనం నిన్ను అటూ ఇటూ లాగుతూ ఉంటుంది." "వరాన్‌ప్రాప్య" అంటే "మహాపురుషులు చెప్పిన మాటలనుండి, వారి అనుభవాలను గ్రహించు. తిరిగి చూడకుండా లక్ష్యం వైపు నడకను సాగించు." అని అర్థం 'నిబోధత' ఈ పదము అధ్యాత్మపరమైనది. అధ్యాత్మ పథము మిక్కిలి కష్టమైనది. కత్తిమీద సాముపంటిది. అందువల్ల చాలా జాగ్రత్తగా ఉండాలి అని సందేశం ఇచ్చాడు. ఇప్పుడు మనం మన నీతి శాస్త్రజ్ఞులను ఈ మార్గంలో ప్రవేశపెట్టాలి. ఈ నాటి నీతి శాస్త్రజ్ఞులనే యముడు నచికేతులు అంటున్నాడు. రెండువేల సంవత్సరాలు అంధకారంలో మునిగితేలిన తర్వాత, అతి కష్టంమీద 15-8-1947 నాడు ఉషోదయం అయింది. అయినా మీరు నిద్రలేవడం లేదు (నచికేతులు=నీతి శాస్త్రజ్ఞులు) ఒక వేళ లేచినా పూర్తి మెలకువరావడంలేదు. మెలకువ వచ్చినా

**పూర్తిగా పనిలో మునిగిపోయిన వ్యక్తికి నిరాశపడడానికి తీరిక దొరకదు.**

లేచి నడవడం లేదు. నడవడం ప్రారంభించినా మధ్యలో ఆగిపోతున్నారు. మీరే ఈ విధంగా ఉన్నప్పుడు ప్రజల గురించి ఏం మాట్లాడగలం? పలువిధాల ఆకర్షణలు, విడదీయలేని భవబంధాలు ఆకర్షించి మిమ్ములను నిలిపివేస్తున్నాయి. మీరు సరిఅయిన లక్ష్యాన్ని నిర్ణయించుకోలేదు. లక్ష్యమే స్పష్టంగా లేనప్పుడు దాన్ని చేరుకోవడం ఎట్లా? జీవనయాత్ర సుఖంగా సాగేది ఎలా?

## సరిఅయిన దృష్టికోణం కావాలి.

ఈ వ్యాసం యొక్క శీర్షికలోనే "మనకు కావలసింది 'నానో' కాదు–వాస్తవిక దృష్టి" అని చెప్పడం జరిగింది. కేవలం **"బ్యూరోక్రసీ"** కే కాదు అధికార యంత్రాంగం దేశం మొత్తంలో ఉన్న 120 కోట్ల జనాభాకు ఈ విషయాన్ని చెబుతున్నాం. మనలో వాస్తవాన్ని దర్శించే జ్ఞానం లేదు. అసలు లక్ష్యాన్ని నిర్ణయించు కోవడమే రాదు. వస్తు సామాగ్రిని పెంచుకొని ఉండవచ్చు. మనకు కావలసిన వాటిమీద శ్రద్ధ చూపించి ఉండవచ్చు. కుటుంబాన్ని డబ్బు సంపాదించే ఫ్యాక్టరీగా తయారుచేసి ఉండవచ్చు. ఆదర్శ గుణాలను ప్రోగుచేసి ఉండవచ్చు. విద్యను గౌరవించి ఉండవచ్చు. ఎన్ని చేసినా నిత్యజీవితానికి కావలసిన అవసరాలను తీర్చుకోవాలి కదా! గ్రామాల్లో ఉన్న దారిద్ర్యాన్ని రూపు మాపగలగాలి. చిన్న–పెద్ద నగరాల సభ్యతను నాశనం చేసేవికాసం ఎందుకో అర్థం కావడం లేదు. ఇందువల్లనే అనేక సమస్యలు ముసురుకుంటూ ఉన్నాయి. ముఖ్యమైన చట్రాన్ని తయారు చేయడం లేదు. చెరువులు, బావులను పూడ్చివేసి కాలనీలు కడుతున్నాం. చిన్న నగరం పెద్ద పట్టణం అవుతుంది. పట్టణం మహానగరం అవుతుంది. మహా నగరం మెట్రో అవుతుంది. దీని గర్భంలో ఎన్ని గ్రామాలు జీర్ణమైపోయాయో చెప్పడం కష్టం. ఇంకా ఎన్ని కలిసిపోవాలో చెప్పలేం.

## హోదా ఉన్నా లేకున్నా వాహనాలు

ఇక్కడ మనం సమర్థవంతమైన నానోను కొలబద్దగా తీసుకుందాం. మనకు నానో అన్నా, టాటా అన్నా విరోధం లేదు. కాని దేశంలోని రోడ్ల పరిస్థితి ఆలోచించాలి. రోడ్లు ఉన్నాయో? లేవో? అవసరం లేదు.కార్లు మాత్రం రకరకాల బ్రాండ్లతో వస్తూనే ఉన్నాయి. అవి ఎక్కడ తిరగాలి? రోడ్ల నిర్మాణం కొరకు విదేశీ పద్ధతిలో ఒక హైవే అథార్టీ తయారయింది. దాని ద్వారా నాలుగు కోణాలుగా తయారు చేసి దేశమంతా కలిపివేయాలని కలలు కంటున్నారు. గతంలోని 12 సంవత్సరాల క్రితం ఉన్న పరిస్థితికి ఇప్పుడు 500 రెట్లు పెరిగిపోయింది. అయినప్పటికీ అధికాంశం పని ఇంకా అసంపూర్ణంగానే ఉంది. పల్లెల్లో రోడ్ల విషయం చూస్తే మాట్లాడవలసిన పనేలేదు. యోజన చేసినా పని ప్రారంభమే లేదు. ప్రారంభించినా పూర్తి కావడం లేదు. చిన్న–పెద్ద నగరాల విషయానికి వస్తే రోడ్లమీద ఇసుకవేస్తే రాలని జనం. ఆఫీసులకు వెళ్లడానికి 3 గంటలు ముందుగా బయలుదేరితేనే సమయానికి చేరుకోగలుగుతారు. ప్రతిరోజు అతి విలువైన సమయం 6 గంటలు రోడ్లమీదనే గడిచిపోతాయి. ఈ ప్రకారంగా వారానికి 5 రోజులు చొప్పున సంవత్సరానికి 1560 గంటలు – దాదాపు 26 రోజులు వాహనాలలోనే గడిచిపోతాయి.

ఇదేమి వికాసం? ఇన్ని అసౌకర్యాల మధ్య నలిగిపోతున్నాం. ఇప్పటికే లెక్కలేనన్ని రకాల కార్లున్నాయి. చౌకపేరుతో మరొక్క కారు తయారయింది. చిన్నగా ఉంటుంది. అనేక రకాల సౌకర్యాలు ఉన్నాయి. ఒక లీటరు ఆయిల్‌తో 24 కిలోమీటర్లు నడుస్తుంది. 5.1×1.5 మీటర్లు×1.6 మీటర్లు ఉంటుంది. మొదటిది పొడవు, రెండవది వెడల్పు, మూడవది ఎత్తు. దీనిలో ట్యూబ్ లెస్ టైరు ఉంటుంది. అన్నింటికన్నా తక్కువ కార్బన్ విడుదల చేస్తుంది. 4 గేర్లబండి. సందు గొందుల్లో కూడా నడవగలుగుతుంది. 105 కిలోమీటర్ల వేగంతో పరుగులు తీస్తుంది. దాదాపు 1.34 లక్ష నుండి 1.85 లక్షల రూ.ల మధ్యలో లభిస్తుంది. అన్నీ బాగానే ఉన్నాయి. కాని దేశంలోని సగటు పౌరుడు దీనిని కొనగలడా? అంతేకాదు. మన భారతదేశంలో ఎవ్వరూ రోడ్డు నియమాలను పాటించరు. ఎంత మంచి మంచి సౌకర్యాలతో తయారైనబండి అయినా మన దగ్గర సక్రమంగా ఉపయోగపడదు. మారుతీ కారు వచ్చినపుడు ప్రజలు ఎంతో సంబరపడ్డారు. ఇప్పుడు 'నానో' వచ్చింది. 'మారుతి' వచ్చిన సమయంలో భారతదేశంలో విదేశీ కంపెనీల కార్లు లేవు. ఇప్పుడు లెక్కలేనన్ని విదేశీ కార్లు దొరుకుతున్నాయి. బ్యాంకులో లోను తీసుకోవడం, కారు కొనుక్కోవడం, పెట్రోలు–డీజల్ దొరికితే నడుపుకోవడం, లేకపోతే మూలకి పెట్టడం చేస్తున్నారు. ముమ్ముందు పెట్రోలు దొరుకుతుందన్న ఆశలు లేవు. ఇంకా 15 సంవత్సరాల తర్వాత వాహనాలన్నీ ఆగిపోవల్సిందే అనిపిస్తోంది. పూర్తి భారతీయ విజ్ఞానంతో తయారు చేయబడిన నానో మనకు గర్వకారణమే. కాని దీనిని దేనితో? ఎక్కడ? నడపాలో చెప్పగలవారు లభించరు. కేవలం 'నానో' కాదు అన్నీ ఆలోచించాలి. ఇక్కడ కేవలం నానో గురించి కాదు. మనదేశంలో

'నిరాశ' ఒక భయంకరమైన రోగం.

అభివృద్ధి పేరుతో ఆలోచించి తయారు చేయబడిన, విక్రయించబడుతున్న ప్రతీవస్తువు ఎవరి కోసం? అని ముందుగా ఆలోచించుకోవాలి. ఉదాహరణకి వాషింగ్ మిషన్, స్టీరియో సౌండ్ థియేటర్ సిస్టమ్, రిఫ్రిజిరేటర్స్ ఆధునికమైన ఎలక్ట్రానిక్ వస్తువులు మొదలయినవాటిని అన్నింటిని గురించి రకరకాలుగా ప్రశ్నించుకోవాలి. “ఈ వస్తువులు ఏ వర్గం వారికి” అని? వి.ఐ.పి వర్గానికి ఉపయోగపడతాయి. వారిదగ్గర జనరేటర్ ఉంటుంది. వీటి ద్వారా జరిగే వాతావరణ కాలుష్యం గురించి, ప్రకృతి సాన్నిధ్యంలో జీవించే పల్లె ప్రజల గురించి, పట్టణ పరిసరాలలో అణగారిపోతున్న గ్రామాల గురించి ఎవరూ ఆలోచించడం లేదు. బండి నడవడానికే సాధ్యం కాని స్థలాలకు దరిదాపుల దాకా మెట్రో - లోకల్ ట్రైన్, కారు మొదలైన వాటిని తీసుకుని వెళ్లామనుకోండి, అక్కడ నుండి సైకిల్ మీద వెళ్లవలసిందే. యూరప్‌లోని రష్యా, జపాన్ దేశాలలోని ప్రజలు అధిక శాతం చేస్తున్నపని ఇదే. అందుకే **పరమ పూజ్య గురుదేవులు సైకిలును “21వ శతాబ్ది వాహనం”** అన్నారు. ఇది వ్యాయామం చేయిస్తుంది. జనసమర్ధం నుండి కాపాడి సులభంగా ముందుకు తీసుకుపోతుంది. మనకు కావలసిందల్లా “సైకిల్ వే” వేరుగా చూపించడం మాత్రమే.

## వాస్తవాన్ని తరచి చూడడమే మన లక్ష్యం

మన చర్చ కేవలం నానో గురించి మాత్రమే కాదని ముందుగానే చెప్పుకున్నాం. నానో ఒక ఉదాహరణ మాత్రమే. మన వైజ్ఞానికులు, నీతి శాస్త్రజ్ఞులు, ప్రతిభావంతులు, పాలకులు కన్నులు తెరచి వాస్తవ పరిస్థితులను దర్శించగలగాలి, ఆలోచించాలి. ఇప్పుడు ప్రగతిని సాధించాలంటే సౌరశక్తి, పవనశక్తిని ఉపయోగించుకోవాలి. కాకపోతే ప్రారంభంలో పైసలు ఎక్కువగా ఖర్చు కావచ్చు. సూర్య శక్తిని ఉపయోగించుకోవాలి అనుకుంటే వేలాది మైళ్లు వ్యాపించి ఉన్న సముద్రపు ఒడ్డును వాడుకోవచ్చు. సముద్రపు పొడవునా గాలి మరలను నిలబెట్టవచ్చు. ఇలాంటి సాధనాల వల్ల ఋతు ధర్మాలు సక్రమంగా అందుతాయి. సకాలంలో వర్షాలు పడతాయి. ప్రాకృతిక విలయాలు తగ్గిపోతాయి. ఈ విధంగా దృష్టిని మళ్లించి చూడాలి. అప్పుడు దేశం యొక్క ప్రతిభాపాటవాలు ఉపయోగపడతాయి. దీనికై కోటీశ్వరులు, కోట్లాధిపతులు ముందుకు వచ్చి తమ సర్వస్వాన్ని అర్పించగలగాలి. అప్పుడే గ్రామాలు, పట్టణాలు బాగుపడతాయి. ప్రజలు సుఖపడతారు. మనకు కావలసింది కార్లా? నిత్యావసర వస్తువులా? మనమే ఆలోచించుకోవాలి. కారులో తిరగడం అందరికీ ఇష్టమే. కారులో ఇంటికి వెళ్లాక ఏం తినాలి అని ఆలోచించాలి.

అమాయకుడైన బాలుడు తిరుణాలకు వెళ్లి బజారంతా తిరుగుతాడు. అక్కడ చూచినవన్నీ ఇంటికి కొనుక్కుపోవాలి అనుకుంటాడు. అది పిల్లల మనస్తత్వం. మనకు నానో బాగుంది. మారుతి బాగుంది. సెల్ ఫోన్ బాగుంది. పిల్లల లాగా ఆలోచిస్తే అన్నీ కావాలి. కాని మన అవసరాలు ఏంటి? అని ఆలోచించాలి. మనదేశంలో 52% ప్రజలు రోజువారీ 70 రూపాయలకన్నా తక్కువ ఆదాయంతో జీవిస్తున్నారు. ఎంతమంది కార్లుకొని జల్సా చేయగలుగుతారు? అందుకే వాస్తవస్థితిగతుల్ని పరిశీలించి పనిచేయాలి.

*(అఖండ జ్యోతి - అక్టోబర్-09)*

## నిరాడంబర జీవి - నిగర్వి

*సర్దార్ విఠల్‌భాయి పటేల్ భారత లెజిస్లేటివ్ అసెంబ్లీ అధ్యక్షుడు. ఒకరోజు అసెంబ్లీ పనులు పూర్తిచేసుకొని ఇంటికి వెళ్ళబోతున్నాడు. ఒక ఆంగ్ల జంట అసెంబ్లీ చూడడానికి వచ్చింది. వారు భారత్‌ను దర్శించడానికి వచ్చారు. పెరిగిన గడ్డం, సాదా వస్త్రాలు ధరించిన పటేల్ వారికి ఒక చప్రాసీగా కనిపించాడు. అసెంబ్లీని చూపించుమని అడిగారు. పటేల్ వినయశీలుడైన, నైపుణ్యంగల శాసకుడు. ఆంగ్ల దంపతుల మాటను తోసిపుచ్చలేకపోయాడు. వెంట ఉండి వారికి అసెంబ్లీని చూపించాడు. వారు బాగా సంతోషించి తిరిగి వెళ్ళే సమయంలో ఆయనకు ఒక రూపాయి బహుమతిగా ఇవ్వబోయారు. కాని పటేల్ వినయంగా తిరస్కరించాడు. ఆంగ్ల జంట అక్కడ నుండి వెళ్ళిపోయారు.*

*తరువాతి రోజే అసెంబ్లీ సమావేశం ఉంది. దర్శకుల గ్యాలరీలో కూర్చున్న ఆంగ్ల దంపతులు సభాధ్యక్షుని స్థానంలో పెరిగిన గడ్డంతో సాదా వస్త్రాలతో కూర్చుని ఉన్న వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయాడు. తాము చప్రాసీగా భావించిన వ్యక్తి లెజిస్లేటివ్ అసెంబ్లీ అధ్యక్షుడుగా కనబడేటప్పటికి, వారు తమ తప్పుకు పశ్చాత్తాప పడ్డారు.*

**‘నిరాశ’ ఆరోగ్యాన్ని ధ్వంసం చేస్తుంది.**

## ఉపాసనకు రెండు పాదాలు : జపం-ధ్యానం

# జపం అంటే ఏమిటి? ఎందుకు? ఎలా?-8

ధ్యానం అనేది ఒక మహోత్తరమైన ప్రక్రియ. ఇది లౌకిక, అలౌకిక జీవితాలు రెండింటిలోను చక్కగా ఉపయోగపడుతుంది. ధ్యానాన్ని ఎంత శక్తివంతంగా, ఎంత శ్రద్ధగా చేయగలిగితే, అంత ఫలితం లభించి తీరుతుంది. మానవుడు తనకు కావలసిన దానికోసం తీవ్రంగా ప్రయత్నించి సాధించాలి. సాధించిన దానిని సద్వినియోగం చెయ్యాలి. ఈ రెండు కార్యాలకు ధ్యానం బాగా ఉపయోగపడుతుంది. ఉపాసనా క్షేత్రంలో విజయాన్ని సాధించాలంటే ఆత్మ జ్ఞానం, లక్ష్యసిద్ధికై పట్టుదల అవసరం. ఈ రెండింటిని కూడా ధ్యానం ద్వారానే సాధించుకోగలుగుతాం.

'నేను' అంటే శరీరం కాదు. మనస్సు, శరీరం రెండూ జీవిత రథాన్ని నడిపించే రెండు చక్రాలు మాత్రమే. కాని మానవుడు శరీరమే తాను అనుకుంటున్నాడు. 'నేను' అన్న అసలు స్వరూపాన్ని మర్చిపోయాడు. ఎంత సేపూ శరీరాన్ని గురించిన ధ్యానమే గాని, జీవిత లక్ష్యాన్ని గురించి ఆలోచించడం లేదు. భగవంతుని గురించిన ధ్యానమే లేకుండా పోతున్నది. అజ్ఞానం అనే అంధకారంలో పడి దారి తెలియని భవనంలో చిక్కుపడిపోతున్నాడు. జీవన గమ్యాన్ని మరచిపోయాడు. ఈ మతిమరుపు అనేది చాలా విచిత్రమైంది. జనం వస్తువులను, పరిచయం ఉన్న మనుష్యులను కూడా మరచిపోతూ ఉంటారు. ఎప్పుడో పరిచయం అయిన వారిని మరచిపోవడం వల్ల కొంత కాలానికి అపరిచితులు అయిపోతారు. కాని కొందరు చాలా అరుదుగా తమను తాము మరచిపోతూ ఉంటారు. దీనిని ఆత్మ విస్మృతి అంటారు. శరీరంవేరు, ఆత్మవేరు అన్న మాటను అప్పుడప్పుడు వింటూ ఉంటారు. అలాంటప్పుడు వాస్తవం వారికి అస్పష్టంగా కనిపిస్తూ ఉంటుంది. దాని ద్వారా ఆత్మ కల్యాణాన్ని వెదుకుతూ ఉంటారు.

శరీరం అనేది ఆత్మకు వాహనం మాత్రమే. యజమానిని విడిచి, వాహనంపై మక్కువ ఎక్కువ చూపుతున్నాం. ఆత్మను ఆకలిగా ఉంచి, వాహనానికి నెయ్యి త్రాగిస్తున్నాం. యజమాని సేవకుని సేవలో నిమగ్నుడయ్యాడు. ఇది కూడా ఆత్మవిస్మృతిలో ఒక భాగమే. ఈ విచిత్ర పరిస్థితులో మనల్ని మనం పూర్తిగా మరిచిపోతున్నాం.

ఆధ్యాత్మిక ధ్యానం యొక్క ముఖ్య ఉద్దేశ్యం ఆత్మ స్వరూపాన్ని దర్శించడమే. మరచిపోయిన లక్ష్యాన్ని గుర్తుచేసుకోవాలి. వర్తమాన ఆపదనుండి ముక్తి పొందాలంటే ధ్యానం తప్పనిసరి, ఒక బాలుడు ఇంటి నుండి తాతగారి ఇంటికి బయలుదేరాడు. దారిలో ఒక ఉత్సవం తగిలింది. ఆనందంగా అందులో ప్రవేశించాడు. అందులోనే విహారం చేస్తున్నాడు. ఆ సంతోషంలో తాను ఎవరో? ఎక్కడకు వెళ్లాలో? ఏం చేయాలో? తన పేరు ఏమిటో? అన్నీ మరచిపోయాడు. వినడానికి ఇది విడ్డూరంగానే అనిపిస్తుంది. కానీ నూటికి నూరుపాళ్ళు నిజం. ఇదే ఈనాటి మానవుని పరిస్థితి, దుస్థితి. మన గమ్యాన్ని మనం పూర్తిగా మరచిపోయాం. కాదు అని వాదించడానికి మనం పిచ్చివాళ్లం కాము. మహా మహా తెలివిమంతులం. అన్ని పనులు తెలివిగానే చేసుకుంటున్నాం. అటువంటప్పుడు ఆత్మ విస్మృతి ఎక్కడ జరిగింది? ఎప్పుడు? ఏ సందర్భంలో జరిగింది? భగవంతుని పొందలేదన్న అశాంతి మనల్ని వేధిస్తూనే ఉంది. ఈ విషయం మనకు తెలుసు. మనం చేయవలసింది మనం చేయడం లేదు. జరగవలసింది జరగడం లేదు అని కూడా మనకు తెలుసు, ఈ అశాంతిని తొలగించుకోవాలంటే ధ్యానం చాలా అవసరం.

అంటే ఏం చేయాలి? జీవిత లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఆత్మను పరమాత్మగా తీర్చిదిద్దాలి. దానికి ఏకాగ్రత అవసరం. ఏకాగ్రతకు ధ్యానం అవసరం. భవనం నిర్మించుకోవాలంటే ముందు ప్లాను తయారుచేసుకోవాలి. దానికి ఇంజనీయర్లు అవసరం. నిర్మాణానికి తగిన సమయం కూడా కావాలి. అదే విధంగా పరమాత్మ స్వరూపాన్ని నిలుపుకోవాలంటే ఒకానొక ప్రతిమను ఆధారం చేసుకోవాలి. దానిని ధ్యానించాలి, దానితోపాటు సమీపత్వం, ఏకత్వం, సంలీనం కావాలి. అదే ధ్యాన ప్రక్రియకు పునాది.

*అనువాదం - ఊటుకూరి సత్యనారాయణ గుప్త*

★★★

**శరీరం వ్యాధులకు మందిరం.**

# పరమపూజ్య గురుదేవుల జన్మ శతాబ్ది-2400 కోట్ల మంత్రజపం

కారణజన్ములైన పరమపూజ్య గురుదేవులు గాయత్రీ మంత్రజపం ద్వారానే విజయాలు సాధించారు. వారి జన్మ శతాబ్దినాటికి మనం అంటే దక్షిణ భారత విభాగం 2400ల కోట్ల గాయత్రీ మంత్రజపాన్ని సామూహికంగా నిర్వహించి గురుదక్షిణగా సమర్పించాలన్న నిర్ణయం జరిగింది. ఇప్పటికే అనేకచోట్ల ప్రారంభింపబడింది. పరిజనులందరు రోజుకు మూడు మాలలు మంత్ర జపం చేయాలి. మీమీ బంధుమిత్రులను ప్రభావితం చేసి వారిచేత జపం చేయించాలి. ఏ రోజైనా ఏ కారణంగానైనా చేయలేకపోయినట్లైతే మరియొకరోజు పూర్తి చేసుకోవచ్చు. సగటున రోజుకు మూడు మాలలు వచ్చేలా చూసుకోవాలి. మూడు మాలలకన్నా ఎక్కువ చేయగలిగితే మరీమంచిది. మూడుమాలలు చేయలేనివారు కనీసం ఒక్క మాలైనా చెయ్యాలి.

**ముఖ్యగమనిక :** ప్రముఖ కార్యకర్తలు, పరిజనులు తమతమ ప్రదేశాలలోని పాఠశాలలకు పర్యటించి విద్యార్థుల చేత కనీసం 10-15 నిమిషాలు మంత్రజపం చేయించాలి. ఇప్పటికే చీరాలలోని ఒక పాఠశాలలో చేయించుచున్నారు. "విద్యార్థులలో జ్ఞాపకశక్తి పెరిగింది. ఏకాగ్రత కుదిరింది. బుద్ధివికసించింది. ప్రవర్తన మారింది" అని తెలియచేశారు. కనుక మన ప్రయత్నం ఆ వైపుగా సాగాలి. లెక్కింపు సౌకర్యార్థం క్రింద ఒక పట్టిక ఇవ్వబడింది. దానిలో 31 గడులు ఉన్నాయి. ప్రతిరోజు ఆ రోజు చేసిన మాలల సంఖ్యను ఒక్కొక్క గడిలో వెయ్యాలి. చేయనిరోజు డాష్ పెట్టాలి. నెలపూర్తికాగానే క్రింది ప్రొఫార్మాను నింపి క్రింది చిరునామాకు పంపాలి. ఈ పేజిని చింపుకొని నింపవచ్చు. లేకపోతే స్వయంగా తయారుచేసుకోవచ్చు.

*శ్రీ కె.పి.విఠల్, 48 LIG-II,బి.కె.గూడా,*
*సంజీవరెడ్డినగర్, హైదరాబాద్-500 038*
*ఫోన్ : 040-23705749, సెల్ : 9989655310*

ఇట్లు
మీ
అశ్విని సుబ్బారావు
*(విశ్వగాయత్రీ పరివార్-దక్షిణ భారత సంయోజకులు)*

**2400ల కోట్ల సామూహిక గాయత్రీ మంత్రజపము**

*తేదీ ....................... నుంచి ................. వరకు*

*నెం :* *పూర్తి జప మాలల సంఖ్య :* [ ]

| | | | | | |
|---|---|---|---|---|---|
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | *ప్రతిరోజు మీరు మంత్రజప మాలల సంఖ్యను పైన ఇచ్చిన గడులలో రాయండి* | | | | |

*పేరు : ..........................................................*

*గోత్రము : ......................................................*

*చిరునామా : ..................................................*

...................................................................

...................................................................

*పుట్టిన రోజు మరియు వివాహదినము : .......................*

...................................................................

*ఫోన్ : ..........................................................*

*యుగశక్తి గాయత్రి మాసపత్రికకు క్రొత్త చందాదారులను చేర్పించండి.*

**నిజమైన సాహసాన్ని శీలవంతుడు మాత్రమే చూపుతాడు.**

## ధారావాహిక : పరమేశ్వరుని చిరునామా-5

# జీవన అస్తిత్వపతనం

కొంతకాలం క్రిందట జీవన లేదా చేతనా శరీరాన్ని తయారు చేసే కణాల (సెల్స్ అనగా అన్ని జీవన లక్షణాలుగల శరీరంలోని చిన్న చిన్న కణాలు) రసాయనిక చేతన తప్ప మరేదీ లేదని వైజ్ఞానికులు అనుకునేవారు. అయితే సజీవ, నిర్జీవ కణాల (సెల్స్) విస్తృత అధ్యయనం తరువాత వైజ్ఞానికులు పైన చెప్పిన సిద్ధాంతం తప్పని తేలింది. మానవశరీరంలో నిండియున్న చైతన్యాన్ని స్థిరంగా ఉంచడానికి కణాల రసాయనిక ప్రక్రియ సహకరించవచ్చేమోగాని అదే ఆత్మ చైతన్యం అనేది భ్రమే. దీనికి ప్రస్తుతం మన ముందుకు వచ్చిన సిద్ధాంతమే సాక్షి.

సజీవ కణాలను తయారు చేసే రసాయనిక పదార్థాన్ని ప్రోటోప్లాసం అంటారు. అయితే కణాల పూర్తి భాగం 'ప్రోటోప్లాసం' మాత్రమే కాదు. ప్రోటోప్లాసం ఒక రకమైన చలించే ద్రవం, అదే ఒక చోట కొంచెం గట్టిగా మరి కొంచెం ముతకగా ఉంటుంది. ఈ స్థానం నుండే ప్రోటోప్లాసంలో రసాయనిక క్రియాకలాపాలకు స్పందన కలుగుతూ ఉంటుంది. ప్రోటోప్లాసం యొక్క జీవనం ఈ కేంద్రకం మీదనే ఆధారపడి ఉంటుందని చెప్పవచ్చు. ఈ కేంద్రకాన్ని న్యూక్లియస్ అంటారు. ఇది కాక కణంలో ఆకర్షణ మండలం, ఆకర్షణ బిందువు, కణావరణ శూన్య స్థానం (వ్యాక్యూమ్) కూడా ఉంటాయి. అయితే కణం మొత్తంలో ఈ కేంద్రకమే చేతనకు మూల బిందువు. ఏక కణజీవి అమీబాను విస్తృత అధ్యయనం చేసిన తరువాత 1. గతి (మూవ్‌మెంటు) 2. ఉత్తేజం (ఇరిటబిలిటీ) 3. పోషణ (న్యూట్రీషన్) 4. వృద్ధి 5. విసర్జన 6. జననం (రీప్రొడక్షన్) ఈ 6 క్రియలు కేంద్రక ఇచ్ఛ మరియు స్పందన పరిణామమే అని తెలుస్తుంది. సాధారణంగా ఈ ఆరు క్రియల ఆధారంగానే మనిషి కూడా జీవించి ఉన్నట్లు భావిస్తాము.

క్రియలను తెలుసుకోవడం అవసరం. మొదటి చలనం అమీబాను చూస్తే తెలుస్తుంది. (సూక్ష్మదర్శితో ఇదంతా చూడడం సాధ్యమవుతుంది) అమీబా (జీవరూపంలో ఒక సజీవ మరియు స్వతంత్రకణం) తన ప్రోటోపాస్మా సంచి నుండి వ్రేలు లాగా కొంత భాగాన్ని బయటకు తీసుకొస్తూ ఉంటుంది. ఈ భాగం ఎటువైపు బయటకు వస్తే అమీబా అటువైపే నడుస్తుంది. మానవ శరీర రచన ఏ పురుష బీజకణం (వీర్యం) మరియు స్త్రీ రజం (ఓవమ్) నుండి జరుగుతుందో, ఆ కణం ఒక నిశ్చిత సిద్ధాంతం మీద తనను తాను విస్తరించుకుంటూ శరీర నిశ్చిత తయారీకి కావలసిన అంగప్రత్యంగాలను తయారు చేస్తుంది. అయితే దాని వికాసగతి కూడ సరిగ్గా ఈ సిద్ధాంతం మీదనే పనిచేస్తూ ఉంటుంది.

ఉత్తేజం అంటే అనుభూతి లేదా తన్మాత్ర. మానవ శరీరంలోని పనిని నాడులు చేస్తాయి. (ఎఫరెంట్ అండ్ ఇఫరంట్ నెర్వ్స్) అయితే ఈ నాడీ మండలం శరీర కణాలన్నింటిలోను వ్యాపించి ఉంది. అనగా ప్రతికణం అమీబాతో సమానంగానే ఉత్తేజాన్ని కలిగి ఉంటుంది. అమీబా శరీరానికి దగ్గరగా నిప్పు, మంచు ముక్క, విద్యుత్తు, ఆమ్లం ఏదైనా వస్తువును పెడితే అది వెంటనే వెనక్కి పారిపోతుంది. ఈ గతి పేరే ఉత్తేజనశీలత. ఈ క్రియ దెబ్బతగిలినప్పుడు అక్కడ నుండి చెయ్యి వెంటనే వెనుకకు లాక్కోవడం లాంటిదే. మన శరీరంలో ఏ అంగంలోనైనా ముల్లు గుచ్చుకుంటే ఈ గుణం ఆధారంగానే మస్తిష్కానికి సూచనను అందిస్తుంది. చూడడానికి ఈ నొప్పి వేళ్ళు లేదా ఇతర ఏ భాగాలలోనైనా ఉండవచ్చు. కాని దాని అనుభవం మస్తిష్కం ద్వారానే జరుగుతుంది. అనగా మస్తిష్కంలో ఉండే చైతన్యం శరీరంలోని ప్రతి కణం యొక్క కేంద్రకంలాగా స్థిరంగా పని చేస్తుంది.

పోషణ మరియు స్వాంగీకరణ అనగా భోజన పదార్థాలను తీసుకోవడం, వాటిని ఆత్మతో కలిపి శరీరానికి శక్తి నివ్వడం, అమీబా ప్రోటోప్లాసం నుండి రెండు ముక్కలలాగా బయటకు వచ్చి చేస్తాయి. శరీరంలో జీర్ణ ప్రక్రియ కూడా కడుపులోనే ఉన్నట్లు కనబడుతుంది. అయితే అమీబా ఆక్సిజన్ సహాయంతో భోజనం

**శీలంలేనివారు చూపేది దుస్సాహసం మాత్రమే అవుతుంది.**

చేసి ప్రోటోప్లాస్మాలోకి ఏ విధంగా మారుతుందో, అదే విధంగా జీర్ణవ్యవస్థ సహాయంతో ఆ అన్నమే క్రమంగా రక్తం, వీర్యం, ఓజస్సులో పరివర్తన చెంది శరీరం మొత్తంలో ఆత్మతో కలుస్తుంది.

విసర్జన, జీర్ణంలాగే మలవిసర్జన వేరు. ఇది అమీబా కూడా చేస్తుంది. మల మూత్రాలు, ఉమ్మి, చెమటల రూపంలో మానవశరీరంలో కూడా జరుగుతుంది.

వృద్ధి గుణం కూడా శరీర కణాలలో సరిగ్గా అమీబా లాగానే ఉంటుంది. ఆహారంతో అమీబా శరీరంలో ప్రోటోప్లాసం పెరుగుతుంది. అదే విధంగా మానవ శరీరంలో కూడా జరుగుతుంది.

జననక్రియ కూడా ఒక అమీబా నుండి కేంద్రకం (న్యూక్లియస్)తో కూడిన ప్రోటోప్లాసం రెండు భాగాలలో విభజించే విధంగా 1 నుండి 2, 2 నుండి 4, 4 నుండి8 ఈ క్రమంలో జరుగుతూ ఉంటుంది. మానవ శరీరంలో కూడ కణాలు ఇలాగే పెరుగుతాయి. నిర్ణయించబడిన ఆకారాల ప్రకారం అంగాలు తయారవుతాయి.

శరీరంలో కణాల ఈ క్రియా కలాపాలు జరుగుతున్నంత వరకు శరీరం జీవించిఉన్నట్లు భావిస్తారు. కాని మరణం నిర్ధారించబడిన తరువాత కూడా ఈ క్రియలు కొంచెం సేపు జరుగుతాయి. శరీర దుర్గంధం, కుళ్ళడం, జుట్టు పెరగడం ఇవన్నీ శరీర రసాయనిక ప్రక్రియలు. మృత్యువు తరువాత ఎప్పటి వరకు జరుగుతూ ఉంటాయో అప్పటి వరకు శరీరం పూర్తిగా కుళ్ళి నశించదనడానికి ప్రామాణికంగా ఉంటాయి. కాబట్టి చేతనను రసాయనిక ప్రక్రియగా భావించక స్వతంత్ర శక్తిగానే గుర్తించాలి.

జీవం ఉన్న మరియు నిర్జీవమైన కణాలలో స్పష్టమైన అంతరమే దీనికి ప్రామాణికత. మనిషి జీవించిఉన్నంత వరకు ప్రోటోప్లాస్మా అత్యంత కోమలంగా, జిగురుగా మరియు నిరంతరం రూపాన్ని మార్చుకుంటూ ఉంటుంది. ఒకసారి నురగలాగా కనబడితే మరోసారి ఎడారి ఎండలాగా మెరుస్తూ ఉంటుంది. కాని మృత్యుస్థితిలో దాని మెరుపు సమాప్తమైపోతుంది. ఉడికిన గ్రుడ్డులాగా తెల్లగా అవుతుంది. ఈ అంతరం కారణంగానే శాస్త్రవేత్తలు కూడా అసమంజసంలో ఉన్నారు. శరీర రసాయనిక క్రియలే జీవనం అనే విషయాన్ని గుర్తించడానికి వారు కూడా పూర్తిగా సిద్ధంగా లేరు.

దీనికి వ్యతిరేకంగా హరిదాసు లాంటి యోగులు సమాధి స్థితికి వెళ్ళి చేతన ఒక స్వతంత్ర అస్తిత్వం కలిగిఉందని, దానిని ఇష్టం వచ్చిన రీతిలో శరీరం నుండి బయటకు పంపవచ్చని, మరల శరీరంలోకి ప్రవేశపెట్టవచ్చని నిరూపించారు. దీనికి మరో ఉదాహరణ ఇంగ్లాండుకు చెందిన కర్నల్ టౌన్‌సెండ్. ఆయన ఇచ్ఛాశక్తి మీద నియంత్రణ కలిగి ఉండేవాడు. ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు తన ప్రాణాన్ని శరీరం నుండి బయటకు పంపేవాడు. కొద్దిసేపు బయటనే ఉంచి మరల శరీరంలోకి తీసుకునేవాడు. ఈ ఆధారంగా అతడు జీవనాన్ని శరీర రసాయనిక ప్రక్రియలకు భిన్నమైనదిగా ప్రతిపాదించాడు.

ఒకసారి ముగ్గురు ప్రభుత్వ వైద్యులముందు ప్రయోగం చేశాడు. తన శరీరం నుండి చేతన మొత్తాన్ని ప్రోది చేశాడు. తరువాత డాక్టర్లు పరీక్షలన్నీ చేశారు. శరీరం పూర్తిగా మృతి చెందినట్లు కనుగొన్నారు. హృదయం, నాడులు, రక్త ప్రసరణల క్రియలన్నీ ఆగిపోయాయి. శరీరం పూర్తిగా చల్లబడిపోయింది. కొద్దిసేపు అయిన తరువాత తిరిగి తన శరీరంలోకి ప్రవేశించాడు. శరీరం మరల సామాన్య స్థితికి వచ్చింది. ఇది డాక్టర్ల ముందు ఒక ఛాలెంజ్ లాంటిది. జీవాత్మ నిజంగానే శరీరానికి వేరయిన మరో ఇతర తత్వమని వారు అంగీకరించక తప్పలేదు.

మానవ శరీరం ఏ చిన్న చిన్న (కణాలు అంటే మనిషి శరీరం ఏ ప్రోటోప్లాసం పేరు గల జీవ పదార్థంతో తయరైందో, దీనిలో అన్నిటికంటే కూడా సూక్ష్మ కణాలు ఉన్నాయి. ఉదాహరణకు పరమాణువు వ్యాసం 0.0000001 మిల్లీ మీటరు ఉంటే దాని కేంద్రక వ్యాసం 0.000000000001 మి.మీ. ఉంటుంది. ఇప్పుడు ఆ కేంద్రకంలో కూడా ఒక ప్రత్యేక రకమైన రసాయనం తయారవుతుంది. దీనిని క్రోమోజోమ్ లేదా గుణసూత్రం అంటారు. రసాయనిక భాషలో దీనిని డి.ఎన్.ఏ అంటారు. దాని ఆకారం వంపు తిరిగిన మెట్టులాగా ఉంటుంది. ఈ డి.ఎన్.ఏ లో ప్రపంచంలోని దృశ్య, శబ్దాలు, జ్ఞానం అంతా నిండి ఉంటుందని శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. ఒక కేంద్రక డి.ఎన్.ఏ.లో లిపిని వ్రాస్తే అందులో 600 కోట్ల కణాలలో అక్షరాలు వ్రాస్తూ

**శీలం వల్ల విద్య శోభిస్తుంది.**

పోతే ఒక మానవ శరీరంలో 360000×600 అనగా 216000000 కోట్ల అక్షరాలు వస్తాయి. ఫ్లషింగ్ మేడో (న్యూయార్క్‌లో రెండు టైమ్ కాప్యుల్స్, పాతిన చోట) లో పాతిన వెదురు ముక్కల మొత్తంలో ఒక కోటి అక్షరాలు మాత్రమే ఉన్నాయి. అప్పుడు మానవ శరీరంలో అలాంటి 360000 కోట్ల వెదురు బద్దల జ్ఞానం ఉండితీరాలి.

కణం ఏ విధంగా జ్ఞానం, గుణం మరియు సంస్కారాలు లేకుండా ఉండలేదో అదే విధంగా పదార్థరహితంగా ఉండలేదు. కాని పదార్థం ఏదో స్వతంత్ర వస్తువు కాదు. బ్రహ్మాండ గుణం మాత్రమే. కనుక శరీరం అనే ఈ వెదురు పెట్టెలో జ్ఞాన విజ్ఞానాల అనాది ధారలే కాక పదార్థ స్థూల సంస్కృతులు కూడా ఖచ్చితంగా బంధించబడి ఉన్నాయని అనుకోవడంలో ఎటువంటి అభ్యంతరం ఉండదు. భూమిలో పాతిన టైమ్ క్యాప్సుల్ ప్రతి ఒక్కరికి ప్రతి సమయంలోను అందుబాటులో ఉంటుంది. ఈ నాడు విజ్ఞానం బ్రహ్మాండంలోకి వెళ్ళి అనేక రహస్యాలను అన్వేషిస్తుంది. ఆ ఫలితాలన్నీ కూడా మనిషి పదార్థ జగత్తులో ఏదైతే పొందాలని అనుకుంటున్నాడో అవన్నీ బీజాలుగా అతనిలోనే దాగి ఉన్నాయనే దానికి సాక్షీభూతంగా నిలుస్తున్నాయి. ఇందుకోసం ఇతరత్రా దారి తప్పి తిరగవలసిన అవసరం లేదు.

ఇది అంతా ఒక సామాన్య మానవుని దృష్టిలోకి ఎందుకు రాదు? విజ్ఞానం లేదా యోగుల దృష్టిలోనే ఎందుకుంటుంది? దీనికి విజ్ఞానము మరియు యోగుల జవాబు ఒక్కటే. సూక్ష్మస్థితి లోకి వెళ్ళాలంటే ఇంద్రియాలను కూడా సూక్ష్మంగా చేసుకోవాలి. టైమ్ క్యాప్యుల్‌లో ఆ యంత్రాలన్నీ ఉంచబడ్డాయి. వాటి సహాయంతో పెట్టెలో ఉన్న అన్ని వస్తువులను ఎప్పుడైనా తెరచి తెలుసుకోవచ్చు. అదే విధంగా చేతనను సూక్ష్మ స్థితిలోకి ప్రవేశపెట్టి మనం కూడా సమయ గతి మరియు బ్రహ్మాండంలో వ్యాపించియున్న అన్ని వస్తువులను తెలుసుకొని ప్రాప్తించుకొనే సమర్థులమే. అవి చూడడానికి లక్షల, కోట్ల మైళ్ళ దూరంలో ఇప్పుడు కాక భవిష్యత్తులో జరిగే లేదా పూర్వం ఎప్పుడో జరిగినట్లుంటాయి.

*(ఈశ్వర్ కౌన్ హై - కహాఁ హై - కైసాహై)*

★★★

## కదిలించే కళ్లు

11.సీ॥ మత్స్యేంద్రనాథుండు మదినిండ దలపోసి
గోరఖనాథుని కోరి మలచె
సోపాన దేవుండు సుజనత్వముందెల్పి
జ్ఞానేశ్వరునికోరి సంతు జేసె
ఆ వశిష్ఠ ఋషియు నత్యంత శ్రద్ధతో
శ్రీరామచంద్రుని శ్రేష్ఠు జేసె
సాందీపముని తాను సాధనా దీక్షలో
శ్రీకృష్ణ మూర్తిని చేర్చుకొనియె

తే॥ గురువు మహిమ లెరిగి రాము గుండె నిండ
గురువు గూర్చిన తలపులన్ కూర్చుకొనుచు
గురువు జాడలనెరుగంగ తిరుగు విధము
మానవాళికి తెలుపంగ మరువకనుచు
కవిని కదిలించె గురుదేవు కంటిచూపు

12.సీ॥ అజ్ఞాత గురువుకై అలమటించుచురాము
భక్తితోడమిగుల పరితపించె
సద్గురురాకకై సకలంబుమరచుచు
జపము చేయుచు నుండె శక్తి కొలది
ఏకాంత తలములో ఏకాగ్రచిత్తాన
తలుపులు బిగియించి తపముసేయ
ఆవునేతి జ్యోతి అలరారుచుండగా
సౌగంధవాయువు సాగుచుండె

తే॥ అంతరంగమునందింక హాయిగొలుప
మనదు శ్రీరామశర్మయు తనియు వితము
మానవాళికి దెలుపుట మరువకనుచు
కవిని కదిలించె గురుదేవు కంటిచూపు

రచన-మధుర కవయిత్రి
పొన్నూరు హైమవతీ శాస్త్రి

★★★

**మనకంటూ ఒక అభిప్రాయం లేకపోతే, ఇతరుల అభిప్రాయాలనే మొయ్యాల్సి వస్తుంది.**

## సంస్కృతీమూర్తి - పరమపూజ్య గురు దేవులు

# విభూతి జ్ఞానయజ్ఞం - అద్భుత ముద్ర

8-10-1999 ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో గాయత్రీ పరివార సభ్యుల చేత "గొప్ప జ్ఞానయజ్ఞం" నిర్వహింపబడింది. న్యూఢిల్లీ ప్రజ్ఞా పరిజనులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించే బాధ్యతను చేపట్టారు. 14 మంది సభ్యులు ఒక సమితిగా ఏర్పడి అద్భుతంగా నిర్వహించారు.

పరమపూజ్యగురుదేవులు నిర్ణయించిన ప్రకారం మండుతున్న కాగడా గుర్తును వారి ప్రతినిధిగా అలంకరించారు. ప్రగతి పథంలో నడిపించే రకరకాల నినాదాలు వ్రాసిన బేనర్లను స్టేడియం నిండా వ్రేలాడదీశారు. దేశం నలుమూలలనుండి వివిధ వాహనాలపై వచ్చిన పరిజనులందరికీ కూర్చునే వ్యవస్థను కల్పించారు. అంతే కాదు వారి వారి వాహనాలను నిలుపుకోవడానికి చక్కని వ్యవస్థను ఏర్పాటు చేశారు. వేదికకు నాలుగువైపులా 24 వేల దీపాలను మనోహరంగా అలంకరించారు. పెద్ద పెద్ద స్క్రీన్‌లను నాలిగింటిని అమర్చారు. విశిష్ట వ్యక్తులు కూర్చునే నిమిత్తం పడమటి వైపున ఆసనాలను ఏర్పాటుచేశారు. అక్కడ ఆనాటి మంత్రులు శ్రీ లాల్‌కృష్ణ అద్వాని, శ్రీ మురళీ మనోహర జోషీ, శ్రీరమేశ్ వ్యాస్, శ్రీ నరేంద్ర మోహన్ మరియు శాంతికుంజ్ గాయత్రీ పరివార ప్రతినిధి శ్రీమతి శైలబాల పండ్యా, డాక్టర్ ప్రణవ పండ్యా మొదలైనవారు ఆసీనులయ్యారు. అప్పటికి 18 సంవత్సరాల క్రిందట నిర్మించిన స్టేడియం మొట్టమొదటిసారిగా నిండిపోయింది. స్టేడియం అంతా పసుపు పచ్చ దుస్తులతో నిండిపోయి విస్తారమైన చామంతి పూలతోటను తలపింపచేసింది. ఢిల్లీ నగరం క్రొత్తపెండ్లికూతురులా సోయగాలు విరజిమ్మింది. ప్రకటించిన విధంగా సరిగ్గా నాలుగు గంటలకు దీప ప్రజ్జులనం, సరస్వతీ ప్రార్థనలతో కార్యక్రమం ప్రారంభం అయింది. 50 మంది శాంతికుంజ్ కళాకారుల టోలీ "ప్రజ్ఞావతార్" "యుగకేపుకార్" అనే రెండు నాట్యాలను ప్రదర్శించి ప్రేక్షకులలో నూతన చైతన్యాన్ని కలిగించింది. శ్రీకాళీ చరణ్ శర్మ స్వాగతవచనాలు పలికారు. మధ్య మధ్యలో స్ఫూర్తి దాయకం అయిన ప్రజ్ఞాగీతాలు అందరి హృదయాలలో ఉల్లాసాన్ని నింపాయి. విభూతి జ్ఞానయజ్ఞఫలితాన్ని డాక్టర్ ప్రణవపండ్యా వివరించారు. శ్రీమతి శైలబాల పండ్యా గురుదేవులను గూర్చిన కొన్ని జ్ఞాపకాలను వినిపించి, యుగనిర్మాణం కొరకు ప్రతిభాదానాన్ని, సమయదానాన్ని, కోరారు. తరువాత శ్రీ నరేంద్రమోహన్ మాట్లాడుతూ – "ఈ కార్యక్రమ స్వరూపాన్ని చూస్తుంటే భూమిపైకి స్వర్గం దిగివచ్చినట్లే ఉంది" అన్నారు. శ్రీరమేష్ వ్యాస్ మాట్లాడుతూ – తనను తాను గాయత్రీ పరివార్ సభ్యునిగా ప్రకటించుకున్నారు. శ్రీమురళీ మనోహరజోషి మట్లాడుతూ – "గాయత్రీ పరివార్ అధ్యాత్మిక శక్తినిలయం" అన్నారు. శ్రీలాల్‌కృష్ణ అద్వాని మట్లాడుతూ –"ఈ దీపయజ్ఞం నా హృదయంలో కోటి కాంతులను నింపింది. నేను ఈ రోజు ఇక్కడకు రాకపోయి ఉంటే గొప్ప అనుభూతికి దూరం అయ్యేవాడిని" అన్నారు.

ఈ కార్యక్రమం మొత్తాన్ని నేరుగా టెలీకాస్ట్ చేశారు. శ్రీ వీరేంద్ర, శ్రీ చౌహనులు లక్షమందికి భోజనం పాకెట్లు తయారుచేయించిఇచ్చారు. కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు, పరిజనులు తమతమ హృదయాలపై ఒక అద్భుతమైన దృశ్యాన్ని ముద్రించుకుని వెళ్ళారు. ఏ వైపునుండి విన్నా "అద్భుతం" "మహాద్భుతం" "అభూతపూర్వం" అన్న ప్రశంసా వాక్యాలే మార్మోగినాయి.

చిట్ట చివరలో "ప్రజ్ఞావతారం' అనే చిన్న నాటిక ప్రదర్శింపబడి అందరికీ ఆహ్లాదాన్ని కల్గించింది. 4 గంటల నుండి 8-30 గంటలదాకా కొనసాగింది. అందరు కలసి ప్రపంచ ప్రజలందరినీ జాగృతం చేసి, భారతీయ సంస్కృతిని వ్యాపింపచేస్తూ నూతన యుగాన్ని నిర్మించాలన్న సంకల్పం తీసుకోవడం జరిగింది. వెలుగుతున్న దీపాల సాక్షిగా యుగనిర్మాణ సత్సంకల్పాలను పఠించారు. శాంతి మంత్రంతో కార్యక్రమం ముగిసింది.

**సిద్ధాంతాల కోసం పోరాడవచ్చు-కాని వాటి ప్రకారం జీవించడమే కష్టం - స్టీవెన్సన్.**

ధారావాహిక: హనుమత్ కథామృతం-18

# హృదయాకాశంలో సూర్యోదయం

రాత్రి మొదటిజాము నడుస్తోంది. హనుమాన్‌కి తల్లి అంజనా దేవిమాటలు గుర్తుకువచ్చాయి. వెంటనే పెదవులపై చిరునవ్వు ప్రవేశించింది మానసికమైన ఊగిసలాట, మధురమైన ఆ చిరునవ్వు వెనకకు వెళ్ళి మటుమాయమైపోయింది. ఒక్క క్షణం దీర్ఘమైన శ్వాస తీసుకున్నాడు. వెదుకుతున్నదేదో దొరికిపోయినట్లు అతని ముఖకవళికలే చెబుతున్నాయి. పడకపై నుండి దిగి గదిలోపచార్లు చేయడం మొదలుపెట్టాడు. తన ఆరాధ్యదైవం శ్రీరామచంద్రుని స్మరించుకున్నాడు. మరల పడకపై కుర్చున్నాడు. తన శరీరంలోని అణువు అణువు నుండి శ్రీరామ నామంవినిపిస్తోంది, భక్తితో పులకించిపోయాడు. "ప్రభూ! నన్ను పూర్తిగా పవిత్ర మార్గంలో నడిపించు అని ప్రార్థించాడు.

హనుమాన్ మనస్సులోని ప్రశ్న ప్రార్థనగా మారిపోయింది. ఒకానొక అంతశ్చేతన విద్యుత్తులా ప్రవహింపసాగింది. ఆధ్యాత్మిక విద్యుత్తు ఉన్నత శిఖరాలపై ప్రాక సాగింది. ప్రశాంతంగా పడుకుని కన్నులు మూసుకున్నాడు. వెంటనే హాయిగా కునికిపాట్లు వచ్చాయి. మెల్లగా యోగ నిద్రలోనికి జారుకున్నాడు.

ఈనాటి ఈ నిద్ర హనుమాన్‌కు నిద్రలా అనిపించడం లేదు. కేవలం శరీరం మాత్రమే నిద్రపోతున్నది. కాని అంతరంగ చేతన పూర్తిజాగృతిలో ఉంది. అంతరంగం చీకటి – వెలుగుల మార్గాల్లో పయనిస్తూ, మహోన్నతమైన వెలుగు బాటలో ప్రవేశించింది. అదే స్వీయ ప్రతిభను తెలియచేసే క్షేత్రం. అక్కడినుండి అధ్యాత్మిక ప్రకాశం సాయంతో హృదయాకాశాన్ని చేరుకున్నాడు. దీని ద్వారానే ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఆ జ్ఞాన ప్రకాశంలోనే సకల ప్రశ్నలకు సమాధానాలు లభించి తీరుతాయి. ఇక్కడే అన్ని ప్రార్థనలు ఫలిస్తాయి. సమస్యలన్నీ పూరింపబడతాయి.

నిద్రా సమయంలో బాలహనుమాన్ యొక్క అంతశ్చేతన స్వీయ ప్రతిభా క్షేత్రంలోనికి చేరుకుంది. అతని ప్రశ్నలు, అతని ప్రార్థన స్వీయ ప్రతిభ ద్వారా వికసించి, హృదయాకాశపు తెరలు తొలగించుకుని దివ్యాకాశంవైపు సాగిపోయాయి. హృదయాకాశంనుండి, దివ్యాకాశంవరకు చేరుకోవడమనేది సామాన్యంగా వ్యక్తి నిద్రావస్థలో ఉండగానే జరుగుతుంది. ఈ సమయంలో అనేక స్వాప్నిక అనుభవాలు పంచుకోవడం జరుగుతుంది. కాని ఇక్కడ హనుమాన్ పరిస్థితి భిన్నంగా ఉంది. తాను యోగనిద్రలో ఉన్నప్పటికీ, అంతరంగ చేతన సంపూర్ణ చైతన్యంతో ఉన్నది. ఈ అనుభవం మిక్కిలి విచిత్రంగా అనిపిస్తోంది.

స్వప్నంలో బాలహనుమాన్ అనుభూతులు గట్టిపడుతున్నాయి. వాటిని వ్యక్తం చేయాలంటే మాటలు సరిపోవడం లేదు. అక్కడే పవిత్రతను గురించిన ప్రశ్నకు సమాధానం దొరికినట్లుగా అనిపిస్తోంది. హృదయాకాశంలో సూర్యోదయం అయినట్లుగా భాసిస్తోంది. అటువంటి మనోహరమైన సూర్యోదయాన్ని హనుమాన్ ఎన్నడూ చేడలేదు. యోగనిద్రలో లభించిన అధ్యాత్మిక అనుభవాలు ఆ క్షణంలో అతనికి హిమాలయాల్లో సంచరిస్తున్నట్లుగా అనిపించాయి. మంచుతో కప్పబడిన హిమాలయం స్వగృహంలాగా అనిపించింది. సాక్షాత్తు సదాశివుడే బాలహనుమాన్ రూపంలో అధ్యాత్మిక మార్గంలో తిరుగుతున్నట్లుగా అనిపిస్తోంది.

హిమాలయంపైని ప్రతి అంగుళం పవిత్రతను ఆపాదిస్తూ కనిపించసాగాయి. ఇక్కడ ఉన్నత హిమశిఖరాలు, మధురధ్వనితో క్రిందికి ప్రవహిస్తున్న సెలయేరులు, మంచుకొండపై నివసించే పశుపక్ష్యాదులు, పక్షిగణాలు చేస్తున్న కల కల ధ్వనులు ఆహా! హిమాలయాల సౌందర్యం అద్భుతంగా ఉంది. ఎర్రని సూర్యుని నుండి ప్రసరిస్తున్న బంగారు కాంతులు తెల్లని హిమశిఖరంపై శోభాయమానంగా కనిపిస్తున్నాయి. ఈ ఆధ్యాత్మిక వాతావరణంలో హనుమాన్ ఒకానొక హిమశిఖరంపై కూర్చుని ఉన్నారు. భువన భాస్కరుడు కూడ వింతగా అతనిపై కిరణ ప్రసారం చేస్తున్నాడు.

హనుమాన్ పులకించిన మనస్సుతో కన్నులు మూసుకుని తన్మయంగా కూర్చుండిపోయాడు. ఇంతలో హఠాత్తుగా అతనికి వింతైన అనుభూతికలిగింది. సూర్యభగవానుని స్వర్ణ కాంతులు తన నాభిస్థానంలో ప్రవేశిస్తూ ఉన్నట్లుగా అనుభూతి కలిగింది. ఈ ప్రవేశం కారణంగా అతని శరీరంలోని ప్రతి అణువు లోపలా, బయటా కూడా ప్రకాశవంతం అవుతూ ఉన్నాయి. చూస్తూ ఉండగానే సూర్యకాంతి తన కనుబొమ్మల మధ్యనుండి ప్రవేశిస్తూ ఉన్నట్లు అనుభూతి కలిగింది. అత్యంత గాఢమైన ఈ అనుభూతి హనుమాన్ కు సంపూర్ణ జ్ఞాన క్షేత్రాన్ని వికసింపచేసింది. వెంటనే సూర్య భగవానుడు పూర్తిగా తన హృదయక్షేత్రంలో ప్రవేశించినట్లుగా అనుభూతి పొందాడు. హృదయంలోని రహస్యనాదులన్నింటికి సూర్యభగవానునితో నేరుగా సంబంధం ఉంటుందన్నమాటను మునుల నోటి నుండి వినిఉన్నాడు. ఇప్పుడది అనుభవానికి వచ్చింది.

ఆనాటినుండి ప్రతిరోజు బయటి అకాశంలో సూర్యోదయం అవుతున్నట్లే హనుమాన్ హృదయాకాశంలో కూడా సూర్యోదయం అవుతూనే ఉంది. ఈ సూర్యమండలం నుండి ఒకానొక మహా మంత్రం వినిపించసాగింది. – " ఓం ఘృణిః సూర్యాయనమః" ఈ మంత్రం విచిత్రమైన ధ్వనితో పవిత్రతను ప్రేరేపిస్తూ ఉంది. దానితో హనుమాన్ జీవితమే ప్రకాశవంతమైపోయింది.

*(అఖండజ్యోతి – డిశంబర్ 2008)*

**జీవితంలో ఒంటరిగా నడిచేవారికి భగవంతుని తోడు ఉంటుంది - స్వామి రామతీర్థ.**

### ఆధ్యాత్మిక విజ్ఞానం

# వైజ్ఞానిక పరిశోధనలలో అలుపులేని యాత్ర

"ఋషుల విజ్ఞానంలో ప్రకృతి యొక్క శక్తులు, భగవంతుని యొక్క ఉనికి సత్యం ' అనే విషయాలు స్పష్టమవుతున్నాయి. ఇవి అనేక విధాలుగా ఉంటాయి. ఇందులో మరల ప్రతివొక్క కోణము మరియొక దానిలో కలసిపోయి ఉంటుంది. వీనిలో ఏకత్వం, అనంతత్వమూ, క్రొత్తదనమూ కూడా ఉన్నాయి. అందుచేతనే ఋషులు చేసే వైజ్ఞానిక ప్రయోగాలు ఎప్పుడూ ఆగిపోవు. మందగించవుకూడా! అనంతకాలంనుండి సాగుతున్న ఈ వైజ్ఞానిక ప్రవాహం ఎప్పటికీ అవిచ్ఛిన్నంగానే ఉంటుంది. ఋషుల యొక్క విజ్ఞానంలో ప్రయోగాలు అవిరామమైనవి" అని చెప్తూ అంగీరసమహర్షి అచట కూర్చునివున్న మహర్షులు, విద్వాంసులు, చదువుకుంటున్న విద్యార్థులు..... మున్నగువారి వంక చూశాడు. హిమలయాల దిగువన సరస్వతీనదీతీర ప్రాంతంలో, పరిశోధనల విషయమై వారంతా వారి వారి శిష్యగణంతో చేరుకున్నారు.

హిమాలయాల యొక్క తెల్లని శిఖరాల నీడలో, సరస్వతీ జలబిందువులచేత తడుపబడిన ఈ భూభాగం ఎంతో అలౌకికంగా ఉంది. గర్వంతో ఉన్మత్తమై తిరుగుతూఉన్న ఆడనెమళ్ళు, అప్రమత్తతతో కావలికాస్తున్న కావలివానివలె నిటారుగా తలెత్తి నిలబడిన వృక్షాల వరుసలు, మనస్సులను ఆకర్షిస్తున్నాయి. భూమిపైన పట్టువలె మెత్తని ముఖముల్ వంటి గడ్డిపరచుకొని ఉంది. అక్కడక్కడా విరబూసిన పుష్పాలతో నిండిన మొక్కలు ప్రత్యేకమైన పరిమళాన్ని వెదజల్లుతున్నాయి. దగ్గరలోనే దట్టమైన అడవి ఉండటంచేత, ఉండి ఉండి మృగరాజు గర్జనలు వినిపిస్తున్నాయి. ఆ పరిసరాలలో కస్తూరిమృగాలు యథేచ్ఛగా తిరుగుతూ తమ సుగంధాన్ని పంచిపెడుతున్నాయి. ఈ ఏర్పాట్లన్నీ అంగీరసమహర్షి యొక్క తపోభూమిలోనే జరుగుతున్నాయి. పైన చెప్పబడపిన మనోహర దృశ్యమాలికలన్నీ ఆయన తప:స్థలిలోని భాగమే.

ఋషులు చేస్తూవున్న విజ్ఞానశాస్త్రపు పరిశోధనలమీద సమగ్రమైన చర్చ జరపటానికిగాను ఆయన ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశాడు.

ఈ పరిశోధనా సమావేశంలో పాల్గొన్నవారి సంఖ్య వెయ్యికి పైగా ఉన్నప్పటికీ వారిలో బృహస్పతి పుత్రుడైన భరద్వాజుడు, ప్రగాథుడు, మునులలో శ్రేష్ఠుడైన వాంబరీషుడు, మేధాతిథిమహర్షి, ప్రకృతిపుత్రుడుగా తనని తాను పరిచయం చేసుకునే వసుశృతుడు..... మున్నగువారంతా తమ తమ స్థాయిలలో చేసిన పరిశోధనలు-ఫలితాలు కారణంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచిఉన్నారు. వీరందరూ ఋషుల విజ్ఞానం యొక్క పద్ధతీ - దాని వైవిష్యములు మీద ప్రత్యేకమైన ప్రయత్నాలు చేశారు. అంగీరసమహర్షి తాను చెప్పదలచుకున్న అంశాలను పూర్తిచేసి వారందరినీ ఒక్కసారిగా వేదికమీదకు రమ్మని ఆహ్వానిస్తూ, చర్చను ప్రారంభించవల్సిందిగా కోరాడు. ఆయన అభ్యర్థనను మన్నిస్తూ బృహస్పతి కుమారుడైన భారద్వాజుడు ఇలా అన్నాడు-ఋషుల యొక్క విజ్ఞానం జడవాదుల విజ్ఞానం (సైన్స్)తో పోలిస్తే కొంత భిన్నమైనది, ప్రత్యేకమైనదీకూడా! ఎందుకంటే పదార్థవిజ్ఞాన శాస్త్రజ్ఞుల యొక్క పరిశోధనలు. ప్రాణరహిత పదార్థాలకు మాత్రమే పరిమితమైనవి. అయితే ఋషులయొక్క పరిశోధనలకు, వైజ్ఞానిక ప్రయోగాలకు ఎల్లలులేవు. వారి యొక్క అనంతమైన, విస్తారమైన విజ్ఞానంలో ప్రకృతిలో జరిగే సమస్తమైన మార్పులు, భగవంతుని యొక్క శాశ్వతమైన స్వరూపం మిళితం అయిఉన్నాయి.

భరద్వాజమహర్షి యొక్క అభిప్రాయంతో ఏకీభవిస్తూ ప్రగాథఋషి ఇలా అన్నాడు, 'ఎవరో ఒకరి పట్టుదల, అభిప్రాయం లేదా పద్ధతితో ముడిపడిఉండే పరిశోధనలేవైనాసరే వాటిని సత్యాన్వేషణ అనలేం, వైజ్ఞానికపరమైనవి అనలేం. పట్టుదలలో ఉండే అవరోధాలు వైజ్ఞానిక వృత్తిని అవైజ్ఞానికంగా చేస్తాయి. హేతువాదుల విధానాలు ఇలాగే నిషేధాత్మకమైనవి. వారు తమనుతాము జడపదార్థాలు, వాటి శక్తి ప్రవాహాల యొక్క ఆరోహ-అవరోహాలలో బందీలుగా చేసుకున్నారు. దీని యొక్క భౌతిక, రసాయనిక, జైవిక గుణాలన్నింటినీ వారు అంగీకరించియే ఉన్నారు. అనంతమైన ప్రకృతిలో ఇలాంటివి ఇంకా మరెన్నో ఉన్నాయి అన్న విషయాన్ని వారు మరచిపోతున్నారు.

ప్రగాథమహాముని యొక్క వాక్కు ఎంతో మధురమైనది. వారు ఏ విషయాన్ని గురించి చెప్పినా, ఎవ్వరూ దానిని నిరాకరించలేరు. ప్రగాథమని చెప్పటం ఒకింత ఆగగానే, మునిశ్రేష్ఠుడైన

**విశ్వాసం లేనివారికి శాంతి లభించదు.**

వాంబరీశుడు ఇలా అందుకున్నాడు. నిజానికి హేతువాదులు, పదార్థం పదార్థం అని దేనినైతే పేర్కొంటున్నారో, అది ప్రకృతియొక్క తమోగుణానికి చెందిన ఒక సాధారణమైన స్వరూపం. త్రిగుణాలతోకూడిఉన్న ఈ ప్రకృతి యొక్క తమోగుణం పదార్థరూపంలో అభివ్యక్తమౌతూ ఉంటుంది. రజోగుణం ఇందులో జీవన ప్రవాహాన్ని క్రియాన్వితం చేస్తుంది. ఇక మూడవదిఅయిన సత్త్వగుణం ద్వారా ఇందులో (ఈ పదార్థాలలో) అధ్యాత్మిక చేతనత్వం వ్యక్తమౌతుంది. అందుచేత విజ్ఞానశాస్త్రం జరిపే పరిశోధనలలో జడపదార్థం దానియొక్క భౌతికశక్తులు, మనస్సు యొక్క తత్త్వం-దానికి సంబంధించిన అధ్యాత్మికశక్తులు........ మొదలైనవి అన్నీ ఉండితీరాలి.

ఋషుల విజ్ఞానంలో ఇదే సంపూర్ణత-సమగ్రతకూడా! చిఱునవ్వు నవ్వుతూ ప్రకృతి పుత్రుడైన వసుశృతుడు, వాంబరీశుని కథనాన్ని పూర్తిచేశాడు. ఆయన ఇంకా ఈ విధంగా చెప్పాడుకుండా, 'హేతువాదులు చేస్తున్న తప్పు ఏమిటంటే వారు ఏకపక్షంగా ఆలోచనలు చేస్తున్నారు. ఇంతేకాక వారు తాము చేస్తూఉన్న ఏకపక్షపు విధానాలనే సంపూర్ణత్వంగా భావిస్తున్నారు కూడా! అందుచేతనే వారు సత్యంనుండి, సత్త్వంనుండి దూరమౌతున్నారు. వారిలో వ్యతిరేకదిశలో పనిచేసే భగవంతుని యొక్క ఉనికిని గుర్తించనీయటం లేదు, వారు తమ మొండిపట్టుదలను, వ్యతిరేకపుటాలోచనలను వదిలించు కొనగల్గినప్పుడు. వారు కూడా సత్యాన్ని సాక్షాత్కరింప జేసుకోగలుగుతారు.

ఋషుల విజ్ఞానానికి చెందిన ఈ సూత్రమే సత్యం. ఇక్కడ ఎలాంటి వ్యతిరేకపుటాలోచనలకు, భావాలకు స్థానం ఉండదు. పట్టుదలకు చెంది అడ్డంకులు ఈ పరిశోధనాయాత్రను ఎటువంటి హద్దులలోనూ, రేఖలలోనూ బంధించలేదు. పరిశోధనలలో శ్రమిస్తున్నప్పుడు నిరంతరమూ సకారాత్మకమైన ఆలోచనలను కలిగిఉండాలి. అదే ఋషుల విజ్ఞానంలో ధ్యేయం. ఇంత గొప్ప విజ్ఞానంతో చేసిన పరిశోధనలకు లభించే ఫలితాలను కూడా సకారాత్మకతతో కూడిన సృజనాత్మక కార్యాలలోనే వినియోగించడం జరుగుతుంది. వ్యతిరేకదిశలో లేదా నిషేధాత్మక భావాలతో పరిశోధనలు చేసే వ్యక్తి, తనకు లభించిన ఫలితాలను కూడా విధ్వంసానికి, తద్వారా వినాశనానికి ఉపయోగిస్తాడు. నిపుణుడైన ఆయుర్వేద వైద్యుడు విషాన్ని కూడా ఔషధిగా ఉపయోగించుకోగలడు. అదే వైద్యుడుగనుక కుటిలుడు, కుబుద్ధి అయినట్లయితే, ఔషధాన్ని కూడా ఘాతుకరూపంలో (మరణానికి దారితీసేవిధంగా) ఉపయోగించటం జరుగుతుంది. ఋషుల విజ్ఞానంలో కేవలం సత్యమేగాక, భగవంతుని స్వరూపమైన శివమ్, సుందరమ్‌ల మేలుకలయిక కూడా ఉండితీరుతుంది.

ఎంతో సంతోషదాయకంగా జరుగుతూఉన్న చర్చను, అంగీరసమహర్షి మౌనంగా కూర్చుని వింటూ ఆనందిస్తున్నారు. మహర్షులందరి మాటలను వింటూ మధ్యమధ్యలో చిఱునవ్వు నవ్వుకుంటున్నారు. తాను ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం సార్థకమైనట్లు ఆయన భావించారు. ఆయన మనస్వియైన మేధాతిథి కణ్వమహర్షి వంక చూస్తూ 'తమరుకూడా ఏదైనా చెప్పండి మునివర్యా'! అని వేడుకున్నాడు. మేధాతిథి ఇప్పటివరకూ మౌనంగా కూర్చున్నారు. 'దశ్యాదృశ్యములకు' సంబంధించిన కొన్ని అంశాలపై ఆయన అంగీరసమహర్షి విన్నపం మేరకు ఈ వివరాలను తెలియచేశారు.

ఈ భూమిపైన పదార్థాలు వృక్షాలు, ప్రాణికోటులు..... వివిధ రూపాలలో ఉన్నట్లు, చేతనత్వపు శక్తులయొక్క పద్ధతుల్లో ఇతర దేవతలు, పితరులు, యక్షులు....... మున్నగువారు ఉంటారు. ఈ ధరామండలం యావత్తు కేవలం తమ శక్తి ప్రవాహాలతో మాత్రమే చలిస్తూ, నియంత్రింపబడుతూ ఉండదు.

ఇతర లోకాల యొక్క జడ, చైతన్యాలకు సంబంధించిన శక్తిప్రవాహాలు కూడా ఈ భూమి యొక్క గతిని ప్రేరేపిస్తూ, ప్రభావితం చేస్తూ నడిపిస్తూ ఉంటాయి. దృశ్యం-అదృశ్యం ఈ రెండింటికి సంబంధించిన అధ్యయనం కూడా ఋషుల విజ్ఞాన శాస్త్రంలో అతి ముఖ్యమైన భాగం. ప్రకృతి - సృష్టి ఈ రెండూ కూడా అన్ని విధానాల నుండి సకారాత్మకమైన, సహయోగాత్మకమైన సంబంధాన్ని కలిగి ఉంటాయి. "ప్రకృతి యొక్క శక్తి - భగవంతుని యొక్క ఉనికి సత్యము" అన్న వాస్తవానికి సార్థకమైన నిర్వచనం ఇదే. అందుచేతనే ' విజ్ఞానం యజ్ఞం తనేతే, కర్మాణి తనుతేపి చ!' అని వేదం చెప్తున్నది. అనగా విజ్ఞానమే యజ్ఞాలను, కర్మలను అభివృద్ధి చేస్తున్నది అని అర్థం. ఆధునిక విజ్ఞానంలోకూడా ఆధ్యాత్మిక చేతనత్వాన్ని కలిగించవచ్చు. అని ఋషులు తెలియచేస్తున్నారు.

*(అఖండజ్యోతి 2009, జులై)*

*(అనువాదం - కామరాజు కృష్ణకుమారి)*

**శాంతిలేని వారికి సుఖం దొరకదు.**

ధారావాహిక : భక్తిగాథ-23

# వ్రజ గోపికల ప్రేమ భక్తి సాధనకు పరాకాష్ఠ

ఋషుల భావచేతన భావ సమాధి స్థితిని చేరింది. కొంత సేపటికి బ్రహ్మర్షి వసిష్ఠులవారు భావ సమాధి నుండి తేరుకున్నారు. వారి నేత్రాలతో ఉజ్వలమైన భక్తి ప్రకాశిస్తోంది. మిగిలిన వారంతా భక్తిలో లీనమై ఉండడం చూశారు. తర్వాత ఇలా అన్నారు. దేవర్షి నారదుల వారు గొప్ప అదృష్టవంతులు. వారు భగవంతుని అవతార లీలలకు ఎల్లప్పుడూ సాక్షిగా, సహచరునిగా ఉన్నారు. వారిలాగా అంతటి మహాభాగ్యం ఎందరికి లభ్యమౌతుంది? గోపికల ఆంతరిక భక్తిని గురించి వీరు చూచి తెలుసుకున్నంతగా, అంతటి అనుభూతి వేరెవ్వరికీ కలుగలేదు. అందరితోను వారిలా అన్నారు – "వ్రజ గోపికల భక్తిని గురించిన విషయాలను మనందరికి వినిపించాలన్నది నా కోరిక".

తన మాటలను పూర్తి చేసి వారు మిగిలిన ఋషుల వంక దృష్టి సారించారు. అందరి కళ్ళలోనూ ఆసక్తి, ఆనందం తాండవం చేస్తున్నాయి. అందరూ కూడ కృష్ణ భక్తి యొక్క ఆనందాన్ని అనుభవించడానికి ఉవ్విళ్ళూరుతున్నారు. వ్రజ గోపికల మహోన్నతమైన భక్తి, వారి పవిత్ర హృదయమూ, అంతులేని అనురాగం, నిష్కామమైన హృదయ సమర్పణా భావమూ, ఇవన్నీ వేరెక్కడ లభ్యమౌతాయి? ఈ విధంగా వసిష్ఠ మహర్షి అందరి మనోభావాలను వ్యక్తం చేశారు. అందరూ వ్రజ గోపికల భక్తి చరిత్రను వినాలని ఉత్సాహంతో ఉన్నారు.

బ్రహ్మర్షులైన విశ్వామిత్రుడు, పులహుడు దేవర్షిని గోపికల భక్తిని గురించి వివరించుమని అర్థించాడు. దేవర్షి కొద్దిగా మందహాసం చేశారు. వారి నేత్రాల నుండి భావ బిందువులు ఉబికిపడ్డాయి. వారిలా చెప్పడం మొదలుపెట్టారు – "వ్రజ భూమిని నేను మరవాలన్నా మరువలేను. గోకులమూ, నందగావ్, బర్‌సానా, బృందావనంలోని ప్రతీ రేణువులోనూ భక్తి యొక్క పవిత్రమైన మాధుర్యం నిండి ఉంది. వ్రజ గోపికల కథ మానవ సంబంధమైనదిగా కనపడినప్పటికీ అది ఈశ్వర సంబంధమైంది. గోపికలందరూ శ్రీకృష్ణుని పరమేశ్వర స్వరూపాన్ని తెలిసిన వారు. ప్రేరేపింపబడినవారు. శ్రీకృష్ణుడు వారికి గొల్లపిల్ల వాడిగా ఉంటూనే ప్రియతమ పరమేశ్వరుడు". ఇలా చెపుతూ దేవర్షి తన తదుపరి సూత్రాన్ని ఉచ్చరించారు.

తత్రాపి న మహాత్మ్య జ్ఞానవిస్మృ త్యపవాదః (22)

అనగా – ఈ అవస్థలో కూడ గోపికలు మహాత్మ్య జ్ఞానాన్ని మరువలేదు.

"సర్వేశ్వరుడూ, త్రిభువన అధిపతి అయిన భగవంతుడు బాలుని రూపంలో తమ ప్రాంగణంలోనూ, తమ హృదయాలలోనూ ఆడుతూ ఉంటాడని వారందరికీ తెలుసు." నారదులవారు ఇలా చెప్పి కాసేపాగి మరల వినమ్రతతో చెప్పసాగారు. "ఈ రోజు నందగావ్‌లోని ఒకనాటి కథను వివరిస్తాను – నందగావ్‌లో సూర్యోదయవేళ ఆవులు, గొల్లలు, గోపగోపికలందరూ నిద్ర లేచారు. యశోదామాత స్నానాదులు ముగించుకొని తన ముద్దుల కొడుకుని అలంకరిస్తోంది. కృష్ణునికేమో తన స్నేహితులందర్నీ కలవాలన్న తొందర. అలాగే స్నేహితులు కూడా ఇతన్ని చూడాలని తొందర పడుతున్నారు. స్నేహితులైన సుదామా, మన్‌సుఖా మొదలైన వారంతా ద్వారం వద్ద చేరారు. అందరూ బృందావనానికి వెళ్ళాలని ఆతురతతో ఉన్నారు. యశోద బలరామునితో "బలరామా, నీవు పెద్దవాడివి, తెలిసినవాడివి, నీ తమ్ముడేమో అల్లరివాడు, నీవు నీ తమ్ముణ్ణీ, స్నేహితులనూ జాగ్రత్తగా చూచుకో" అని హెచ్చరించింది. బలరాముడు సరే అన్నట్లుగా తల ఊపాడు. తనలో తానే నవ్వుకున్నాడు. "పాపం! అమ్మ ఎంత అమాయకురాలు. ఎవరైతే సమస్త సృష్టినీ జాగ్రత్తగా చూచుకుంటాడో అతన్ని నేను జాగ్రత్తగా చూడాలా?" అనుకుంటూ ఏమి మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. దారిలో మన్‌సుఖా కృష్ణా! మనమీరోజు ఎక్కడికి వెళుతున్నాము? అని అడిగాడు. కృష్ణుడు చిరునవ్వుతో మనమెక్కడికీ వెళ్ళడం లేదు. రావడం లేదు. నన్ను ఎవరైతే పిలుస్తారో వాళ్ల దగ్గరకు వెళ్తాను."

మన్ సుఖాకు ఇదేమీ అర్థం కాలేదు. అతను కృష్ణునితో "కాన్ హా! గోపికల వద్దకు ఈ రోజు వెళ్ళవద్దు. వాళ్ళు ఎప్పుడూ మీ అమ్మతో మనమీద చాడీలు చెప్తారు" అన్నాడు. కృష్ణుడు కూడ మన్‌సుఖాతో ఎవరైనా నన్ను పిలిస్తే మాత్రం నేను ఆగేది లేదు. వారి వద్దకు వెళ్తాను. వారిలా మాట్లాడుకుంటున్నారు. అక్కడ గోపికలేమో తమ తమ ఇళ్ళల్లో వారి హృదయాధీశుని

శక్తి వంచన లేకుండా కృషి చేస్తే దేనికీ క్షమాపణ చెప్పుకోనక్కరలేదు.

రాక్కై ఎదురుచూస్తున్నారు. సుముఖి, సునయన, త్రిశాల, విశాఖ, శ్యామ ఇలా చాలా మంది స్నేహితులంతా తమ ప్రియతముని కొరకు వ్యాకుల పడిపోతున్నారు. ఎంతకూ కన్నయ్య రాలేదు.

“ఇక్కడ కన్నయ్య క్రొత్తగా చేయవలసిన లీలను గురించి రచన చేసుకుంటున్నాడు. ఆయన ప్రేరణతో సదాశివ భగవానుడు యోగి వేషంలో వ్రజ భూమికి వచ్చారు. భగవతి పూర్ణ మాసీ యోగ మాయ రూపంలో అతన్ని ఆహ్వానించి నవ్వుతూ ఇక్కడికెలా వచ్చారు ప్రభూ అని అడిగింది. భోలేనాథుడు కూడ నవ్వుతూ ఇదంతా ఆ నటన సూత్రధారి లీలలో నేనూ ఒక పాత్రధారిని. ఆయన ఎలా చెపితే నేను అలా చేస్తాను” అని చెప్పి యోగివేషంలో వ్రజ భూమి వీధుల్లో తిరుగసాగారు. ఆయన నోటి నుండి వెలువడుతున్న అలభ్ నిరంజన్ నామం వ్రజ భూమి అంతటా ప్రతిధ్వనిస్తోంది.

“సదాశివ భగవానుడు తిరుగుతూ, తిరుగుతూ ఒక గుమ్మం వద్ద ఆగారు. అక్కడ ఒక గోపిక నిలబడి కృష్ణుని కోసం ఎదురు చూస్తోంది. శివుడు గంభీర స్వరంతో ఎవరి కోసం మమ్మా ఇంతగా ఎదురు చూస్తున్నావు? అని అడిగాడు. యోగి దేవరా! కృష్ణుని కోసం ఎదురు చూస్తున్నాను అన్నది. ఆమె జవాబుకు అతను నవ్వుతూ ఎవరి మీదైతే నీవు యశోదకు చాడీలు చెప్పావో అతని కోసం ఎదురుచూస్తున్నావా? అతని చోరుడంటావు, తిడతావు కదా! ఎగతాళి చేస్తావు. అతని మీద చాడీలు చెప్పకుండా ఉండనే లేవు కదా! భోలేనాథుని ఈ మాటలు విని ఊరుకో లేక గోపిక గట్టిగ నవ్వడం మొదలు పెట్టింది.

“అంతేకాకుండా గట్టి కేకేసి తన స్నేహితురాండ్రందర్నీ పిలిచింది. ఈ యోగి చెప్పేదేమిటో వినండి. ఆ గోపిక వ్యవహారమేమిటో అంతుపట్టలేదు. గోపికలంతా గుమిగూడి శివభగవానుని చుట్టూ మూగారు. ఒకరితో ఒకరు ఈ యోగి చెప్తున్న దేమిటి అని అడుగుతున్నారు. అప్పుడు మొదటి గోపిక వీరు కృష్ణుని మీద ఎప్పుడూ చాడీలు చెప్పేవాళ్ళం ఎందుకు కృష్ణుని కోసం ఇంతగా ఎదురు చూస్తున్నామని అడుగుతున్నారని చెప్పింది.

జవాబుగా గోపికలందరు గట్టిగా నవ్వుతూ అన్నారు. “యోగి మహారాజా మీరు చాలా అమాయకులు. మా ప్రతీక్ష సామాన్యమైంది కాదు. ఇది జీవాత్మ పరమాత్మకొరకు ఎదురుచూచే ప్రతీక్ష, మా కందరికీ శ్రీకృష్ణుడు పర బ్రహ్మరూపుడని తెలుసు. మేము ఏమి చేసినా అతనిని ప్రసన్నుడిని చేసుకోవడానికే. ఇది వ్రజభూమి. ఇచ్చటి ప్రేమ కామంతో కూడినది కాదు. ఇచ్చటి ప్రేమ భక్తి సాధన. మేము అదే చేస్తున్నాము. ఇంక ఎవరూ ఏమీ మాట్లాడలేదు. ఇంతలోనే కన్నయ్య తన స్నేహితులతో అక్కడికి వచ్చాడు. మధురమైన వ్యంగ్య భాషణాలు చేసుకోసాగారు. సదాశివుడు ఇదంతా చూచి నమస్కారం చేసి అంతర్ధానమయ్యారు.” దేవర్షి వలన ఈ కథను విని అందరూ ఆశ్చర్యచకితులయ్యారు. ఇంకా ఎంతో వినాలన్న ఉత్సాహం వారికి కలిగింది.

అనువాదం – కె. అరవిందమ్మ

## శ్రీ గాయత్రీ శతకం

12. బుద్ధిసిద్ధి ప్రదాయిని శుద్ధమతిని
పెద్ద మనసుతో నోరార పిలిచినంత
ఒద్దికగ నిన్ను కరుణించి వృద్ధిసేయు
విశ్వ జనయిత్రి గాయత్రివేదమాత

**భావం:** వేదమాత అయిన గాయత్రి విశ్వానికే జనయిత్రి. మంచి బుద్ధిని, సిద్ధిని ఇచ్చే తల్లిని, శుద్ధమైన బుద్ధిని అందించే తల్లిని పరిపక్వం చెందిన మనస్సుతో నోరార పిలిస్తే అందుకు తగ్గట్టుగానే నీపై దయచూపి నిన్ను వృద్ధిలోకి నడిపిస్తుంది.

13. బ్రహ్మరూపిణి శాక్తేయి పాప హర్త్రి
విశ్వవాణి ఆ తల్లిని విశ్వసింప
సర్వపాపాలు హరియించి శాంతినిచ్చు
విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత

**భావం:** వేదమాత అయిన గాయత్రి విశ్వానికే జనయిత్రి. బ్రహ్మజ్ఞానమును రూపముగా దాల్చిన శక్తి స్వరూపిణి, పాపాన్ని హరించేది, విశ్వానికి వాణి అయినటువంటి వేదమాత గాయత్రీ దేవిని విశ్వసిస్తే సర్వపాపాలు పోగొట్టి శాంతినిస్తుంది.

రచన
సహజ కవి, సాహిత్య రత్న,
శతక చతురానన, పద్య కవితాసుధానిధి
శ్రీ అయినాల మల్లేశ్వర రావు

**శత్రు సంహారం అంటే వారిని మిత్రులుగా మార్చుకోవడమే.**

తత్వ చింతన

# యోగము మనను బ్రహ్మాండ రూపములో గల శక్తి సాగరముతో కలుపుతుంది

సమస్త సృష్టిని రెండు వర్గాలుగా విభజించవచ్చును. ఒక వర్గము కళ్ళకు కనబడేది, మన ఇంద్రియాలు చూడగలది, అనుభవించగలది, యంత్రములద్వారా దానిని ప్రత్యక్షంగా పొందగలది. అది విజ్ఞాన పక్షము. పదార్థ విజ్ఞానవేత్తల యొక్క పరిశోధనలు అంతవరకే పరిమితములై ఉంటాయి. దీనినే పదార్థ విజ్ఞానమంటారు. శాస్త్రీయ భాషలో చెప్పాలంటే ఇదే "అపరా" ప్రకృతి. రెండవ వర్గము "పరా" ప్రకృతి అని పిలవబడుతుంది. ఇది విశుద్ధ చైతన్యానికి చెందినది. మొన్న మొన్నటి వరకు విజ్ఞాన వేత్తలు ఈ సృష్టిని కళ్ళకు కనిపించేదానిగానే భావించేవారు. కానీ ఈనాడు పదార్థమంటే కేవలం అణువుల కదలికలకు ప్రతిక్రియ మాత్రమే గాక కనపడనిది ఏదో కలదని తెలుసుకున్నారు. అది ఒకవిధంగా ప్రకృతి యొక్క "అపరా" స్వరూపమును అంగీకరించడమే అయింది.

ప్రకృతి యొక్క ఈ "అపరా" స్వరూపాన్ని మామూలు మాటలలో చెప్పాలంటే "సూక్ష్మ జగత్తు" అని చెప్పాలి. ఇప్పుడు విజ్ఞాన శాస్త్రం దీనిని గురించి కూడా తరిచి చూడడం మొదలు పెట్టింది. ఇప్పుడు దానికి చెందిన అలజడిని, కదలికలను అణువుకు సంబంధించినవిగా గ్రహించి వాటిని "సమిష్టి చేతన" అని పిలుస్తూ పేర్కొనడమౌతోంది. బల్బులో ప్రసరించే విద్యుత్తు, దాని నుంచి ఏర్పడే వెలుతురు ఇపుడు వేరు వేరు తత్వాలుగా కాక అంతరిక్షంలో కనిపించే విద్యుత్ శక్తికే చెందిన ఒక మెరుపుగా తెలుసుకొనబడుతోంది. ఆ విధంగా ఆ రెండింటికి విడదీయరాని సంబంధం కలదన్నది అంగీకరింపబడుతోంది. ఇదే పద్ధతి వ్యష్టి సంబంధం విషయంలో కూడా వర్తింపబడుతోంది. వ్యష్టి చైతన్యం సమిష్టి చైతన్యం యొక్క ఒక అంగము కాని వేరు కాదని తెలుసుకోబడింది. వ్యష్టి చైతన్యాన్ని ఒక అగ్ని కణంగాను, సమిష్టి చైతన్యాన్ని వ్యాపించిన అగ్నిగాను తలచుట జరుగుతోంది.

వ్యష్టి చేతన విశ్వమంతటా వ్యాపించిన సమిష్టి చేతన యొక్క ఒక అంశము మాత్రమే. వ్యక్తి లోపల క్రియా కలాపాలు, చింతన, ఆలోచనలు, భావాలు, కోరికలు మొదలైనవన్నీ అతనికి మాత్రమే చెందినవై ఉంటాయి. కానీ ఆ తరువాత అతనిపైన సమిష్టి చైతన్యం అన్న అంకుశముంటుంది. ఈ సమిష్టి చేతనను వైజ్ఞానిక జగత్తులో బ్రహ్మాండీయ చైతన్యం అన్న పేరుపెట్టబడింది. దీనినే వ్యక్తి, సమాజం అన్న ఉదాహరణలద్వారా కూడా అర్థం చేసుకోవచ్చును. వ్యక్తి సమాజానికి చెందిన విడదీయరాని అంగం. అతను సమాజం నుండి విడిపడి మనజాలడు. ఏకాకిగా బ్రతుకుతున్నట్లు అనిపించినా సమాజం నుంచి విడిగా బ్రతకలేడు. అతనికి ఇప్పటివరకూ లభించిన జ్ఞానం, అనుభవం, సంస్కారం, కౌశలం, శరీర పోషణ మొదలయిన వాటన్నింటికి సమాజానికి ఋణపడి ఉంటాడు. అతను నిరంతరము ఏకాంతంలో ఉన్నా, సన్యాసిగా కొండకోనల్లో జీవయాత్ర సాగిస్తున్నా, వాటిని కొనసాగించడానికి కొన్ని ఉపకరణాలు అవసరం ఉంటాయి. మాల, కమండలం, కౌపీనం, దండం వంటి సాధనాలు లేకుంటే సన్యాసులకు కూడా పనిజరగదు. ఆంగ్లేయ సమాజ శాస్త్రవేత్త డి.డబ్ల్యూ. మైక్ అనువారు తాను వ్రాసిన "సోషల్‌మేన్ ఇన్ యాన్ సోషల్ కల్చర్" అనుగ్రంథములో మనిషి ఏకాకిగా తిరుగున్నంతకాలం అడవి మనిషిగానే ఉన్నాడు. అతను సామాజిక జీవనాన్ని ఆరంభించడమే అతని ప్రగతి పథంలో మొదటి అడుగు వేయడం క్రిందకే వస్తుంది. ఈ విధంగా ఏకాంతవాసి అనిపిలవబడు వాని యొక్క గడచిన గడుస్తున్న కాలాలకు చెందిన అన్ని విధాలైన పనిపాటలు తప్పకుండా సమాజంతో ముడిపడి ఉంటాయి. ఇక ముందు కూడా ఆ విధంగానే ఉంటాయి.

వ్యక్తి స్వతంత్రుడుగా కనిపించినా ఆ స్వాతంత్ర్యానికి ఒక హద్దుంటుంది. ఆ హద్దును దాటితే అతనికి సమాజం యొక్క సహాయం విధిగా పొందవలసి వస్తుంది. మనిషి సమాజము నుండి వేరుపడి ఎపుడూ ఉండలేడని భారతీయ సమాజ విజ్ఞాన శాస్త్రవేత్తలు తెలియజేశారు. సమాజం నుండి విడిబడ్డ మనిషి జంతువు కాడు. దేవతా కాలేడు. అందువలన సమాజ వ్యవస్థలో అంతర్భాగంగానే తాను బ్రతకాలి, దానితో నిరంతరమూ కట్టుబడి ఉండాలి. ఈవిధంగా వ్యక్తి స్వతంత్రుడుగా కనిపించినా ఆ స్వాతంత్ర్యం సమాజంతో ముడిపడిన స్వాతంత్ర్యం అని గ్రహించాలి. అతను సమాజానికి చెందిన ఒక అంగం మాత్రమే. సమాజం యొక్క ఇష్టాలు మానబిందువులుగా (గుర్తింపు చిహ్నాలుగా) మారుతూ ఉండడానికి కారణం ఇదే. బుద్ధిమంతులు, ఆలోచనాపరులు ప్రతిసారీ అపవాదులకు లోనౌతూ ఉంటారు. కానీ మామూలుగా లోకుల ఆలోచనల ప్రవాహం ఒకే వైపుకు

**ఊహలు సింహంలా భయపెడతాయి.**

పారుతూ ఉంటుంది. యుద్ధ సమయంలో లేక శాంతి సమయాలలో ఈ వాస్తవాన్ని చూడవచ్చును. పూర్వుల మాటల మీద నమ్మకం, వాటిని ప్రమాణంగా గ్రహించడాలు ఈనాడు అంతరించిపోతున్నాయి. తర్కం, ప్రమాణాలు ఆధారంగా గల బుద్ధివాదానికి గౌరవం, ప్రాధాన్యతలు లభిస్తున్నాయి. ఒకతరంలో త్యాగ బలిదానాలను, ఆదర్శవాదాన్ని కలిగి ఉండడంలో ఒకరికొకరు పోటీపడేవారు. ఆ విషయాలలో ఎవరెంత సఫలత సాధించగలిగితే వారు అంతగా గౌరవాన్ని పొందేవారు. కానీ ఈనాడు అందుకు పూర్తిగా వ్యతిరేక స్థితి ఏర్పడింది. ఈ రోజులలో విలాసమే ధర్మమయి కూర్చుంది. కూడబెట్టుకోవడం, అనుభవించడం, తమ గొప్పతనాన్ని చాటుకోవడం, ఘనతగా భావిస్తున్నారు. అత్యాశ అనే భూతం ప్రతి వ్యక్తి మస్తిష్కంలోను పీఠం వేసుకుని కూర్చుంది. ఈ ప్రవాహాన్ని లోక మానసమని పిలవవచ్చు. అనేక రకాల ఫ్యాషన్‌లు, వివిధ రకాల వ్యసనాలు, వివిధ రకాల పరంపరలు ఏర్పడుతుంటాయి. కాలం మారే సరికి వాటి స్థానంలో కొత్త ఫ్యాషన్‌లు, కొత్త వ్యసనాలు, తయారవుతూ ఉంటాయి. సామాన్య ప్రజలు ఆ ప్రవాహంలో కొట్టుకుపోతుంటారు.

బ్రహ్మాండానికి చెందిన చైతన్యం యొక్క ఉనికి, వ్యక్తిగతమైన చైతన్యానికి, దానికి గల సంబంధాలు, అవి పరస్పరం ఇచ్చి పుచ్చుకోవడాలు ప్రతిరోజు స్పష్టంగా కనబడుతున్నాయి, వాటినే ప్రామాణికాలుగా భావించడం జరుగుతోంది. మనిషి యొక్క అచేతన మనస్సు ఎంతో అద్భుతమైన, ఎంతో రహస్యమయమైనదిగా ఉంటుందన్నది నిజమని భావింపబడింది. దానితో పోలిస్తే చేతన మనస్సు యొక్క బుద్ధి శక్తి అతి తక్కువదై ఉంటుంది. ఈవిధంగా మనిషి అంతరిక్షంలోనికి విడిచిన ఆలోచనలు, వాటి పరిజ్ఞానములు అతి తక్కువవై ఉంటాయని తెలుసుకొనబడింది. రహస్యమయమైన ఆ ప్రవాహం సృష్టి యొక్క అచేతన చేతనతో ముడిపడినదని తెలుసుకోబడింది.

సాధారణంగా శారీరకమైన చైతన్యం జీవన విధానాన్ని కొనసాగించడం, కోరికలను తీర్చుకోవడంతోనే ముడిపడి ఉన్నట్లు కనిపిస్తుంది. దాని కదలికల యొక్క ప్రయోజనం కేవలం శరీరాన్ని సుఖంగా ఉంచడం, చైతన్యవంతంగా కొనసాగునట్లు చేయడం వరకే అన్నట్లు కనిపిస్తుంది. శరీరమే అన్నిటికన్న ముఖ్యమైనదని, దాని తుష్టి పుష్టులు, క్షేమములకు కావలసిన సరంజామాను పోగుచేసుకోవడానికే అది పుట్టింపబడిందని అనిపిస్తుంది. సామాన్యంగా చాలా మటుకు అట్లాగే భావింపబడుతూ ఆ విధంగానే శరీరం ఉపయోగింపబడుతూ ఉంది. అంతేగాక శరీర సుఖం కోసం మానవీయ చేతన ఎంత ఉపయోగకరమైతే అది అంత ప్రయోజన కరమైనదని, ఉత్తమమైనదని, అందులోనే దాని యొక్క సఫలత కలదని, అప్పుడే అది సార్థకత చెందినది అవుతుందని భావించడం జరుగుతున్నది.

ఇందులో నిజమెంత వరకు? లోతులలోకి దిగి ఆలోచిస్తే పై దానికి భిన్నమైన విషయం మరియొకటి తెలుస్తుంది. మానవ శరీరం వ్యక్తిగత చైతన్యానికి చక్కగా వికసించిన ఒక నివాస స్థలం. అందులోనే బ్రహ్మాండానికి చెందిన చైతన్యంతోబాటు జీవ చైతన్యం కలవడం సంభవమౌతుంది. వాటి యొక్క ఇచ్చి పుచ్చుకోవడాలు కారణంగా ప్రాణి కోటికి అనేక సౌకర్యాలు, సంవేదనలు లభిస్తాయి. ఇందులో అనేక శక్తివంతములైన కేంద్రాలు ఉన్నాయి. వాటివల్ల పిండాండ, బ్రహ్మాండముల ఐక్యతకు చెందిన అనుభూతి, దానివలన కలిగేలా భావాలు చాలా విచిత్రమైన పద్ధతిలో లభిస్తాయి. వాటిమధ్యగల సంబంధం, ఒకదానికొకటి ఇచ్చిపుచ్చుకునే పద్ధతి మొదలైన విషయాలను ఖగోళంలో జరిగే అనేక ప్రక్రియల ద్వారా అర్థం చేసుకోవచ్చును.

ఉదాహరణకు భూమిని తీసుకుందాం. భూమి ప్రత్యక్షంగా ఒక్కటిలాగే కనబడుతుంది. దాని సంపద, దాని స్థితిగతులు దాని హద్దులలోనే, దానికోసమే పనిచేస్తున్నాయి కాబోలనిపిస్తుంది, అట్లాగే కనిపిస్తుంది. చాలా కాలంవరకు నక్షత్ర శాస్త్రవేత్తలు కూడా అట్లాగే భావించారు. కానీ చాలాకాలం తరువాత అది గ్రహాల మధ్యలో జరిగే ఇచ్చి పుచ్చుకోవడాలను ఆధారం చేసుకుని జీవిస్తున్నదని తెలుసుకోవడం జరిగింది. సూర్యుని ఊర్జా లేక శక్తియందున్న శోషణ భూమి యొక్క వాతావరణాన్ని పుట్టిస్తుంది. శక్తి ఇంధనమని కూడా పిలువబడే దీనివలన జడ పరమాణువులకు, చేతన జీవాణువులకు అనేక రకాలైన కదలికలను కలిగించే సమర్థత ఎక్కువగా దీని నుంచే లభిస్తుంది. భూమి ఈవిధంగా తన నడకను కలిగి ఉండడానికి కావలసిన సమర్థతను దీని నుంచే పొందుతుంది. ఈవిధంగా భూమి తన ప్రత్యేకతలను నిలుపుకునే సామర్థ్యాన్ని చాలావరకు సూర్యుడి నుంచే పొందుతుంది. ఎంతో దూరంగా ఉన్నా సూర్యుడు భూమికి ఎంతో ఔదార్యంతో శక్తిని ప్రసాదిస్తాడు. అది చూస్తే భార్యా భర్తల లేక ప్రేయసీ ప్రియుల మధ్యగల సంబంధమనిపిస్తుంది. భూమి కూడా చుట్టూ తిరుగుతూ ఉండడం వల్ల తన జీవితానికి సార్థకృత కలిగించుకోవడంగా భావిస్తూ అతనికి కూడా సార్థకృతను కలిగిస్తుంది.

**ఒక లక్ష్యంతో కృషి చేసే వ్యక్తి ఎప్పుడో ఒకప్పుడు బాగుపడతాడు - స్టాన్లీ.**

చంద్రుడు భూమికి ఉపగ్రహం. ఐతే చంద్రుడు కూడా భూమిని ప్రభావితం చేస్తాడు. ఆ ప్రభావం ఎటువంటిదో సముద్రపు ఒడ్డునకు ప్రతిరోజూ వెళ్లి చూసినా, పున్నమి అమావాస్య దినాలలో సముద్రం పొంగడం, కృంగడం చూసినా అర్థమౌతుంది. కృష్ణపక్షంలోను, శుక్ల పక్షంలోను పృథ్విలోని ఓషధులైన చెట్టుచేమలలోను, ప్రాణులలోను ఏర్పడే సరసతలో కలిగే హెచ్చు, తగ్గులను గమనిస్తే చంద్రుడు కేవలం భూమిలోని సముద్రం మీదనే గాక భూమి మీద కనిపించే సమగ్ర సృష్టి మీద ప్రభావం చూపిస్తాడన్నది అర్థమౌతుంది.

ఇదే విషయం ఖగోళానికి చెందిన ఇతర పిండాలకు కూడా వర్తించడం చూస్తాం. సౌరమండలానికి చెందిన గ్రహాలు, ఉపగ్రహాలు వాటి వాటి స్థాయికి చెందినవి, వివిధ వర్ణములు కలవియైన చిన్న, పెద్ద ఉపగ్రహాలను నియమం ప్రకారం ఎల్లప్పుడూ భూమి మీదికి పంపిస్తూ ఉంటాయి. భూమి కూడా వాటిని మౌనంగా తీసుకుని కూర్చోదు. వాటికి బదులుగా తానిచ్చేవి కూడా ఇస్తుంది. ఆ ఇయ్యడం కూడా తాను తీసుకున్న దానికి ప్రతిగా ఇవ్వదగినది ఇస్తుంది. ఈ ఇచ్చిపుచ్చుకోవడాలు ఒక పద్ధతిలో కొనసాగుతాయి.

ఈ బ్రహ్మాండం ఎంతో విశాలమైన శక్తి సముద్రం. అందులోని ప్రతి భాగం ఒకదానితో ఒకటి సంబంధంకలిగి ఒక కుటుంబంగా వ్యవహరిస్తాయి. ఈ శక్తి సముద్రం జడ చేతనాలతో మిశ్రితమై ఉంటుంది. ఇందులోని ప్రాణుల యొక్క ఉనికి ఒక కోతి వలె ఎగురుతుంది, తన స్వతంత్ర అస్తిత్వాన్ని చాటుకుంటుంది, అవసరాన్ని బట్టి విలీనమై పోతుంది. ఈ జగత్తులో ఈ విరాట్ శక్తి రెండు ప్రవాహాలుగా ప్రవహిస్తుందని విజ్ఞాన వేత్తలు ప్రతిపాదించారు. అందులో ఒకటి భౌతిక శక్తి, రెండవది ప్రాణ శక్తి. ఈ రెండు శక్తి ప్రవాహాలు కలిసి ఒక ద్వంద్వాన్ని నిర్మిస్తాయి. ఈనాడు వికాసాన్ని పొందుతున్న విజ్ఞాన శాస్త్రం జీవనమంటే రసాయనిక సంయోగమని మాత్రమే ఒప్పుకోదు. ఇప్పుడు విజ్ఞానశాస్త్రం మనోచైతన్యాన్ని, మరణాంతరం అస్తిత్వాన్ని అంగీకరించడం మొదలుపెట్టింది. చైతన్యాన్ని జగత్తుకు సంబంధించిన ఒక స్వతంత్రమైన సత్తాగా అంగీకరించే దిశలో ముందుకు సాగుతోంది.

విశ్వంలో జడ, చేతనాలకు చెందిన రెండు రకాలైన శక్తులు తమ తమ నిర్దిష్ట ప్రయోజనాలను సాధించడంలో లగ్నమైయున్నవని మన ఋషులు ఏనాడో కనుగొన్నారు. పౌరాణిక శబ్దావళిలో వీటిని 'పర', మరియు 'అపరా' శక్తులని పేర్కొనుట జరిగింది. ఈ శక్తి సాగరం యొక్క గొప్పతనం కూడా మహా సముద్రాన్ని పోలినట్టిదే.

హద్దులలో ఉన్నదానిని హద్దులు లేని దానితోను, నీచమైన దానిని గొప్పదానితోను జోడించగలిగినప్పుడే అసాధారణమైనది, అసామాన్యమైనది అయిన దానిని పొందగలుగుతాం. సామాన్య స్థాయిలో చేతనా శరీరం దానికి సంబంధించిన అనేక ప్రయోజనాలను గురించి మాత్రమే ఆలోచిస్తుంది, నిర్ణయాలు తీసుకుంటుంది. అందుకు కావలసిన ఏర్పాట్లు చేస్తుంది. అసామాన్యమైన స్థితిలో అది చాలా ఉన్నత స్థాయిని అందుకుంటుంది. అప్పుడు బ్రహ్మాండ చేతన నుంచి ఇచ్చి, పుచ్చుకోవడం తీవ్రమౌతుంది, తద్వారా గొప్ప ప్రయోజనాలను పొందుతుంది. అవి విలక్షణమైనవిగాను, మహిమలు కలవిగాను ఉంటాయి. సామాన్య జ్ఞానం, సామాన్యమైన అనుభవాలు ఇంద్రియాల యొక్క శక్తిని ఆధారం చేసుకుని పొందగలుగుతాం. కానీ సుషుప్తావస్థలో ఉన్న అతీంద్రియ శక్తిని జాగృతం చేసుకోగలిగితే బ్రహ్మాండ శక్తితో మనం కలువగలుగుతాం. పరిమితం అయిన దానిని అపరిమితం చేయవచ్చును.

ఈవిధమైన వికాన, విస్తారాలను పొందడానికి ఉపయోగపడేదే యోగం. యోగసాధన యొక్క ఉద్దేశ్యం సీమితమైన దానిని ఏవిధమైన దానిని సీమలు లేని దానితో జోడించడం. ఇందులో ఎవరెంత సఫలతను పొందుతారో వారు ఆ వైభవాలు అంతగా పొందినవారు కాగలుగుతారు. దాని ప్రభావం నాలుగు దిక్కులలోను గల జడ చేతన జగత్తుల మీద వ్యాపించడం కనబడుతుంది. సమితుడుగాను, సీమా బద్ధుడుగాను ఉండడంవల్ల మనిషి తుచ్ఛుడుగాను, దరిద్రుడుగాను నిలిచిపోతాడు. హద్దులులేని తత్వంతో కలిసిపోతే ఎంతో ఉన్నతస్థితిని పొందగలుగుతాడు. సంపన్నులతో నిండిన భాండాగారంలో తాను ఎంత భాగస్వామి కాగలడో అతడంత గొప్పవాడౌతాడు. సిద్ధ పురుషులలో కనిపించే విశిష్ట లక్షణాలు విరాట్ పురుషునితో వారికిగల సంబంధం వలన కలిగినవే. అటువంటివారిలో ఆత్మ, పరమాత్మల మధ్య ఏవిధమైన అంతరాలుండవు, రెండూ సమానమైనవిగా కనబడుతాయి. ఇది నిజానికి వ్యక్తి చేతనను విశ్వ చైతన్యంతో జోడించడం వలన కలిగిన ఫలితమేగాని మరొకటి కాదు.

అనువాదం - కె.బి.సోమయాజులు

ప్రపంచం ఎప్పుడూ కాలం గుప్పిట్లోనే ఉంటుంది - మార్పులు తెచ్చేది కాలమే - భాస మహాకవి.

ధారావాహిక : నా స్మృతిపథంలో గురుదేవులు-37

# దురాచారాలు - నిర్మూలన

సమాజంలోని వ్యక్తులు స్వయంగా నిర్ణయించుకుని పని చేయజాలరు. సాంఘిక ఆచారాలకు, అప్పటికే అమలలోఉన్న పద్ధతులకు అనుగుణంగా వారి నిర్ణయాలు ఉంటాయి. అవి చెడు అచారాలైతే, సామాజానికి నష్టం జరుగుతుంది. ఈ దురాచాలను వ్యతిరేకించాలి. ఈ పని మనస్ఫూర్తిగా అమలుజరగాలి. దానికి సహాయం కావాలి. చాలా ఆచారాలకు విపరీతమైన ఖర్చు అవసరమవుతుంది. ఈరోజులలో ఇంత ఖర్చు సామాన్యుడు భరించలేడు. అందుకుగాను చెడుపద్దతిలో ధనం సంపాదించడానికి పూనుకుంటాడు లేదా కడుపుకాల్చుకుని పస్తుండి ఈ ఖర్చులు భరిస్తాడు. లేదా ఇంటిలోని వస్తువులను అమ్మిగాని, అప్పులుజేసి గాని అవమానాల పాలు అవుతాడు. అయినా ఈ దురాచారాలను అమలుచేస్తూనే ఉంటాడు. సాహసించి వీటిని వ్యతిరేకించడు.

**1 వర్ణాలు :** బ్రహ్మదేవుడు తనచే సృష్టించబడ్డ నలుగురు బిడ్డలకూ నాలుగు పనులు అప్పగించాడు. అవే రాను రాను నాలుగు వర్గాలుగానూ, నాలుగు వర్ణాలుగానూ మారాయి. ఈ నాలుగు పనులు జ్ఞానం, బలం, ధనం, శ్రమ. ఇవి సమాజానికి అవసరం. ఈ నాలుగు పనులూ నలుగురు బిడ్డలకూ అప్పగించాడు. బ్రహ్మ ఈ పనులను వారు శ్రద్ధతో చేయాలనీ, వారి బిడ్డలు అదే మార్గాన్ని అనుసరించాలనీ నిర్ణయించాడు. ఈ విధంగా చేస్తే వారిపనిలో నైపుణ్యం పెరుగుతుంది. వారు ఒకే రక్తం పంచుకొన్న అన్నదమ్ములు. వారిలో ఎక్కువ తక్కువలు లేవు. గౌరవ మర్యాదలలో తేడా లేదు. బ్రాహ్మణులు తమ జ్ఞానాన్ని, తపస్సునూ సమాజ శ్రేయస్సుకు ఉపయోగించాలి. త్యాగమూర్తులుగా సమాజం చేత గౌరవింపబడాలి. ఎవ్వరినీ చిన్న చూపు చూడరాదు. కాని ఈ రోజులలో జరుగుతున్నది వేరు. ఈ నాలుగు వర్ణాలను కులాలుగా ఉపకులాలుగా వారే విభజించుకున్నారు. సంఘంలో అనైక్యత పెరిగింది. కులాలలో ఎక్కువ తక్కువలు ఏర్పడ్డాయి. కులాలు అనేవి పని విభజన మాత్రమే అని గుర్తించాలి. అందరూ సమానులే.

**2. బాల్య వివాహాలు:** బాల్యవివాహాలు నిరసించబడాలి. వాటివల్ల వచ్చే అనర్థాలను ప్రజలకు తెలియచెప్పాలి. ఆరోగ్యపరంగానూ, అపరిపక్వమైన మనస్సు వల్లనూ, రాబోయే సమాజానికి (సంతానాన్ని) నష్టం వాటిల్లుతుంది.

**3. భిక్షాటన:** బిచ్చమెత్తుకునే వ్యవస్థని నిర్మూలించాలి. బిచ్చమెత్తడం అనేది గౌరవ మర్యాదలకు భంగకరం. కాని భారతదేశంలో బిచ్చగాళ్ళు పెరిగిపోయారు. అంగవికలురు, అనాథలైన వృద్ధులు, పనిచేయలేని వారూ, బిచ్చగాళ్ళగా తయారవుతున్నారు. వీరందరికీ ప్రభుత్వమే తగిన ఏర్పాట్లు చేయాలి. లేదా సమాజం నుండి విరాళాలు సేకరించి, స్వచ్ఛంద సంస్థలు వారిని ఆదుకోవాలి. అంతేగాని, వారు ఎవ్వరి వద్దా చేయిచాచరాదు. వారు తమ తమ శక్తికి తగిన పనులు చేయగల్గాలి. ప్రతి చోట ఇటువంటి సంస్థలు ఏర్పడాలి.

**4. శ్రాద్ధం పేరుతో ఖర్చులు :** ఎవరైనా వ్యక్తి మరణించినపుడు విందులు చేయడం పోయిన వ్యక్తిని అగౌరపరచటమే. విందులు సంతోష సమయాల్లో జరిగేవి, విచారంలో కాదు. బంధు మిత్రులు, చనిపోయిన వాని కుటుంబాన్ని ఆదుకోవాలి గాని, వారిచేత ఖర్చు పెట్టించరాదు. చనిపోయిన వ్యక్తికి కర్మకాండలు జరపాలి. ఆయన ఆత్మశాంతికి ఆయన పేరుమీద ప్రజోపకరమైన పనులు చేపట్టాలి. అదే నిజమైన శ్రద్ధ లేక శ్రాద్ధం.

**5. జనాభా పెరుగుదల :** జనాభాను తగ్గించటం ప్రతి ఒక్కరి బాధ్యత. జనాభా పెరుగుదల వల్ల అనేక సమస్యలు ఉత్పన్నం అవుతాయి. ఆరోగ్యపరంగానూ, విద్యావ్యాప్తికి, నివాసాలకూ సదుపాయాలు కల్గించడంలోనూ అనేక సమస్యలు ఏర్పడతాయి. వ్యక్తిగతంగానూ, సమాజపరంగానూ, దేశ భవిష్యత్తుకోసమూ, జనాభా నియంత్రణ అత్యవసరం. అలా జరగని పక్షంలో, ఆకలి, కరువుకాటకాలు, లంచగొండితనం ప్రబలుతాయి. ప్రతి వ్యక్తి తనకు తానుగా జనాభా నియంత్రణకు పూనుకోవాలి.

**6. జంతుబలి :** గ్రామాలలోని దేవతలేగాక, మానవులు సృష్టించిన మరికొన్ని దేవతలూ ఉన్నారు. ప్రతికులంలోనూ కుల దేవతలు అవతరించారు. గ్రామ దేవతలు వెలిశాయి. ఈ దేవతలకు జంతుబలి ఇచ్చే దురాచారం ప్రబలింది. ఈ దురాచారాన్ని నిరోధించాలి.

**7. దెయ్యాలు – భూతాలు :** దెయ్యాలనీ, భూతాలనీ మనమే సృష్టిస్తున్నాం. మాంత్రికులూ, భూతవైద్యులూ అమాయకులను భయపెట్టి డబ్బు గుంజుతున్నారు. ఈ భ్రాంతులను సమాజం నుండి తొలగించాలి.

**అనుకున్నవన్నీ జరుగవు - జరిగేవన్నీ మన మంచికే.**

**8. నిరక్షరాస్యత :** దేశాభివృద్ధికి నిరక్షరాస్యతా నిర్మూలనం చాలా అవసరం. ప్రభుత్వము, ప్రజా సంస్థలూ ఈ విషయంలో సమన్వయంతో కృషిచేయాలి. అప్పుడే ఈ పని సులభమౌతుంది. వయోవృద్ధులలో ఈ సమస్యను పరిష్కరించడానికి వయోజన విద్యా కేంద్రాలు ప్రారంభించి వారి ఖాళీ సమయాల్లో బోధించాలి. రాత్రి పూట ఇది అనుకూలంగా ఉంటుంది. మహిళలకు సాయంకాలం అనుకూలంగా ఉంటుంది.

**9. బురఖా అలవాటు :** ప్రాచీన కాలంలో ఆడవారు మగవారితో సమానంగా అన్ని విషయాలలోనూ పోటా పోటీగా ఉండేవారు. వారికి పూర్తి స్వతంత్ర్యం ఉండేది. వారి వారి సామర్థ్యాలతో సంఘానికి సేవ చేసేవారు. వారికి ఆంక్షలు ఉండేవి కావు. ఎవరో కొందరు కాకుండా అందరూ బురఖాపద్దతిని వ్యతిరేకించాలి. ముఖ్యంగా స్త్రీలే నడుంకట్టాలి. వారికి ఆత్మవిశ్వాసం కలిగేలా చేయాలి. మరొకరిపై ఆధారపడేవారిగా, రక్షింపబడేవారుగా, బలహీనంగా వారిని ఉండనీయకూడదు. విదేశీయుల దురాక్రమణ సందర్భంగా ఈపరదా వ్యవస్థ ప్రారంభమైంది. వారి నుండి రక్షణకుగాను ఘోషా పద్ధతి ప్రవేశపెట్టబడింది.

**10. అశ్లీలత :** అశ్లీల సాహిత్యం, అర్ధనగ్నస్త్రీదృశ్యాలు, చౌకబారు నవలలూ, చెత్తపాటలూ, సమాజాన్ని పాడుజేస్తున్నాయి. యువతీ యువకులను చెడుమార్గాలకు ప్రోత్సహిస్తున్నాయి. వీటివల్ల మన వివేకం నశించి మనం దుష్టులుగా మారే ప్రమాదం ఉంది. వీటికి మన గృహాల్లో స్థానం కల్పించకూడదు. వికాసంలేని చిన్నవారిని ఇవి పెడదారి పట్టిస్తాయి. వాటి వ్యతిరేకతకు ప్రజాఉద్యమం చేపట్టాలి. సమాజంలో వీటికి స్థానం లేకుండా చేయాలి. ఈ బాధ్యత రచయితలపై, పత్రికా సంపాదకులపై మరింత ఎక్కువగా ఉంది. వారు తమ బాధ్యతలు గుర్తించి సహకరించాలి.

**11. దుర్వ్యసనాలు :** మత్తుపదార్థాల ద్వారా జరిగే అపకారం అందరికీ తెలిసిందే, మన దేశ నిర్మాణం యువకులపైనే ఉంది. అయినా వారు మత్తు మందులకు బానిసలౌతున్నారు. శరీర అవయవాలు బలపడుతున్న తరుణంలో, మానసిక శక్తి ప్రబలమౌతున్న దశలో మత్తుపదార్థాల దురభ్యాసం, యువకులను నిర్వీర్యం జేస్తున్నది. వారి శరీరాన్ని బలహీన పరుస్తున్నది. ఇది చాలా దుఃఖకరము. త్రాగుడు, గంజాయి, ఛరస్, సిగరెట్లు, పాన్‌పరాగ్, పొగాకు యువకులకు అలవాటవుతున్నాయి. వాటిని నిరసించేవారిని చాదస్తులుగా పరిగణిస్తున్నారు. ఒక పద్ధతిలో వాటిని నిరోధించే విధానాలు రూపొందాలి. ఇది మంచి అలవాటు కాదని వారికి నచ్చు చెప్పగలగాలి. ఈ వ్యసనాలు నాగరిక చిహ్నాలు కావు. ఈ మత్తు పదార్థాల రాక్షసిని తరిమివేయడానికి కొన్ని పద్ధతులు పాటించాలి.

1) ప్రసిద్ధ వ్యక్తులచేత మత్తుపదార్థాల వల్ల జరిగే హానిని గూర్చి చెప్పించాలి.
2) మతాధికారుల యజ్ఞంలో ఆహుతులు యిచ్చే సమయంలో, హరికథా కాలక్షేపాలలోనూ, ఈ మత్తు పదార్థాలను విసర్జించాలని ప్రబోధించాలి.
3) సిద్ధులు. ఋషులు, స్వామీజీలు యువత వ్యసన విముక్తిని ప్రబోధించాలి.
4) మత్తు పదార్థాలు విడనాడిన వారి చేత వివరించి చెప్పించాలి.
5) డాక్టర్ల చేత మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాలను చెప్పించాలి.
6) కుటుంబ సభ్యులు , పిల్లలు, బంధువులు, స్నేహితుల ద్వారా మత్తుపదార్థాలకు బానిస అయినవ్యక్తిపై ఒత్తిడి కలిగించాలి.
7) ప్రభుత్వం మత్తుపదార్థాల ఉత్పత్తిని నిరోధించే శాసనం చేయాలి. ఆ దిశలో ప్రచారం జరగాలి.
8) వార్తాపత్రికలలో మత్తుపదార్థాలను సేవించడం వల్ల జరిగిన దురదృష్టకర సంఘటనలను పెద్ద అక్షరాలతో, ఫోటోలతో ప్రచురింపజేయాలి. ఆయా భయానక దృశ్యాలను ప్రచురించాలి.
9) యుగ నిర్మాణ యోజన ప్రచురణలలోని వ్యసన విముక్తి పుస్తకాలను ప్రతివ్యక్తి చదవాలి, చదివించాలి.

**12. ఆడంబర వివాహం :** ప్రతి క్రొత్త వివాహం, ఒక క్రొత్త కుటుంబ ఆరంభానికి నాంది. ఇటువంటి ప్రధాన సంఘటన ఒక మంచివాతావరణంలో, ఒక శుభ ముహూర్తంలో జరిగి అది జీవితాంతం సుఖమయంగా ఉంటుంది అటువంటి శుభ కరమైన ఘట్టం దుర్బుద్ధితో, దుర్భావనలతో ప్రారంభమయితే, అసంతృప్తికరంగా, తగాదాలతో నడుస్తుంది.

వివాహం అనేది సదుము విరిగే కార్యక్రమం అయింది. కట్నకానుకలనీ, లాంఛనాలనీ, చాలాసొమ్ము వరునికి సమర్పించవలసి ఉంటుంది. వధువుకు ఖరీదైన దుస్తులు. నగలు, మొదలగునవి ఇవ్వవలసి ఉంటుంది. ఆడంబరమైన ఊరేగింపులు, మేళతాళాలు, బాణాసంచాలు, ఖరీదైన విందు భోజనాలు, ఘనమైన స్వాగతసత్కారాలు కావలసి ఉంటాయి. ఈ ఆర్భాటాలన్నీ

నిన్ను లోకం గుర్తించడం లేదని బాధపడకు - ముందు నువ్వు లోకాన్ని తెలుసుకో.

ఖర్చుతో కూడుకున్నవి, ఉపయోగ శూన్యమైనవీనూ. ఇంత డబ్బు సంపాదనకు వధువుతరపువారు, అనుచితమైన మార్గాలు వెతకవలసి వస్తుంది. ప్రభుత్వ ఉద్యోగి అయితే లంచాలకు పాల్పడతాడు వారిని భయపెట్టి డబ్బుగుంజుతారు. కొందరు దొంగతనాలకు పాల్పడతారు. ఏదో విధంగా అవినీతితో డబ్బు సంపాదించడానికి అలవాటుపడతారు.

వీటిని అరికట్టాలంటే, ధైర్యవంతులైన యువతీ యవకులు సాహసించి ముందుకు రావాలి. విప్లవం అనేది మన ఇంటి నుండే ప్రారంభం కావాలి ఈ ఖర్చులు ఆపగలగాలి. తక్కువ ఖర్చుతో వివాహాలు జరిపించాలి. కట్నము ఇవ్వము, కట్నము తీసికోము, అని ప్రతిజ్ఞ చేయాలి. మంచి వాతావరణంలో, చాలా తక్కువ ఖర్చుతో వివాహాలు జరిపించాలి.

**ఇది జరగాలంటే ఏమి జేయాలి ?**

విద్యార్థినీ, విద్యార్థులకు ఈ కార్యక్రమాలలో కలిసిపని చేసేందుకు ప్రేరణ ఇవ్వాలి. పాఠశాలలలోనూ, కాలేజీలలోను విద్యార్థులను కార్యక్రమాలలో పాల్గొనేవిధంగా ప్రేరేపించాలి, ఉత్సాహపరచాలి. తమ గృహాలలో, వ్యతిరేకత వచ్చినా తక్కువ ఖర్చుతోనే వివాహం చేసికొంటామని వారి చేత ప్రతిజ్ఞ చేయించాలి. అంకిత భావంతో పని చేసే వ్యక్తులు కొందరైనా చాలు, వారే ఎంత పనైనా సాధించగలుగుతారు, తమ పనిలో ఎంతో మందిని ఆకర్షించగలుగుతారు. వారు అందరికీ ఆదర్శవంతులవుతారు.

**ప్రతిజ్ఞలు చేయించే కార్యక్రమం :**

ఈ కార్యక్రమం విద్యార్థులకే పరిమితం కాకూడదు. ప్రతి మనిషి ఈ కార్య క్రమంలో పాలు పంచుకోవాలి. ప్రతి కుటుంబాన్ని ఉత్తేజపరచాలి. వరకట్న వ్యతిరేకత ఒక విప్లవంగా సాగాలి. కట్నాలు, ఆభరణాలు, విలువైన బహుమతులకు ఖర్చు పెట్టినవారు బజారునపడుతున్నారు. దీనివల్ల కొందరు ఆడపిల్లలు వివాహాలు కాక ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఫలితంగా ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. ప్రజ్ఞామండళ్ళు సమిష్టిగా ఈ కట్న పిశాచిని ఎదుర్కోవాలి. ప్రతివాడూ కట్నపిశాచికి వ్యతిరేకంగా, ఆడంబర వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ తీసుకోవాలి.

ఆడంబర వివాహాలు తమ సన్నిహితుల ఇండ్లలో జరుగుతూ ఉంటే వాటిని బహిష్కరించాలి. ఈ బహిష్కరణ అందరికీ తెలిసి కొంత చర్చ జరుగుతుంది. కొందరిలోనన్నా మార్పు రావడానికి అవకాశం ఉంటుంది. ఒకే కులంలో రకరకాల శాఖలు ఉన్నాయి. ఈ ఉపకులాల వ్యవస్థను పెద్దల సహకారంతో నిరోధించాలి ఆడంబర వివాహాలను ఆపాలి. ప్రజాహిత సంస్థలు ఆడంబర వివాహాలను నిరోధించే కార్యక్రమం చేపట్టాలి. కొంత ఇబ్బంది కల్గినా తర్వాత ఫలితాలు చాలా బాగుంటాయి. పత్రికలు కూడా ఆడంబర వివాహాలను నిరసించాలి. ఆదర్శ వివాహాలను ప్రోత్సహించాలి. కట్నకానుకలకు వ్యతిరేకంగా వ్యాసాలను ప్రచురించాలి. ప్రజాభిప్రాయాన్ని, సేకరించి పత్రికాముఖంగా ప్రచురించాలి. రచయితలు కవులు, పత్రికలు పూనుకుంటే ఆడంబర వివాహాలను ఆపవచ్చు. అట్లే కట్న కానుకలకు వ్యతిరేకంగా, వాటి వల్ల జరిగే అనర్థాలను, ప్రముఖంగా ప్రచురించి ఈ వ్యవస్థను రూపుమాపాలి. 'యుగ నిర్మాణ యోజన' ప్రణాళిక క్రింద ప్రచురించిన చిన్న పుస్తకాలను అందరూ ప్రచారం చేయాలి. మతాధికారులు, గుళ్ళలోని పూజారులూ, పండితులూ, కట్నకానుకలకు వ్యతిరేకంగా, ఆడంబర వివాహాలకు వ్యతిరేకంగా తమ దగ్గరకు వచ్చిన వారికి నచ్చ చెపుతూ ఉండాలి. ఖర్చులేని, ఆదర్శవివాహాలను ప్రోత్సహించాలి. అప్పుడే మన చుట్టూ ఉన్న సమాజం బాగుపడుతుంది.

సామూహిక వివాహాలు జరిపిస్తే ఖర్చు చాలా తగ్గుతుంది. అందువల్ల వాటిని ప్రోత్సహించాలి. యుగనిర్మాణ యోజన కార్యకర్తలు ఇటువంటి సామూహిక వివాహాలను జరిపించడానికి నడుంబిగించాలి. ముఖ్యంగా వరుల తల్లి దండ్రులు వీటికి ముందుకు రావాలి. ఆదర్శ వివాహాలకు ప్రచారం బాగా రావాలి ఆదర్శ వివాహాలు చేసుకున్న వారినీ, చేయించిన వారినీ అభినందించాలి. రానున్న రోజులలో ఇటువంటి వివాహాలు జరిపించడానికి కృషి చేయాలి. మన కృషి తప్పకుండా జయప్రదమవుతుంది. మన ఆలోచనలలో మార్పువస్తే, దానివల్ల యుగం మారుతుంది.

ఇప్పుడు నేను చిన్న చిన్న పుస్తకాలను తయారు చేస్తున్నాను. వీటివెల చాలా తక్కువగా ఉంటుంది. గురుదేవుల ఆశీస్సులతో ఈ కార్యక్రమాన్ని చేపట్టాను. మహాకాలుని పిలుపు అనే పేరుతో కొన్ని పుస్తకాలు తక్కువ వెలకే లభ్యమయ్యే ఏర్పాట్లు చేస్తున్నాను. నా ఈ కృషికి మన కార్యకర్తలందరూ సహకరించాలి. నా సోదర సోదరీ మణులు ఈ విషయంలో మనకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తారు.

★★★

**పవిత్రమైన జీవితం గడిపేవాడే ఉత్తమోత్తమ కళాకారుడు - మహాత్మాగాంధీ.**

ప్రత్యేక వ్యాసం (గాంధీజయంతి సందర్భంగా)

# మహాత్ముడు మళ్ళీ మళ్ళీ పుడుతూనే ఉన్నాడు -మనమే వెతుక్కోవాలి మరి!

## 'గాంధీ' పల్లె - గ్రామ స్వరాజ్యం - "హివ్రే బజార్"

దోమల్లేని ఊరు. దొంగల్లేని ఊరు. కరవులేని ఊరు. వందశాతం చదువుల ఊరు. మద్యం దుకాణాల్ని తరిమేసిన ఊరు. 991/2 శాతం ప్రజలు దారిద్ర్యాన్ని గెలిచిన ఊరు. అదే ప్రజల చేత తీర్చిదిద్దబడిన ఊరు. **దానిపేరే మహారాష్ట్రలోని 'హివ్రే బజార్'.** 20 సంవత్సరాల వ్యవధిలో గ్రామ స్వరాజ్యంగా రూపు దిద్దుకున్న ఊరు.

అప్పుడే యూనివర్శిటీ పట్టాపుచ్చుకుని సొంతూరుకు వచ్చాడు "పోపట్ రావు పవార్" వస్తూనే గ్రామంలోని పేదరికం, అజ్ఞానం, కష్టాలు చూచి కదిలిపోయాడు. 'యువజన సంఘం' అంటూ పేరుపెట్టి ఊరికుర్రాళ్ళను పోగేశాడు. "జన్ = జనం, జల్ = నీరు, జంగల్ = అడవి, జానవర్ = జంతువులు అనే నాలుగు జకారాలను సమకూర్చుకోవాలి " అని సంకల్పం చేయించాడు. ప్రయత్నాల్లో పడుతూ ఉండగానే పంచాయతీ ఎన్నికలు వచ్చాయి. ప్రజలంతా కలసి పోపట్‌రావును గెలిపించారు. గ్రామ సభ తొలి సమావేశంలోనే తన ఆలోచనలను ప్రజల ముందు పెట్టాడు. గ్రామ ప్రజలంతా వెనక ఉండి ముందుకు నడిపించారు.

పోపట్‌రావు దృష్టిలో ఇది మరో స్వాతంత్ర్య సంగ్రామం. స్వాతంత్ర్య సమరయోధులంతా బయటి శత్రువులపై తిరుగుబాటు చేస్తే పోపట్ రావు గ్రామశత్రువులైన కరవు, పేదరికం, నిరుద్యోగం, అనారోగ్యం, అజ్ఞానం మొదలైన వాటిమీద దండయాత్రకు ఉపక్రమించాడు. పల్లెల్లో వీటికి మించిన శత్రువులు వేరే ఎవరుంటారు ?

## మొదటి దండయాత్ర నీటి కరవుమీదే

బోరుకోసం ఖర్చు పెట్టిన రైతు భోరున ఏడుస్తున్నరోజులు. కళ్ళల్లో నీరు రావల్సిందే కాని భూమిలో చుక్క నీరు పడడంలేదు. వానల్ని నమ్ముకుంటే, కొద్దిపాటి వానకు కొట్టుకొచ్చిన మట్టినే నోట్లో కూడ కొట్టు కోవాల్సి వస్తోంది. నిజానికి ఇదంతా స్వయంకృతాపరాధమే. పచ్చగా ఉన్న సహ్యాద్రి కొండలమీద ఉన్న చెట్లనన్నింటిని కొట్టేసుకున్నారు. పచ్చదనం తగ్గిన కొద్దీవానలు మొరాయించాయి. వర్షాలు లేకుంటే పంటలు లేవు. పంటలు లేక ప్రజలు వలసపోయారు.

ప్రకృతి అమ్మలాంటిది. కన్నీళ్ళు పెట్టుకుంటే కరిగిపోతుంది. కాళ్ళు పట్టుకుంటే కష్టాలు తీరుస్తుంది. హివ్రే బజారు ప్రజలంతా కలసి అడుగులు వేశారు. ఉపాధి హామీ పథకం క్రింద వనరుల్ని కాపాడుకునే ప్రయత్నం మొదలు పెట్టారు. కొండల మీద కురిసే నాలుగు చినుకుల్నీ ఒడుపుగా పట్టేసుకోవడానికి నిర్మాణాలు చేపట్టారు. జలం కావాలి అంటే 'జంగల్' (అడవి) కావాలికదా! జనమంతా ఒక్క త్రాటి మీదనడచారు. మొక్కలునాటడం మొదలు పెట్టారు. చుట్టూ కంచెకట్టారు. 70 హెక్టార్లలో పచ్చదనం ప్రాణం పోసుకుంది. 20 సంవత్సరాలు గడిచేసరికి 50 లక్షల మొక్కలు నాటుకున్నారు. ఎవరో ప్రణాళికలు వ్రాయడం, ఇంకెవరో అమలు చేయటం లాంటివి లేనే లేవు. ఆ పల్లె జనమే ఓ పంచవర్ష ప్రణాళిక తయారుచేసుకున్నారు. జలసంరక్షణనే ప్రధానలక్ష్యంగా పెట్టుకుని, అన్ని పథకాల్నీ దానికి అనుసంధానించుకున్నారు. ప్రభుత్వం నుండి అందే నిధులన్నీ నిజాయితీగా దానికే వినియోగించుకున్నారు. ప్రజల భాగస్వామ్యంతో నడిచింది కాబట్టి అవినీతికి ఆస్కారవే లేదు. అందరు కలసి 600ల ఇంకుడుగుంతలు తవ్వుకున్నారు.

## శ్రమ గెలిచింది, జలం జల జల ప్రవహించింది

జలవనరులు వృద్ధిచెందాయి. సాగుభూమి 260 హెక్టార్లకు పెరిగింది. దిగుబడి పెరిగింది. తొలివిజయాన్ని సాధించారు. పంటలతోపాటు పశు గ్రాసం దక్కింది. పశువులూ (జానవర్ = జంతువులు) పెరిగాయి. పశువులను కొనుక్కోవడానికి గ్రామ సభయే రుణాలు ఇచ్చింది. పాడివృద్ధి చెందింది. మెట్ట సాగుకే పరిమితమైన ప్రజలు వాణిజ్య పంటలు పండించసాగారు.

మంచి ప్రవర్తనతో తండ్రిని సంతోషపెట్టేవాడే నిజమైన పుత్రుడు

పొలాల్లో గొట్టపు బావులు త్రవ్వకూడదన్న నియమాన్ని పాటించారు. దాని ద్వారా జలసిరిని వృధా కాకుండా కాపాడుకున్నారు. చెరుకు, అరటి లాంటి నీళ్ళు మింగే పంటల్ని దూరంగా ఉంచారు. నీటి ఆడిట్ విధానాన్ని అందరూ నేర్చుకున్నారు. అందుబాటులో ఉన్న వనరులను బట్టి ఎవరు? ఏ పంట? ఎన్ని సార్లు వెయ్యాలో గ్రామసభే నిర్ణయిస్తుంది.

20 సంవత్సరాలలో హివ్రేబజార్ ప్రజల ఆర్థిక స్థితి పూర్తిగా మారిపోయింది. 1985 లో తలసరి ఆదాయం 832 రూపాయలు ఉండేది. ఇప్పుడది అక్షరాలా 30,000 లకు వచ్చింది. 50 కుటుంబాల ఆదాయం అయితే ఏటా 10 లక్షలకుపైనే. ఇప్పుడా ఊర్లో 25 కార్లున్నాయి. 17 ట్రాక్టర్లున్నాయి. 300 బైకులూ ఉన్నాయి. రెండుపూటలా కడుపునిండా భోజనంచేస్తూ ఇద్దరు పిల్లలకు విద్య-వైద్యం అందించగలిగితే సంపన్నుడి కిందే లెక్క. అలా చేయాలేని వారే దారిద్య్రరేఖకు దిగువన ఉన్నారన్న మాట. ఆరేఖకూడా వారు స్వచ్ఛందంగా గీసుకున్నదే. పూరి గుడిసెలు ఏనాడో మాయమైనాయి. గతాన్ని గుర్తుచేసుకోవడం కోసం ఒక్క గుడిసెను గుర్తుగా ఉంచుకున్నారు. ఆగుడిసె గతాన్ని గుర్తుచేస్తూ, భవిష్యత్తును హెచ్చరిస్తూ ఉంటుంది.

## బడి గంటలు గుడి గంటలు గణ గణమ్రోగాయి.

గతంలో ఒక పాడు బడ్డ భవనంలో 4వ తరగతి వరకు బడి నడిచేది. ఆపైన చదవాలంటే ఏడుకిలోమీటర్లు నడవాల్సివచ్చేది. ఆడపిల్లల్ని అసలే పంపేవారు కాదు. పనిష్మెంటు ఏరియాగా భావించి ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎవరూ వచ్చేవారు కాదు. పొట్టకూటి కోసం వచ్చినా అన్నీదుమ్మాలే. ఇప్పుడయితే 10వ తరగతి దాకా క్లాసులున్నాయి. ఊరి ప్రజల సహకారంతో పాఠశాల భవనం నిర్మించుకున్నారు. క్రమశిక్షణ, సమాజసేవ, పర్యావరణ పరిరక్షణ ప్రధాన పాఠ్యాంశాలుగా బోధించే ఉపాధ్యాయులు ఉన్నారు. చుట్టుప్రక్కల గ్రామాల పిల్లలు కూడా అక్కడికి వచ్చి చదువుకుంటున్నారు. విద్యార్థుల సంఖ్య 600లు దాటింది. పాఠశాలలో మొక్కల పెంపకం విద్యార్థుల ప్రాథమిక బాధ్యత. ఎక్కువ మొక్కలు పెంచిన వారికి ఏటా అవార్డులు ఇచ్చి ప్రోత్సహిస్తారు. ఊరుకు ఉపకరించే పని ఏది జరిగినా పిల్లలు పాలుపంచుకోవల్సిందే. ఆ పాఠశాల విద్యార్థులే డాక్టర్లు, ఇంజనీర్లు అవుతున్నారనీ, మున్ముందు కలెక్టర్లు కూడా అవుతారనీ పోపట్‌రావు సగర్వంగా చెపుతుంటారు. ఆధ్యాత్మిక విలువలు పడిపోకుండా దేవాలయం నిర్మించుకున్నారు. ఊర్లో ఉన్న రెండు ముస్లిం కుటుంబాల కోసం చిన్న మసీదు కట్టించి ఇచ్చారు.

## పరిశుభ్రతకు పెట్టింది పేరు

"మా ఊళ్ళో ఒక్క దోమ చూపిచినా 100 రూపాయలిస్తాను" అని సవాలు విసురుతాడు పొపట్‌రావు. ఏ మున్సిపాలిటీ, ఏ నగర పాలక సంస్థ, ఏ గ్రామ పంచాయితీ సాధించలేని విజయం ఇది. ఏ ప్రభుత్వామూ విసరలేని సవాలు ఓ చిన్న పల్లెకు సాధ్యం అయింది. ఇంటింటికీ మంచినీటి పంపులున్నాయి. మరుగు దొడ్డి ఉంది. భూగర్భ డ్రైనేజి ఉంది. పశువుల వ్యర్థాలన్నీ బయోగ్యాస్‌కు వాడుకుంటారు. వంట ఇంటిలో కట్టెలపొగలేదు. బహిరంగ ప్రదేశాలలో కాలకృత్యాలు తీర్చుకునే అలవాటు ఏనాడో మర్చిపోయారు. ఇంక దోమలు ఎక్కడ ఉంటాయి? ఏ బొంబాయికో హైదరాబాదుకో వలసపోయి ఉంటాయి. వినాయక నవరాత్రుల్లో కూడా మట్టి వినాయకుడినే పూజించాలి. అది పర్యావరణ పరిరక్షణకు నాంది. ఆడంబరాలు అసలుకే పనికిరావు.

## గ్రామసభ

ఎవరో నలుగురు పెద్ద మనుషులు కలసి మాట్లాడుకోవడం, అయిదో మనిషి సరే అనడం జరగదు ఆ ఊర్లో. హివ్రేబజారు గ్రామసభలో ప్రతి పౌరుడూ సభ్యుడే. సంకోచించకుండా తమతమ అభిప్రాయాలు చెప్పవచ్చు. భయపడకుండా విమర్శించవచ్చు. ఏ కార్యక్రమం మొదలుపెట్టాలన్నా గ్రామసభలో చర్చ జరగాల్సిందే. చిన్న చిన్న తగాదాలు ఇక్కడే పరిష్కరించబడతాయి. పెద్ద తగాదాలు రానే రావు. ఎవరైనా వి.ఐ.పి లు వస్తే తప్ప పోలీసులు ఆ గ్రామంలో అడుగుపెట్టాల్సిన పనేలేదు. దొంగతనాల ముచ్చటే లేదు. మద్యపానం ఊరువెుత్తానికే నిషిద్ధం. వ్యాయామశాల, గ్రంథాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పశువుల ఆసుపత్రి, ఆడిటోరియం మొదలైన కనీస సౌకర్యాలు అన్నీ ఉన్నాయి. వీటి అన్నింటికే నిధులు ప్రభుత్వానివే అయినా శ్రమ దానం మాత్రం ప్రజలదే. గ్రామాలు వృద్ధి చెందాలంటే కేవలం నిధులు మాత్రమే సరిపోవంటాడు పోపట్‌రావు. ప్రజల్లో కావలసిన సమైక్యత కోసమే అహర్నిశలూ కృషిచేస్తున్నాడు.

**కలిమిలోను, లేమిలోను ఒకేవిధంగా ఉండేవాడే నిజమైన స్నేహితుడు.**

## పొదుపు - సద్వినియోగం

నీటిని కూడా డబ్బులా పొదుపుగా వాడుకుంటారు ఈ ఊరి ప్రజలు. ప్రతీ సంవత్సరం అందరూ ఒక చోటకు చేరుతారు. అందుబాటులో ఉన్న నీటిని లెక్కగడతారు. ఈ నీళ్ళు ఎన్ని ఎకరాలకు సరిపోతాయో, ఏయే పంటలు పండిస్తే ఇబ్బంది ఉండదో నిర్ణయించుకుంటారు. నీటి ఆడిట్‌కి ఆరుబావుల్ని నమూనాగా అంచనా వేస్తారు. ఏటా జిల్లా భూగర్భజలవనరుల అధికారులు కొంత సాంకేతిక సహాయం అందిస్తారు. త్రాగునీటికి తొలిగా ప్రాధాన్యత ఇస్తారు. మిగులు నీటిలో 70% వ్యవసాయానికి వినియోగిస్తారు. మిగిలిన దానిని భూగర్భజలాల్ని రీచార్జి చేసుకుంటారు. ఎప్పుడయినా లోటు అనిపిస్తే నీటి అవసరం తగ్గే పంటల్నిపండించుకుని తృప్తి పడతారు. "ఈ విజయాలన్నింటికీ మూలకారణం వారిలో కలసికట్టు తనమే" అని వాటర్‌షెడ్ కమిటీ ప్రతినిధి శివాజీ భంగే నొక్కి వక్కాణిస్తారు.

ఉత్సవాలూ, ఊరేగింపులూ వాతావరణాన్ని రక్షించుకునే విధంగా నిరాడంబరంగా జరుపుకుంటారు. పోయిన సంవత్సరం గణేశ ఉత్సవానికి ప్రోగు చేసిన ధనంలో 21,000 రు. మిగిల్చారు. ఆ డబ్బును పొరుగూర్లోని కార్గిల్‌యోధుని కుటుంబానికి అందించారు. లాతూరు భూకంపంలో వీధుల పాలైన వారికి బట్టలు, గింజలు, పాత్రలు మొదలైనవి సేకరించి అందించారు. ఒక సారి గ్రామ సభలో పెండ్లికి ముందు హెచ్.ఐ.వి. పరీక్షలు జరిపించుకోవాలని తీర్మానించారు. అప్పటినుండి ఇప్పటివరకు స్వచ్ఛందంగా వైద్య పరీక్షలు చేయించుకుంటూనే ఉన్నారు.

## మహా మంచి సర్పంచి

ముంబాయిలో ఎం.కాం. చదివి వచ్చిన పోపట్ రావు ఉద్యోగం గురించి ఆలోచించలేదు. సొంత ఊరిని బాగుచేసుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. ప్రజలంతా కలసి సర్పంచిని చేశారు. అంతే ఇక పోటీనే లేదు. ఏకగ్రీవంగా ఎన్నికవడమే. ఈ 20 ఏండ్ల నుండి అయనే సర్పంచి, ప్రజలను ఏ విధంగా నైనాగెలుచుకోవచ్చుగానీ రాజకీయ వాదుల్ని కలుపుకురావడం చాలా కష్టం. పోపట్‌రావు ప్రజల సహకారంతో నేర్పుతో, ఓర్పుతో అన్ని రకాల ఇబ్బందుల్ని దాటుకుంటూ వచ్చాడు. గతంలో గ్రామాన్ని వదిలి పోయిన వలస రైతులు ఒక్కొక్కరే తిరిగివచ్చారు. పోపట్ రావు సార్కు సదస్సులో తన అనుభవాల్ని పరిచయం చేశాడు. వివిధ విశ్వవిద్యాలయాలలో, మేనేజ్‌మెంట్ స్కూళ్లలో గ్రామ స్వరాజ్యం గురించి ఉపన్యాసాలు ఇచ్చాడు. మహారాష్ట్ర ప్రభుత్వం "గోల్డెన్ జూబ్లీ ఇండియా విలేజ్ ప్రోగ్రాం" క్రింద 300 గ్రామాలను పోపట్‌రావుకు 'హివ్రే బజార్' లా తీర్చిదిద్దాలని దత్తతకు ఇచ్చింది.

మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యన్ని స్థాపించి చూపిన ఈ మహామంచి సర్పంచి జాతీయ అవార్డును అందుకున్నాడు. మహాత్ముడే కనుక మళ్ళీ వస్తే సబర్మతీ ఆశ్రమానికి వెళ్లడు. నేరుగా "హివ్రే బజార్"కే వెళ్లిపోతాడు.

*(16-08-09 ఈనాడు ఆదివారం అనుబంధం ఆధారంగా)*

## సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చు.

*అరవింద మహర్షి దగ్గరకు అమీ చంద్ అనే వ్యక్తి ప్రతిరోజూ వచ్చేవాడు. మహర్షి వద్ద పాటలు పాడి వినిపించేవాడు. అరవిందులకు కూడ ఆతని మీద ప్రేమ పెరిగిపోతోంది. కోయిలకంఠంతో పాడే ఆతని పాటలను ఎక్కువగా అభిమానించేవారు. ఒకరోజున సమాజ సభ్యులు వచ్చి అమీచంద్‌ను చూచారు. తరువాత మాటల సందర్భంలో ఆతని ప్రవర్తన సరిఅయినది కాదని చెప్పారు. మహర్షి శిష్యుల ద్వారా విచారణ చేశారు. అది నిజమే అని తేలింది. మరునాడు అతను రాగానే మహర్షి ఇలా అన్నారు. "నాయనా! నీ గాత్రం కోయిల గాత్రం. అందుకు సందేహం లేదు. నీ గుణమే కాకి గుణం అని తెలిసింది". అమీచంద్ ఒక్కసారిగా కుంగిపోయాడు. మహర్షి పాదాలకు నమస్కరించి "నేను గుణవంతుడుగా మారిన తర్వాతనే తిరిగి మీకు కనిపిస్తాను" అంటూ వెళ్ళిపోయాడు. మొట్టమొదట లంచం తీసుకోవడం మానేశాడు. క్రమంగా మత్తు పానీయాలను తీసుకోవడం మానేశాడు. ఏనాడో వదలివెళ్ళిన భార్యను తిరిగి తెచ్చుకున్నాడు. భార్యతో కలసి వచ్చి మహర్షికి నమస్కరించాడు. సంకల్పం యొక్క మహిమను తెలుపుతూ కమ్మని గీతం పాడి వినిపించాడు. అరవిందుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి.*

**భర్త హితం కోరి మసలుకునేదే నిజమైన భార్య.**

ధారావాహిక: దివ్యజీవన దర్శనం-66

# ప్రత్యక్ష చర్యకు జవాబు రక్షణ చర్య

ప్రత్యక్ష చర్య సందర్భంగా మధురలో కూడా ప్రదర్శనలు జరిగాయి. బెంగాలు, బీహారు, పంజాబులలో మారణకాండ ప్రారంభం అయింది. ఆ వార్తలు రాసాగాయి. అందువల్ల శాంతియుతంగా ఉన్న ఇతర నగరాలలో కూడా ఉద్రిక్తత మొదలయింది. ప్రత్యక్ష చర్యల సందర్భంగా జరిగిన ప్రదర్శనలూ, సభలూ మధురను కూడా ప్రభావితం చేశాయి. ఒక్క సంవత్సరంలో ఉభయ వర్గాలు బలపడిన సంఘటనలు సుమారు పదిహేను జరిగాయి. మధుర జిల్లాలో స్వరాజ్య సమితి సేనానులు శాంతిసేనను ఏర్పాటు చేశారు. శాంతిసేన కార్యకర్తలు ఉదయంపూట ప్రభాతభేరీలు నిర్వహించారు. మహాత్మా గాంధీగారి ఆశ్రమంలో గానం చేయబడే ప్రార్థనా గీతాలను గానం చేస్తూ కార్యకర్తలు వీధులలో ఊరేగింపులు జరిపారు. 'రఘుపతి రాఘవ రాజరామ్' గీతం మధుర వీధులలో మారు మ్రోగింది. ఈ ఊరేగింపులో ఈ ప్రభాత భేరీలలో శ్రీరామ్ కూడా పాల్గొన్నారు. శాంతి ప్రదర్శనలలో పాల్గొనడానికై ఆయన 'అఖండ జ్యోతి' పాఠకులకు ప్రేరణ ఇచ్చారు.

1947 జూన్‌లో దేశ విభజనకు ఆగష్టు 15న స్వరాజ్య ప్రాప్తికి అంతిమ నిర్ణయం జరిగింది. విభజన జరిగిన ప్రాంతాలలో అల్పసంఖ్యాక వర్గాలవారు హింసాకాండకు గురిఅయినారు. పశ్చిమపంజాబ్, సింధ్, తూర్పు బెంగాల్‌లలో హింస ప్రజ్వరిల్లింది. ఆ ప్రాంతాలలో నివసించే అల్పసంఖ్యాక వర్గాలవారు తమ మాతృభూమిని వదిలి వెళ్లసాగారు. ఇలా పారిపోయి వెళ్లేవారు అక్కడి ఘర్షణకారుల ఆగడాలకు గురిఅయ్యారు. ఘర్షణల వార్తలు దేశంలోని ఇతర భాగాలకు చేరాయి. ఆయా భాగాలలో కొందరు ప్రజలు ఇళ్లు వాకిళ్లు వదిలి వెళ్లిపోవడానికి సిద్ధపడసాగారు.

ఆ పరిస్థితుల మధ్య మధురలోని కొన్ని ముస్లిం కుటుంబాలు ఇళ్లూ, పొలాలు అమ్ముకుని పాకిస్తాన్ వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నాయి. పాకిస్తాన్ ఇస్లాందేశం అవుతుందనీ సుఖపడాలనే తమ కలలు అక్కడ నిజమవుతాయనీ భావించేవారు.

ఈ కుటుంబాల వారు పాకిస్తాన్ వెళతారనే వార్త అందిన వెంటనే శ్రీరామ్ తరపున మత నాయకుల బృందం రంగంలోకి దిగింది బృందంలోని నాయకులు ఆ కుటుంబాల వారిని కలుసుకున్నారు. దేశంలోనే ఉండిపోవలసినదిగా వారిని కోరారు. పలువిధాలుగా నచ్చజెప్పారు. 20 కుటుంబాలలో 14 కుటుంబాలు తమ నిర్ణయాన్ని మార్చుకున్నారు.

ఉద్రిక్తతతో నిండిన ఆ సమయంలోనే మధురలోని కొన్ని కేంద్రాలు ఉద్రేకానికి గురి అయినాయి. వీటిని రక్షించడం, శాంతి భద్రతలను కాపాడడం పోలీసు శాఖ పనులు. ఆ శాఖ అందుకు సిద్ధంగా లేదు. మధుర పమీపంలోని ఆగ్రా, భరత్‌పూర్ లు కూడా అట్టుడికిపోయాయి. ఆ స్థలాలలో కూడా శాంతి సేన ఏర్పాట్లు చేయబడింది. ప్రజలకు నచ్చజెప్పడానికి, సామరస్యంతో కలిపి ఉంచడానికీ ఆ సేన కృషిచేస్తోంది. ఆ స్థలాలకు వెళ్లవలసినదిగా శ్రీరామ్‌ను మత నాయకులు కోరారు. ఆయన కొన్ని సందర్భాలలో ఆ స్థలాలకు వెళ్లారు అయినా మధురలో ఉండడమే మంచిదని ఆయన భావించారు. ఆయన అవసరం అక్కడే హెచ్చుగా ఉన్నదని గుర్తించారు.

చౌక్, కేశవ దేవ్‌లలో ఉన్న మత కేంద్రాలపై దాడి చేయడానికి దౌర్జన్యవాదులు పథకం వేసినట్లు తెలిసింది. ఆ దాడుల నివారణకై శ్రీరామ్‌కు తన సహచరులతో, కార్యకర్తలతో కేశవదేవ్ పేటలోకి వెళ్లారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. అక్కడ ఘర్షణ జరిగే పరిస్థితి ఉంది. అక్కడ నివసించే అల్పసంఖ్యాక వర్గపు కుటుంబాలను కలుసుకోవాలని కార్యకర్తలు నిర్ణయించారు. ఉద్రిక్త వాతావరణంలో వారిని రెండవ వర్గం నమ్మడం కష్టం. హిందువులు వస్తున్నారని అక్కడి వారికి తెలిసింది. అయితే వారు శాంతిదళ సభ్యులని ఆ తర్వాత తెలిసింది. వచ్చే వారిలో శ్రీరామ్, ఆయన సహచరులు ఉన్నారు. ఈ వార్త అక్కడి ప్రజలలో నమ్మకం కలిగించింది. విధ్వంసం జరపాలని ఘర్షణకారులు విశ్వ ప్రయత్నం చేశారు. కానీ వారి ఆటలు సాగలేదు. పలువురు ఖైదు చేయబడ్డారు. దాడి జరగవచ్చనే భయం తొలగిపోలేదు. శ్రీరామ్ నలభై అయిదు రోజులపాటు ప్రతిరోజూ వెళ్లి అక్కడి ప్రజలను కలుసుకున్నారు. వారి సమస్యలు ఏమిటో, వారి భయాలు ఏమిటో తెలుసుకున్నారు. ఇతర కార్యకర్తలతో కాంగ్రెసు వారు ఆయనకు సహకరించారు. ప్రజల మనోబలాన్ని నిలిపి ఉంచడంలో ఈ కృషి దోహదం చేసింది.

★★★

ఏ పనీ చెయ్యనప్పుడు అన్నీ తెలిసినట్లే అనిపిస్తాయి.

### పరమపూజ్య గురుదేవుల అమృతవాణి

# నేటి ప్రజ్ఞావతారుడైన, యుగ దేవత యొక్క అప్పీలు-2

మిత్రులారా! మీరు చేసినా చేయకపోయినా భగవంతుడు తన పని ఎలాగూ చేసుకుంటాడు. శ్రీరామచంద్రుడు రావణాసురుడ్ని చంపకుండా ఉండేవాడా? తప్పకుండా చంపేవాడు. రావణుడితో సహా ఒక్కొక్క రాక్షసుడ్ని చంపి స్వయంగా సీతను చేజిక్కించుకోగల సామర్థ్యం ఉంది. కాని ఆయన కీర్తిని ఇవ్వదలిచాడు. ఇటువంటి పరిస్థితులలోనే దేవతలు భక్తులకు కీర్తిని కల్గించగలరు. ఇటువంటప్పుడే భక్తులు పరీక్షింపబడతారు, అదే గొప్ప కాలం. విద్యార్థులకు రోజు రోజు పరీక్షలు పెట్టరు. భక్తులకు కూడా పరీక్షలు రోజూ పెట్టరు, అప్పుడప్పుడు పెడ్తారు. గంగ ఒడ్డులో, హిమాలయాల ఒడిలో, గాయత్రీ తీర్థంలోని పవిత్ర వాతావరణంలో మీరు గాయత్రీ జపం చేస్తారు, చాలా సంతోషించదగిన విషయం, కాని అనుష్ఠానం చేయడానికి మాత్రమే మిమ్మల్ని పిలవలేదు. మా ఉద్దేశ్యం వేరు, ఇంతమంచి సమయంలో మీరేమైనా లాభం పొందగలుగుతారా? మీరు సమయాన్ని గుర్తించగలరా? మీరు భగవంతునికి సహాయపడగలరా? ఈ అద్భుత కాలాన్ని మీరు గుర్తించగలరా? అని మరీ మరీ అడుగుతాం. అందుకే మళ్ళీ మళ్ళీ పిలుస్తాం. ఈ గొప్ప సమయాన్ని గుర్తించగల తెలివి ఉంటే, మీ తెలివి దానికి సహకరిస్తే మాత్రం మీకింకో సలహా ఇస్తాను, ఇలాంటి సమయంలో ఇంకో సాహసం చేయండి. ఎలాంటి సాహసం? మీరు భగవంతుని కోరికను తెలుసుకుని దాన్ని పూర్తిచేయగలిగే ప్రయత్నం చేయండి. భగవంతుడికి కూడా కోరికలుంటాయి. ఆ కోరికల్ని తీర్చే ప్రయత్నం చేస్తే చాలా సంతోషం.

భగవంతుని కోరికలు ఏంటి? మీరంతా అఖండ జ్యోతి పాఠకులు, ప్రజ్ఞావతారం కోరికలేంటో మీకు తెలుసు. మనందరి బుర్రలు, ఆలోచన ప్రక్షాళన అవ్వాలని కోరాడు. దాన్నే ప్రజ్ఞ అంటారు. మనుషులు చాలా తెలివి మీరిపోయారు, ఎంతమంది తెలివితేటలు కలవారున్నారంటే మీరు తెలుసుకుంటే ఆశ్చర్యపోతారు. ఒక వైపు పెద్ద పెద్ద భవంతులు, పెద్ద పెద్ద బ్రిడ్జులు, పెద్ద పెద్ద ఫ్లై ఓవర్లు నిర్మించిన తెలివిమంతులు ఉంటే, మరో వైపు ఇనుముని, సిమెంట్‌ని మింగేసారు. మీరు ఎక్కడైనా ఏ డిపార్టుమెంటుకి వెళ్ళినా తెలివిమంతులు దొరుకుతారు. తెలివిలేని వాళ్ళు పాపం మహా అయితే చెప్పులు తీసుకుపోతారు. ఈ తెలివిమంతులే మొత్తం ప్రపంచానికి అన్యాయం చేశారు. ప్రపంచాన్ని శుభ్రపరిచే బాధ్యత ఈ తెలివిమంతులదే. హిందుస్థాను, పాకిస్థాను అని విడదీసి లక్షల మంది ప్రాణాలు తీసిన పాపం ఆ తెలివిమంతులదే. మామిడి పళ్ళమ్మేవాడిది కాదు. అందుకే అలాంటి పెద్ద వారి మస్తిష్క ప్రక్షాళనకే ఇటువంటి తరంగం ఉప్పొంగింది, ఆ తరంగం ప్రపంచంలో ఆలోచించే వారందరి పద్ధతినీ మార్చేస్తుంది. దాని పేరే ప్రజ్ఞావతారం. ప్రజ్ఞావతారుడు కోరుకునేదేంటి అనేదివిధిగా మేము ప్రచురిస్తూనే వస్తున్నాం. దీని గురించి మళ్ళీ వివరించవలసిన అవసరం లేదు కాని, ప్రజ్ఞా అభియానం రూపంలో ఈ తరంగాన్ని అర్థం చేసుకోగలరు. ఈ ప్రజ్ఞా అభియానం మనిషిది కాదు, మనిషిదై ఉంటే మనలాంటి వారం దీనికి తట్టుకోలేం. అది దైవ నిర్ణయం.

మిత్రులారా! నేనెప్పటి వరకు బ్రతికుంటానో తెలియదు, కాని మీలో చాలా మంది బతికుంటారు. బతికుంటే చూసి మా సాఫల్యాలను నోటు చేసుకోండి అవి ఎంత గొప్పవో. ఎలా జరుగుతాయో? ఎందుకంటే నేను అవతారునితో కలిసి హనుమంతునిలాగా చేతిలో చేయివేసి పని చేయాలని నిశ్చయించుకున్నాను. ఒక సాధారణ గొల్ల కన్య రాధ. కాని కొన్ని రోజులు కృష్ణుడితో కలిసి నాట్యం చేసింది, రాధగా మారిపోయింది. ఎవరెవరి గురించి చెప్పగలం! అద్భుత శక్తులకి తోడుగా పని చేసిన వారు ఎక్కడెక్కడికి చేరారు? ఎలా మారిపోయారు? అనేది చెప్పడం కష్టం. కాబట్టి ఈ వర్గంలో మీకు ప్రత్యేకమైన ఒక పిలుపుని అందించాలని పిలిపించాను. మీ మనస్సు గొప్ప లాభాలను అందుకోవడానికి పిలిపించాను. ఆ గొప్ప లాభాన్ని అందుకోగల వ్యక్తిత్వం కలవారు, ధైర్యం ఉన్నవారు అయితే ఈ అవకాశాన్ని వదులుకోకండి. ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోండి. మీలో ప్రతి ఒక్కరినీ తట్టి తట్టి అడుగుతున్నాను, ఎవరైతే ఇంటి బాధ్యతల నుంచి నివృత్తి పొందారో, ఎవరికి పెద్దగా బాధ్యతలు లేవో, వారందరినీ నేను ప్రార్థిస్తున్నాను, అర్థిస్తున్నాను, మీరు గనక ఏదో రకంగా జరుగుబాటు చేసుకోగలిగితే, రండి మా సైన్యంలో చేరండి. మీలో

**పనిని మొదలు పెడితే కాని మనలోని పస ఏమిటో మనకు తెలిసిరాదు.**

ప్రతి ఒక్కరినీ ప్రజ్ఞావతారుని చేతిలో చేయి వేయడానికి మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాను. ప్రత్యేకించి ఎవరైతే వారి అలవాట్లను సరిచేసుకున్నారో, శ్రమ జీవులో, చరిత్రవంతులో అలాంటివారు సమాజానికి ఉపయోగపడాలి.

మిత్రులారా! మీలో భావనాశీలురైన ప్రతీవారినీ ఆహ్వానిస్తున్నాను, ఎక్కువ బరువు బాధ్యతలు లేని వారిని ఇక్కడే ఉండుమని చెప్తాను. కాస్త బాధ్యతలుంటే వాటికీ సహాయ పడతాను. 24 వేల శక్తి పీఠాలకు అంత మంది మనుష్యులూ కావాలి. ఈ భవంతులలో ప్రాణం నింపడానికి నాకు కార్యకర్తలు కావాలి. మీ బాధ్యత మీరే చూసుకోగలనంటే సరే, లేకపోతే మీ భోజనం, బట్టలు, చిల్లర ఖర్చుల వ్యవస్థ చేస్తాను. మీ భార్యాబిడ్డల అవసరాలకు తగిన సామాగ్రిని కూడా నేను అందిస్తాను. నా వెనుక ఎవరున్నారో చూడలేరు. మీరు కళ్ళు తెరిచి నా వెనక ఉన్న అద్భుత శక్తిని చూడండి. నేను రిక్త హస్తాలతో ఉన్నాను. కాని మా గురువుగారు ఖాళీ చేతులతో లేరు. మా బాసు మీద నాకు నమ్మకం ఉంది. ఒక వేళ రెండు వేల మంది కార్యకర్తల్ని ఇక్కడ ఉంచాలన్నా దానికి కావలసిన వ్యవస్థ జరిగిపోతుందనే నమ్మకం నాకుంది. అంతకన్నా ఎక్కువ పనివాళ్ళను పెట్టుకోవాలన్నా ఆ వ్యవస్థ కూడా జరుగుతుంది. కాబట్టి ఎవరైనా ఉద్యోగం చేయదలుచుకుంటే వారు నేరుగా శాంతికుంజ్‌కి వచ్చేయమని ఒక ప్రకటన ఇస్తాము. వచ్చే నెలలో లక్ష మంది ఉద్యోగస్తులను సేకరించి చూపించగలను. యుగపరివర్తనకి చాలా పెద్ద కార్యాలు చేయవలసి ఉంటుంది. కాని అది పనివాళ్ళతో జరిగేది కాదు. ఆ పని భావనాశీలురు, త్యాగమూర్తులది. కాబట్టి అటువంటి శ్రమ జీవులు, భావనాశీలురైన వ్యక్తులు కావాలి. మిషన్ గురించి బాగా తెలిసినవారు కావాలి. అందరికీ ఎప్పటిదాకా నేర్పించగలను? ఎంతని నేర్పించగలను? వీరికి నేర్పించడానికి ఎంత సమయం పడుతుంది? నా దగ్గర చాలా తక్కువ సమయం ఉంది. మాకు మనుషులు కావాలి. మీరు స్వయంగా వారిలో కలవాలనుకుంటే రండి, మీకు స్వాగతం పలుకుతున్నాను. మీరు మరే పని చేసినా, వాటన్నిటికన్నా ఇది లాభదాయకమైన పని అని మీకు నమ్మకంగా చెపుతున్నాను. దీన్ని మించిన వ్యాపారం ఉండదు. నేను చేసింది ఇదే. అందుకే మీకు కూడా ఇంతకు మించిన లాభదాయకమైన వ్యాపారం లేదని నమ్మకంగా చెప్తున్నాను.

ప్రస్తుతం మన దగ్గర పది లక్షల మంది ఉన్నారు. మొత్తం ప్రపంచంలో 4500 కోట్ల జనాభా ఉంది. కేవలం మన భారతదేశంలోనే 70 కోట్ల కంటే ఎక్కువ జనాభా ఉంది. ఇంత మంది మనుషులను చైతన్యపరచడానికి మన దగ్గర ఉన్న 10 లక్షలమంది చాలా తక్కువ. ఇప్పుడు మన కార్యక్షేత్రం విశాలం చేయడానికి మీ అందరి సహాయం కావాలి. అందుకు మనం ఇప్పుడు అలాంటి సమూహాన్ని వెతకాలి. అలాంటి సమూహంలో మంచి ఆలోచనాపరులు, భావన ఉన్నవ్యక్తులు, త్యాగం, బలిదానం చేయడానికి ముందుకు వచ్చే వ్యక్తులు ఉంటారు. ఇప్పుడు మనకి ఇంజనీరులు, డాక్టర్లు, జవాన్లు, ఓవర్సీర్ల యొక్క అవసరం ఉంది. రాష్ట్ర నిర్మాణ కార్యక్రమాలు చేసేవారు కావాలి.

కొత్త క్షేత్రాలను, పరిచయం చేసుకోవటానికి మీరందరూ మాకు సహాయం చేయండి. ఏంపని చేస్తారు. నేను ఒక గొప్పదైన భవానికత్తిని తీసాను. ఇలాంటి ప్రణాళిక ప్రపంచంలో ఇంతవరకు ఎప్పుడు ఆలోచించడం జరగలేదు. ఇంతవరకూ ఏమి జరిగింది? ఇంత వరకూ మనం చదువుకునే వాళ్ళకి ఉచితంగా పుస్తకాలు క్రమబద్ధంగా చేరేలా చేస్తూవచ్చాము. మీరు చదువుకున్నవారికి నా వాణిని చేర్చండి, నా ఆవేదనను అందించండి. మీరు వారితో మా గురువుగారు చాలా సిద్ధ పురుషుడు అని చెప్పవద్దు. మహాత్ముడు, అందరి కోరికలు తీరుస్తారు అని చెప్పవద్దు, కాని మీరు ఏమి చెబుతారంటే మా గురువుగారికి కడుపులో అగ్ని ఉంది, ఆయన కళ్ళల్లో నిప్పు ఉంది. ఇలాగ పరిచయం చేయండి. కాని, మీరు గురువుగారిని సిద్ధ పురుషుడు లాగా పరిచయం చేయవద్దు. ఆలోచనలలో మార్పు తెచ్చేందుకు యుగసాహిత్యాన్ని వ్రాయడం మొదలు పెట్టాను, ప్రతి ఒక్కడి చేత చదివిస్తున్నాను, నా ఆలోచనా విధానాన్ని మీరు చదవండి, నా అగ్ని యొక్క నిప్పురవ్వను ప్రజ్ఞా అభియానంగా ప్రకటించటానికి యుగసాహిత్యం రూపంలో వ్రాయడం మొదలెట్టాను. దాన్ని అందరికీ చేర్చండి. వాస్తవ జీవితం యొక్క సిద్ధాంతాలను అర్థం చేసుకోండి, స్వార్థ ప్రపంచంలోంచి బయట పడండి. ఇచ్చి పుచ్చుకునే ప్రపంచంలోకి రండి. మీ చుట్టు పక్కల ఉన్నవారికి గురువుగారి ఆలోచనలను అందచేయండి. మీ పనులు చేసుకుంటూ కూడా ఈ పని చేయవచ్చు. యుగ సాహిత్యాన్ని మీ పరిధిలో తీసుకుని చదవడం మొదలెట్టండి, మీ పక్కింటి వాళ్ళ చేత చదివించండి. వాళ్ళకి నా ఆలోచనలను అందించండి. నన్ను ముందుకు సాగనివ్వండి. మీ వారితో సంపర్కం పెంచుకోవడం వల్ల నేను ఆ చదువుకున్న వాళ్ళని చేరటానికి

**ఇతరుల ప్రేమను పంచుకోలేకపోతే నిన్ను నీవు పరిశీలించుకో.**

సహాయం చేసినవారవుతారు. ఇది చేయకపోతే మీరు నా పని చేసేవాళ్ళుగా అనిపించుకోలేరు, నన్ను సంతోషపెట్టలేరు. మిత్రులారా, నా ఆలోచనలను అందరి చేత చదివించండి. ఆలోచనలను చదివిన వాడే నా శిష్యుడు. నా ఆలోచనలు చాలా తీవ్రమైనవి, తీక్షణమైనవి. నా శక్తి అంతా నా సాహిత్యంలో కనిపిస్తుంది. నేను ప్రపంచాన్ని మార్చివేయగలను అనే ధైర్యం నాకు నాశక్తిమంతమైన ఆలోచనల వల్లనే కలిగింది. కాని నా సిద్ధుల వల్ల కాదు. నా ఈ ఆలోచనలు అందరికీ ప్రచారం చేసి నాకు సహాయం చేయండి. ఇప్పుడు నాకు కొత్త తరం కావాలి, అందుకు మీరు చదువుకున్న వాళ్ళ మధ్యలోకి వెళ్ళండి, వాళ్ళ ఇళ్ళకి వెళ్ళండి, వాళ్ళ క్షేమ సమాచారాలు తెలుసుకోండి, వాళ్ళ పుట్టినరోజు సంస్కారాలు చేయించండి, వాళ్ళ తలుపు కొట్టి నా ఆలోచనాధారను వాళ్ళవరకు చేర్చండి.

మిత్రులారా! యుగసాహిత్యం, మాస పత్రికలు జన్మదిన సంస్కారం ఈ మూడు ప్రజ్ఞా అభియాన కార్యక్రమంలోకి వస్తాయి. మీరు ప్రజ్ఞాపుత్రులుగా నా కార్యకలాపాల్లోని పని చేస్తున్నవారు. అంగదుడు, నలనీలుడు, హనుమంతుడు, ఉడుత, శబరి, గుహుడు రూపంలో వచ్చినవారు. మీరు ఇక్కడికి వచ్చినందుకు నాకోసం ఇది చేయండి. మీరు నా పని చేయండి, నేను మీ పని చేస్తాను. నేను గాయత్రీ మాత కోసం చేశాను, గాయత్రీ మాత నాకోసం చేస్తుంది. నేను నా గురువుకోసం చేసాను, నా గురువు నాకోసం చేస్తారు. మీరు నా పనికి రండి, నేను మీ పనికి వస్తాను. ఇక నుండి అన్ని కార్యక్రమాలకు హాజరు కాలేను. కాని మీలోని ప్రతి ఒక్క కార్యకర్త సంవత్సరంలో ఒక్కసారైనా తన గురుద్వారానికి తప్పక రావాలి. ఇప్పటి వరకు మీరు నా దగ్గరకు వరాలకోసమే వచ్చారు. ఇక నేను మిమ్మల్ని అడుగుతాను. మీ చెమట, మీ కష్టాన్ని వరంగా అడుగుతున్నాను. మిత్రులారా! ఆశీర్వదించగల సామర్థ్యం ఉన్నవారు రండి, నాతో చేయి కలపడానికి రండి. గోవర్ధన పర్వతం ఎత్తే కర్రలా మీరు భాధ్యత వహించండి. నా సముద్రం మీద వంతెనకి కావలసిన ఇటుకల రూపంలో రండి. గాంధీజీతో కలిసి జైలుకు వెళ్ళేవాళ్ళలాగా మీరు మారాలి. నేను మొత్తం విశ్వాన్ని నా కార్యక్షేత్రంగా మార్చుకున్నాను. నేను ప్రతి ఒక్కడిని నా దగ్గరికి పిలుచుకుంటాను, వాడి స్థాయికి సమానంగా ప్రాణశక్తి నింపుతాను. నా కార్యక్రమంలో మీరందరూ నాకు సహాయం చేయండి. భగవంతుడు చేతులు చాచాడు. గురుదేవులు నా ముందు చేతులు చాచారు. శ్రీరామకృష్ణపరమహంస వివేకానంద ముందు చేతులు చాచాడు, చాణక్యుడు చంద్రగుప్తుని ముందు, సమర్థగురు రామదాసు శివాజీ ముందు చేతులు చాచారు. భగవంతుడి చేతులలో పెట్టబడిన వ్యక్తి ఎప్పుడూ చిక్కులలో పడడు. మీరు ఎప్పుడూ చిక్కులలో ఉండరు. మీ శ్రమను మీ సమయాన్ని అడగడానికి, మీ భావనలను అడగడానికి, మీ సామర్థ్యం, ప్రతిభలను అడగడానికి నేను మీ ముందు చేయి చాపుతున్నాను. మీరు విశ్వాసం ఉంచండి. నా పొలములో నాటిన విత్తనాలను మీకు వెయ్యి రెట్లుగా పండించి ఇస్తాను. మీరు నాకేదైనా ఇస్తే కదా నేను తిరిగి మీకు ఇవ్వటానికి. మీరు మీ శ్రమను, సమయాన్ని, భావనలను ఇవ్వండి. ఇదే నేటి ప్రజ్ఞావతారుడి అప్పీలు, యుగ దేవత యొక్క అప్పీలు. మహాకాలుని అప్పీలు శ్రీరామశర్మ అప్పీలు. మీరు ఏదైనా చెయ్యాలి అంటే చేసెయ్యండి. ఈనాటికి ఇక్కడితో ముగిద్దాం.

అనువాదం - చందన బృందం

*(వాఙ్మయం-68-చాప్టర్ 5)*

## అహంకార రహితుడు - మహాత్ముడు

*స్వరాజ్యం ఆందోళన సమయంలో మహాత్మాగాంధీ వేదికను అలంకరించి ఉన్నారు. ఆయన దృష్టి దూరంగా కూర్చుని ఉన్న ఒక వృద్ధునిపై పడింది. తన జ్ఞాపక శక్తినంతా కూడగట్టుకుని ఆలోచించారు. అప్పుడు గుర్తుకువచ్చింది. తనకు చిన్ననాడు చదువుచెప్పిన ఉపాధ్యాయుడు. వెంటనే లేచి నేరుగా ఆయన దగ్గరకు వెళ్లి పాదాలకు నమస్కారం చేశారు. పేరు ఊరు చెప్పి గుర్తు చేశారు. ప్రక్కనే కూర్చుని కుశల ప్రశ్నలు వేశారు. ఉపాధ్యాయుడు కూడ చాలా ఆనందపడ్డాడు. అవీ ఇవీ మాట్లాడిన తర్వాత "నీ కోసం అందరూ ఎదురు చూస్తున్నారు. వేదిక మీదకు వెళ్ళు"మన్నాడు. కాని గాంధీగారికి గురువు గారిని వదలివెళ్ళడం ఇష్టం లేదు. అయినా ఆయన కోరిక మీద నెమ్మదిగా లేచి వెళ్ళారు. తన శిష్యుని అహంకార రాహిత్యమే ఇంత గొప్పవాడిని చేసింది అనుకుంటూ మనసారా ఆశీర్వదించారు.*

**ఇష్టమైన పని లభిస్తే ఎలాంటివారైనా సులభంగా చేస్తారు.**

# మారుతున్న యుగంలో ఊహించని మార్పులు

అష్ట ఐశ్వర్యాలకు ఆలవాలం గోమాత. గోమాతనుండి లభించే పంచగవ్యం (పాలు, పెరుగు, నెయ్యి, మలము, మూత్రము) మానవునికి అనేక విధములుగా ఉపకరిస్తుంది. వందల సంవత్సరాల నుండి అనేక మంది మహాపురుషుల బోధనలను విని విని ప్రపంచం మెల్ల మెల్లగా కన్ను తెరుస్తోంది. గోమాత ప్రపంచానికి పరమేశ్వరుడు ప్రసాదించిన వరం. రసాయనిక ఎరువులు వాడగా వాడగా భూమి నిస్సారమైపోతుందని రైతులు గ్రహిస్తున్న రోజులు వచ్చేశాయి. గోమయంలో, గోమూత్రంలో దాగి ఉన్న క్రిమినాశక శక్తిని గుర్తించగలుగుతున్నారు. స్వచ్ఛంధ సంస్థల సహకారంతో సేంద్రీయ ఎరువులను తయారుచేసుకుంటున్నారు. ఆరోగ్యకరమైన రుచికరమైన ఆహార ధాన్యాలను పండించుకుంటున్నారు. ఫలితంగా పాలు ఇవ్వలేని గోవులను కబేళాకు పంపవలసిన అవసరం లేదని గ్రహిస్తున్నారు. గోసంపదను రక్షించుకుంటూ ఉన్నారు.

వరంగల్లు జిల్లాలోని "మైత్రేయ ధ్యాన స్రవంతి" వారు ప్రయోగ పూర్వకంగా సేంద్రీయ ఎరువుల వాడకాన్ని ప్రారంభించారు. గోమాత ముద్దు బిడ్డలైన రైతన్నలకు చక్కని శిక్షణను ఇస్తున్నారు. ప్రయోగాత్మకంగా కొందరు రైతులను చేరదీసి గోఆధారిత వ్యవసాయం మొదలుపెట్టారు. చక్కని ఫలితాలను పొందుతున్నారు. విశ్వగాయత్రీ పరివార్ - ఉత్తర ప్రదేశ్‌లో సేంద్రీయ ఎరువులపై అనేక విధాలుగా పరిశోధనలు చేపట్టింది. " బ్రహ్మవర్చస్ శోధ్ సంస్థాన్" ద్వారా యజ్ఞోపతి సిద్ధాంతాన్ని ఋజువు చేస్తూఉంది. యజ్ఞం ద్వారా వాతావరణ కాలుష్య నివారణను పరి పరి విధాలుగా తెలియ చేస్తూఉంది. గో ఆధారిత ఆహారం, గో ఆధారిత వ్యవసాయం సాధిస్తున్న ఫలితాలను ప్రత్యక్షంగా చూపించగలుగుతోంది.

ఒక్క భారతదేశంలోనే కాదు. ప్రపంచదేశాలలో కూడా గోమాత మహత్తును గుర్తించడమే కాదు. క్రియాన్వితం చేస్తున్నారు.

### సౌదీ అరేబియాలో

'యుజప్పర్ హుస్సేన్' అనే భారతీయ ముస్లిం రచయిత హిందీ, మరాఠీ, గుజరాత్, ఇంగ్లీషు, ఉర్దూ, అరబ్బీ, ఫారసీ భాషల్లో రచనలు చేశారు. "మహమ్మదీయుల్లో కూడా శాఖాహారులున్నారు" అని వ్రాస్తూ తెలిపిన విషయాలకు భారత ప్రభుత్వం అవార్డునిచ్చి గౌరవించింది. బాంబే విశ్వవిద్యాలయం నుండి కూడా అవార్డు లభించింది. "ముస్లిం ఔర్ శాఖాహార్" అనే ఉర్దూ పత్రిక ద్వారా యుజప్పర్ హుస్సేన్ తెలిపిన విషయాలను క్రింద పొందుపరుస్తున్నాం.

సౌదీ అరేబియారాజధాని రియాద్. రియాద్ నుండి 100 కిలో మీటర్ల దూరాన దక్షిణంగా "ఆల్‌శఫిఅ" (దయగల) అనే ఒక గొప్ప స్వచ్ఛంద సంస్థ ఉంది. ఆ సంస్థ ద్వారా ప్రపంచంలోనే అతి పెద్ద 'గోశాల' నిర్వహింపబడుతోంది. ఆ గోశాలలో 36,000 గోవులున్నాయి. వాటి సంరక్షణ కొరకు 1400 మంది కార్యకర్తలు పని చేస్తున్నారు. ఆవుపాల సేకరణకై ఆధునాతన యంత్రాలను ఏర్పాటు చేసుకున్నారు. గోమయము, గోమూత్రంతో సేంద్రీయ ఎరువులను తయారు చేసి, ఎడారిలో కూరగాయలు పండిస్తున్నారు. గోమాత యొక్క ప్రాముఖ్యాన్ని తెలుసుకుని సౌదీ ప్రజలు భయంకరమైన వ్యాధుల నుండి విముక్తిని పొందుతున్నారు. గోమూత్రము నుండి విద్యుత్తు తయారు చేసుకుంటున్నారు. సౌదీలోని ముస్లిములే గోమాత మహిమను గుర్తించగలుగుతున్నారంటే మన మహనీయులు తెలిపినట్లుగా యుగం మారుతున్న లక్షణాలే తప్ప వేరుకావు అని ఘంటా పథంగా చెప్పవచ్చు.

### రష్యాలో గోహత్య కు శిక్ష

గోహత్య మహాపాతకం, గోవుతల్లితో సమానం, ఆదరించి పోషించాలి తప్ప, హింసించి వధించరాదని మన హిందూ ధర్మం తెలిపింది. ఈ ధర్మాన్ని కాపాడతామని రాజకీయపార్టీలు కంకణం కట్టుకున్నాయి. అయినప్పటికీ భారతదేశంలో గోమాతకు రక్షణ కరవే అన్న విషయం అందరికీ తెలిసిందే.

"కానీ రష్యాలో ఈనాడు గోమాత విలువను గ్రహించారు. ఇప్పుడక్కడ గోహత్యకు శిక్ష అమలులోకి వచ్చింది. జుల్సత్ కల్బయెన్ అనే వ్యక్తి ముస్లిములు ఎక్కువగా ఉండే తర్కిస్థాన్ లోని మారుమూల గ్రామంలో ఉండేవాడు. ఒక నాడు అతను ఇనపరాడ్ తో ఒక గోవును కొట్టాడు. దాంతో అది అక్కడికక్కడే పడి చచ్చిపోయింది. ఈ నేరానికి గాను అతనికి కోర్టు 6నెలలు కారాగార శిక్ష వేసింది". ఈ శిక్షా కాలంలో అతడు కష్టించి పని చేయాలి. వచ్చిన ఆదాయంలో 10వ వంతు జరిమానాగా చెల్లించాలి. "అని తీర్పు చెప్పింది. మన దేశంలో రోజూ వేలాది గోవులు వధకు గురి అవుతున్నాయి. కాని నేరస్థులకు ఏలాంటి శిక్ష ఉండడంలేదు. ఇది అందరూ ఆలోచించాల్సిన విషయం". (10–8–09 ప్రత్యేక సంచిక జాగృతి ఆధారంగా)

10–8–09 నాటి జాగృతి ప్రత్యేక సంచికలో "గోఆధారిత సేంద్రీయ వ్యవసాయం లాభదాయకమే" అన్న వ్యాసం అందరు చదువదగినది. ఆలోచించి ఆచరించదగినది. ఏది ఏమైనా యుగం మారుతోంది. మంచిరోజులు వస్తున్నాయి. మనం మారడానికి సిద్ధం కావాలి.

బత్తుల రాజావీరు, వరంగల్

(మైత్రేయధ్యాన స్రవంతి సంస్థాపకులు)

**అన్ని పనులను ఇష్టం చేసుకోవడంలోనే గొప్పదనం ఉంది.**

ధారావాహిక: దేవసంస్కృతీ సౌరభం-28

# భారతీయ సంస్కృతియే దేవ సంస్కృతి

## భారతీయ సదాచారము

పెద్దలయందు భక్తి కలిగి ఉండడమన్నది భారతీయ సంస్కృతికి మూలాధారం. చిన్నవారు పెద్దల పాదాలు తాకి తమ భక్తిని, వినయాన్ని, సఖ్యతను కనబరుస్తారు. పెద్దలు చిన్నవారికి ప్రేమతో ఆశీర్వాదములిస్తారు. నిజానికి ఈ సదాచారములో ఒక మనోవైజ్ఞానిక సత్యం దాగిఉంది. ప్రతి మనిషి మనస్సులోను ఆలోచనాశక్తి నిండి ఉంటుంది. ఆ ఆలోచనలు అనే విద్యుత్తు అతని శరీరమంతటిలోను వ్యాపించి ఉంటుంది. ఎవరైనా చిన్నవారు పూజ్యులైన పెద్దల పాదాలు తాకినప్పుడు వారి ఆలోచనలకు చెందిన ఆ విద్యుత్తు వారి శరీరములో ప్రవహించి పాదములను తాకినవారి ఆత్మబలాన్ని పెంచుతుంది. మనలో పెద్దలను గౌరవించే ఆచారముంది. ఇందుకొక ఉదాహరణ భరతుడు. అతను తన పెద్దన్న గారయిన శ్రీరాముడిని జీవితాంతము గౌరవించాడు. ఈతనిని ఆదర్శంగా తీసుకోవాలి. మన కన్నపెద్దవారయిన వారితో శాంతి, నమ్రత, వినయ శీలతలతో వ్యవహరించాలి. వారితో మాట్లాడే సమయంలో అయ్యా, శ్రీమాన్, గౌరవనీయ, స్వామి వంటి శిష్టాచార సూచకలైన పదాలను వాడాలి. పెద్దలనుంచి ఉపకారము పొందిన తరువాత "నేను తమ అనుగ్రహాన్ని పొందాను, తమరు నాకెంతో ఉపకారం చేశారు. తమకు నేనెంతో కృతజ్ఞుడను" – వంటి శబ్దాలను ప్రయోగించాలి. మీ మాటలు మధురమైనవిగాను, శుద్ధమైనవిగాను, శిష్టతతో కూడినవిగాను ఉండాలి. హిందూ శిష్టాచారాలు ఇతరుల పట్ల ఎంతో శిష్టత, ఉదారత, సఖ్యతలతో నిండినదై ఉంటుంది. ఆఖరికి బిచ్చగాడిని కూడా ఏమీ పెట్టకపోయినా ప్రేమ పూర్వకంగా అవతలకు పంపే అలవాటుమనది.

స్వచ్ఛత మన శిష్టాచార ప్రవర్తనలో ఒక ప్రధానమైన అంగము. మనవంట ఇంటి నిర్వాహణ చాలా ప్రసిద్ధమైనది. దానిని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా పెట్టుకోవడము మనకు అలవాటు. దానిలో ఏ విధమైన మురికిని చేరనీయక పోవడమే గాక అనవసరమైన వ్యక్తులు మాటి మాటికీ వంటయింటిలోనికి రావడం కూడా మనము సహించం. స్వచ్ఛత, పవిత్రతల కారణంగా పవిత్ర స్థానములలోనికి చెప్పులతోవెళ్లడం కూడా మనం అంగీకరించం.

''వ్రత నహి భవస్యార్యోన ధనేన విద్యయా'' అని తెలుపబడింది. విద్యవలన గాని, ధనమువలన గాని కాక వ్యక్తి సదాచరణ వలననే ఆర్యుడౌతాడని దాని అర్థం.

## వేషము - భాష - ఆభరణాలు.

భాష, వేషములకు తోడు పైకి కనబడని ఒక ప్రత్యేకమైన ఆలోచనల ధార, జీవన పద్ధతి సంస్కృతితో ముడి పడి ఉంటుంది. మనము మాట్లాడే భాష, ధరించే వేషములలో మనం నివసిస్తున్న దేశానికి చెందిన సిద్ధాంతాలు, ఆదర్శాలు దాగి ఉంటాయి. అవి వేష, భాషలను ప్రభావితం చేస్తాయి.

భాషలోని ప్రతి అక్షరం వెనుక స్వరం, అర్థముల యొక్క గుప్తనిధి దాగి ఉంటుంది. మనం పలికే ప్రతి అక్షరం యొక్క అర్థం యొక్క ప్రభావం మనం చేసే పనుల మీద, మన నడవడిక మీద పడుతుంది. మనను మంచివారుగానో, చెడ్డవారుగానో మారుస్తుంది. భాషలో జాతి లేక రాష్ట్రములకు చెందిన సంస్కృతి నిహితమై ఉంటుంది. దేశము లేక రాష్ట్రములకు చెందిన భాషల ద్వారా వాటియొక్క ఆలోచనలు, ఆదర్శాలు స్పష్టమౌతాయి. ప్రతి దేశానికి దానికి చెందిన మూల పురుషులున్నారు. వారి ఘన కార్యాలకు చెందిన వివరాలు ఆ దేశము లేక రాష్ట్రముల యొక్క భాషలో వివరింపబడతాయి. చరిత్రల యొక్క గొప్పతనాన్ని పదే పదే చదవడము వల్ల వారి సంస్కారాలు, వారిభావాలు, విశ్వాసాలు, ఆదర్శాలు, సంస్కృతి వైపుకు దృష్టిని మళ్ళిస్తాయి. భాష అంటే కేవలం మాటలు మాత్రమే కాదు. అది సజీవమైన ఆలోచనల సముదాయం, అది నడవడికకు మూలం.

ఒక జాతి మరియొక జాతిని జయిస్తే ఓడినజాతి మీద జయించినజాతి తన భాషను రుద్దుతుంది. జయించినజాతి యొక్క భాషను తాను స్వీకరించడమే గాక దానిని గొప్పజాతిగా భావిస్తుంది. దీని వలన ఓడిన జాతి మానసికంగా దాస్యభావాన్ని పొందుతుంది, దాసత్వాన్ని పెంచుకుంటుంది. ఎక్కువరోజులు ఏ భాషనైనా అభ్యాసము చేయడం వలన మనిషి ఆజాతికి చెందిన ఆలోచనలను భావాలను శ్రేష్ఠమైనవిగాను, తమను తాము

**అవసరం లేకపోయినా డబ్బు కలిగి ఉన్నవాడు అదృష్టవంతుడు.**

బలహీనులుగాను, దీనులుగాను తలవడము మొదలు పెడతారు. భారతదేశంలో ముసల్మానులు ప్రవేశించిన తరువాత ఉర్దూ, పార్శీ భాషలను ప్రచారం చేశారు. హిందువులను కూడా అవేష భాషలను నేర్చుకోవడానికి ప్రోత్సహించారు. రాజ్య పాలన ఉర్దూలోనే కొనసాగింది. దానివలన ఉర్దూ, ఫార్సీలతో బాటు ముసల్మాన్ సంస్కృతి, ముసల్మాన్ జీవన పద్ధతికి చెందిన భావాలు వ్యాపించాయి. అంతేకాదు హిందువుల ఆలోచనలలో దాస్య భావం వ్యాపించడం జరిగింది. దానినేప్రచారము చేయడం జరిగింది. అదేవిధంగా పాశ్చాత్య సంస్కృతీ ప్రచారం జరిగింది. భారతీయుల మనస్సులలో తాము తక్కువ వారమన్న భావన స్థిరపడింది. ఆంగ్లేయుల పట్ల గౌరవభావం పెరిగింది. ఈ విధంగా భాష, విద్యలతో సంస్కృతి ముడిపడి ఉన్నదన్న విషయం మనకు అర్థమయింది. భారత దేశానికి చెందిన అతి ప్రాచీన సంస్కృతి, మానవత్వముల వికాసానికి అమరవాణి అయిన సంస్కృతం రాష్ట్ర భాషఅయిన హిందీ భాషను ఉద్ధరించవలసిన అవసరం ఏర్పడింది. ఈ భాషలలో ఎన్నో ఆర్య జాతికి చెందిన పవిత్ర ఆదర్శాలు, మానవతాగుణాల వికాసానికి చక్కని సంస్కారాల నిర్మాణానికి పనికి వచ్చే జ్ఞాన సంపద నిండి ఉన్నది. చక్కని సంస్కారవంతులుగా తయారుకావడానికి, మార్గాలను చూపగల విశేషాలు, సంస్కృత హిందీ సాహిత్యాలలో ఎన్నో ఉన్నాయి.

భారతదేశానికి చక్కని భవిష్యత్తు ఏర్పడడానికి, దాని ఆర్థిక, సాంస్కృతిక ప్రగతి కొరకు దేశ ప్రజలకు ప్రాచీన సంస్కృతిని పరిచయం చేయాల్సి వస్తోంది. చరిత్రను మన భాషను, సాహిత్యాన్ని చదివించవలసిన అవసరముంది. ఈ పనిలో ప్రధానమైన అంగము సంస్కృత భాషను అధ్యయనము చేయడం ఇతరులను అందుకు ప్రోత్సహించాలి. సంస్కృత భాషలోనే ఇందుకు అవసరమైన సామాగ్రి లభిస్తుంది. దాని ఆధారముతో మనం మన జాతీయ స్వరూపాన్ని ఉన్నదున్నట్లుగా గుర్తించగలుగుతాం. తెలుసుకోగలుగుతాం. వేలకొలది సంవత్సరాలుగా సంస్కృత భాషను ఆధారం చేసుకొని అధ్యాత్మవాదం నిలబడి ఉన్నది. అది భారతీయ మానవతకు ప్రముఖమైన వరం. సంస్కృతికి వేషముతో దగ్గర సంబంధం ఉంటుంది. ఆయా సంస్కృతి, ధర్మాలకు సంబంధించి వేరు వేరు వేషాలుంటాయి. ఆంగ్ల వేషధారణ జరిగిన వెంటనే మనసులో మోసానికి, స్వార్థానికి, అనైతికతకు చెందిన ఆలోచనలు పుట్టుకువస్తాయి. విలాసములందుకోరిక లేర్పడతాయి. ముసల్మాను వేషధారణవలన ధనసంపదల మీద, ఇంద్రియ భోగాల మీద, విలాసాలమీద, కామముమీద మనసు పోతుంది. ఏ సంస్కృతి అయినా వేషభాషలతో ముడిపడి ఉంటుంది. ముస్లిమ్, ఆంగ్లేయ సంస్కృతులు భోగవాదం మీద ఆధారపడి ఉంటాయి. వారి ఆలోచనలు, వారి దృష్టి భౌతిక స్థాయి నుంచి పైకి లేవలేవు. ఈ సంస్కృతులలో ఇంద్రియ భోగములకు చెందిన విషయాలే నిండి ఉంటాయి. ఆడపిల్లలకు వివాహసమయంలో విలువైన వేషభూషలు ధరింపచేయడం వల్ల వారిలో దర్పం పెరిగిపోతుంది. ధనవంతుల వలె వ్యవహరిస్తారు. కావున మనిషి తనమనుస్సులో ఏ విధమైన సంస్కృతికి చెందిన వేషధారణ చేయడం అవసరమో తెలుసుకోవాలి.

భారతీయ వేషధారణలో పొడుగు చేతుల లాల్చీ, పంచ, చెప్పులు మొదలైనవి ఈ దేశవాతావరణానికి అనుకూలమైనవి. వీటిలో ఆరోగ్యం, విశ్రాంతి అధికంగా ఉంటాయి. విద్య సామాన్య జీవనవిధానం భారతీయులలోని ప్రత్యేకతలు, అతి తక్కువగా దుస్తులు ధరించడం ద్వారా ప్రకృతితో తాదాత్మ్యం చెందుతారు. తమ శరీరాన్ని అనవసరమైన అలంకరణలకు దూరంగా ఉంచడం వల్ల నిరాడంబరత అలవడుతుంది.

ఇతర దేశాలు ప్రకృతిని జయించాలని భావిస్తాయి. కానీ భారతదేశం మాత్రం ప్రకృతితో అనుబంధాన్ని పెంచుకోవడానికి చూస్తుంది. ప్రకృతికి లోబడియుండడానికి ప్రయత్నించింది. ఇక్కడగల అనేకమంది సాధు, సన్యాసులే గాక ఇతర వ్యక్తులు కూడా ప్రకృతి ఒడిలో ఆనందాన్ని పొందుతూ ఉన్నారు. ప్రకృతిలోని వనాలు, లతలు, పర్వతాలు, నదులు, పశుపక్ష్యాదులు, మొదలగు వాటితో తాము వేరయిన వారమన్న భావము వారికెప్పుడూ లేదు. భారతదేశములో నదులు, పర్వతాలు, పవిత్రమైనవి, పూజింపదగినవని భావింపబడుతుంది. అందువలననే వాటికి సమీపములోనే పుణ్యక్షేత్రాలను, దేవమందిరాలను నెల కొల్పుట జరిగింది. వనములు, గ్రామాలు ఇక్కడి సంస్కృతికి శోభాయమానములైన చిహ్నాలుగా ఉంటాయి.

ఈ విధముగా గ్రామాలలోని వేషభాషలు ప్రకృతి యొక్క సాహచర్యంవల్ల కలిగే నిరాడంబరత, స్వచ్ఛత, వినయశీలము, ఉదారగుణము, భారతీయుల సొత్తు. కృత్రిమత, ఆడంబరం లేనిపోని రంగులు పులుముకోవడం మనకు నచ్చదు. ఆధునిక శృంగారసాధనాల పట్ల మనకు విరక్తి ఎక్కువ.

*అనువాదం–కె.బి.సోమయాజులు*

**డబ్బులేకపోయినా ఆనందం కలిగి ఉండేవాడు జ్ఞానవంతుడు.**

మహిళా జాగరణ

# మహిళకు గడ్డు రోజులు

అప్పుడప్పుడు దారి తప్పే చెడ్డ రోజులు వస్తాయి. అవి తమ స్వభావానికి అనుగుణంగా బాధలు పెడతాయి. మధ్యకాలపు ఫ్యూడల్ అంధకారయుగంలో అంతా తల్లక్రిందులయ్యే అనర్థం ఏర్పడింది. తలక్రిందకి, కాళ్ళుపైకి పెట్టడం లాంటి విచిత్రమైన దృశ్యాలు చూడవలసి వచ్చింది. స్త్రీలోని మూలశక్తిని, ఆత్మను కామినిగా, రమణిగా, భోగవస్తువుగా, దాసిగా పరిగణించేవారు. తిరస్కారం, దోపిడీ, అణచివేత, భయంవెన్నాడితే దురవస్థలపాలు కావలసి వస్తుంది స్త్రీ విషయంలో అలాగే జరిగింది. ఆమెపట్ల పూజ్యభావం చెడుదృష్టిగా మారింది. ఆమెను వాంఛ అనే అగ్నిలో పడవేశారు. కల్పవృక్షాన్ని నల్లని బొగ్గుగా మార్చి వేశారు.

మధ్యయుగంలో స్త్రీపై జరిగిన అత్యాచారాల గాథ ఒక కరుణామయగాథ. మనిషి జన్మకు మధ్య జన్మగా ఆమెను పరిగణించారు. మానవోచితమైన అధికారాల నుండి ఆమెను తొలగించారు. పంజరంలో పక్షిలాగా, ఇంటి నాలుగుగోడల మధ్య బంధించారు. ఆడపిల్ల పుట్టడం దురదృష్టానికి సూచనగాను, పుత్రుడు జన్మిస్తే రత్నాల వర్షంలా అదృష్ట సూచనగాను భావించసాగారు. మగపిల్లలకూ, ఆడపిల్లలకూ మధ్య దారుణమైన విచక్షణ చూపేవారు. చదువు, గారాబం, సౌకర్యాలు, సాధనాలు అందించడంలో ఇద్దరి మధ్య ఘోరమైన హెచ్చు తగ్గులు పాటించేవారు. సంరక్షకులే అలా అన్యాయంగా ప్రవర్తిస్తే, ఇక బయట ఆమెను ఆదరించే వారెవరుంటారు? అత్తవారింటికి చేరగానే ఆమెను వంటమనిషిగా, కాపలామనిషిగా, చాకలిగా, పనిమనిషిగా, భోగవస్తువుగా మార్చేవారు. రెండవ తరగతి పౌరునిగా ఆమెను పరిగణించారు. అన్యాయాన్ని ఖండిస్తూ నోరు మెదపకుండా పడిఉండేలా చేశారు.

ఇద్దరికీ వేరు వేరు ఆచారాలు – కట్టుబాట్లు కొనసాగాయి. స్త్రీకి పాతివ్రత్యం తప్పనిసరి. పురుషునికి పత్నీవ్రత బంధనం లేదు. స్త్రీ ముసుగు వేసుకోవాలి. పురుషుడు ఏ ముసుగు లేకుండా స్వేచ్ఛగా తిరగవచ్చు. వితంతువుకు అనేక నిర్బంధాలు, విధురునికి అనేక వివాహాలు చేసికొనే స్వాతంత్ర్యం. వివాహంలో అమ్మాయికి కట్నం తక్కువైతే పీడించడం. తొందరగా పిల్లలు పుట్టకపోతే రెండవ పెళ్ళికి సిద్ధమవడం, ఆర్థికంగా వికలాంగిని చేయడం, పౌరహక్కులను హరించడంలాంటి న్యాయాలతో స్త్రీని అడుగడుగునా బాధించడం జరిగేది. ఫలితంగా ఆమె క్రమంగా తన ప్రత్యేకతలన్నిటినీ కోల్పోయింది. సౌందర్యం ఉన్న వారిని ఇష్టపడేవారు. సగటు స్థాయిలో సాధారణంగా ఉన్నవారిని కురూపులని పేరుపెట్టేవారు. వారి వివాహానికి వరుణ్ణి వెదకడం కష్టం అయ్యేది. అలాంటి అనేక దారుణాలపై దృష్టి సారించినట్లయితే ఒక వర్గం మరొక వర్గంపై ఎన్ని నిర్బంధాలు, అనాచారాలు రుద్దిందో తెలుస్తుంది. స్త్రీ ప్రగతి ద్వారాలన్నీ మూసివేయబడ్డాయి.

భారతదేశంలాంటి వెనుకబడిన దేశాలలో ఆనాడు స్త్రీకి, ఇలాంటి సమస్యలు ఎన్నో ఉన్నాయి. సంపన్న దేశాలనబడే దేశాలలో మరొక రకం సమస్యలు. ప్రపంచంలోని సగం జనాభా ఇలాంటి కష్టాలను ఎదుర్కోవలసి వచ్చేది. వాటిని తొలగిస్తే స్త్రీ పురుషునికి గొప్ప సహాయకురాలుగా ఉండేది. కానీ సగం జనాభాను పక్షపాతంతో బాధపడుతున్నదానిలా, అవిటిగా చేతులు కట్టుకొని ఎప్పుడూ మూలుగుతూ విలపిస్తూ ఉండేట్లుగా చేసే దౌర్భాగ్యాన్ని ఏమనాలి ? కట్టి వేసి కాలరాచే విధానానికి ప్రతిక్రియ జరిగితీరుతుంది. కట్టేసేవాడు కూడా చెడు పనులకు శిక్ష అనుభవించవలసి వచ్చింది. పురుషుడు తన భాగస్వామిని అసమర్థురాలుగా చేశాడు. ఫలితంగా ఆమె భారాన్ని తాను మోయవలసివచ్చింది. ఒకటి ఒకటి ఉంచితే పదకొండు (11) అవుతుంది అనేటంతటి సహృదయత ఎక్కడ ఉంది ? ఒకటి క్రిందగానీ, పైనగానీ మరొక ఒకటి వేసి మైనస్ చేస్తే (0) మిగులుతుంది. వెనుకపడ్డతనంతో పీడితులైన (స్త్రీ , పురుషులు) ఇద్దరూ సున్నాలాంటి దయనీయ పరిస్థితిలో ఉండవలసివస్తుంది.

★★★

**ఆనందం లేకపోయినా తృప్తి కలిగి ఉండేవాడు గుణవంతుడు.**

# కుటుంబ నిర్మాణంకోసమై మానసిక పోషణ

మానవులు అంటే కేవలం శరీరమే కాదు. శరీరం కేవలం స్థూలమైనది మాత్రమే కాదు. దీనిలోపల మనస్సు–మస్తిష్కం–అంతఃచేతన మొదలైన సూక్ష్మ ప్రకృతి కూడా నిండి ఉంటుంది. సమగ్రమైన శరీర అస్తిత్వానికి సమగ్రమైన పోషకాహారం అవసరం. ఈ భోజనం వలన శరీర వృద్ధి కల్గటానికి ఆహారం జీర్ణం అవటం అవసరం. ఆహారం జీర్ణం అవటానికి వ్యాయామం, శ్రమ కూడా అవసరం. అదే విధంగా మన మనస్సు మస్తిష్కాలకు, ఆత్మకు కూడా భోజనం, వ్యాయామాలు పూర్తిగా అవసరమౌతాయి.

శారీరక బలం కంటే బుద్ధిబలం ముఖ్యమైనది. వీటికంటే అధికమైన శక్తి ఆత్మబలంతో నిహితమై ఉంటుంది. మనం ఇప్పుడు ఆత్మబలం గురించి ఆలోచించటంలేదు. మనం ఇప్పుడు బుద్ధిబలం, మనోబలం యొక్క వృద్ధిని గురించి ఆలోచిస్తున్నాం స్వార్థాన్ని కొంత వదులుకుని కుటుంబ నిర్వహణ భారాన్ని తమ భుజస్కంధాలపై ఎత్తుకున్న వ్యక్తులు కుటుంబ సభ్యుల శారీరిక అభివృద్ధి, పోషణలకు అవసరమైన మానసిక ఆహారాన్ని కూడా ఏర్పరచాల్సి ఉంటుంది.

శరీరానికి ఆహారం అవసరమైనపుడు మనకు ఆకలి ఔతుంది. అప్పుడు మనం అన్నం తినాలని ఆత్రుత పడతాం. ఈ విధంగానే మన మనస్సుకు, బుద్ధికి కూడా ఆకలౌతుంది. ఆ ఆకలిని తీర్చడానికై వాటికి కూడా ఆహారం అవసరమౌతుంది. ఈ విధమైన ఆకలి మానవులందరికీ కల్గినప్పటికీ అందరూ ఆ అనుభవాన్ని పొందుతారో, లేదో చెప్పలేం.

శారీరకమైన ఆకలిని పోగొట్టుకోవటానికై పాలు, పండ్లు, రొట్టెలు, కూరలు, మొదలైన ఆహారం తీసుకుంటాం. ఈ విధంగానే మనస్సుకు, బుద్ధికి ఆహారం అవసరం అయినప్పుడు స్వాధ్యాయాలతోనూ, సత్సంగంతోనూ పూర్తి ఔతుంది. స్వాధ్యాయం అంటే ఏ గ్రంథాన్నైనా స్వయంగా చదవటం లేక ఇతరులతో చదివించుకుని వినటం. సత్సంగం అనగా విద్వాంసులు, పండితుల నుండి జ్ఞానాన్ని అనుభవాలను వారి ప్రవచనాలద్వారా, వారి ఆచార వ్యవహారాల ద్వారా పొందటం.

మన శరీరాన్ని పోషించటానికి అవసరమైన ఆహారాన్ని గురించిన అవగాహన కొందరికి ఉండదు. శరీరానికి కావలసిన అన్ని అవసరాలను పూర్తి చేసే ఆహారం స్వచ్ఛమైన, పవిత్రమైన, న్యాయమైన మార్గాలద్వారా, సంపాదించిన మాత్రమే మన శరీరాలకు కావలసిన సముచితమైన పోషణను ప్రసాదిస్తోంది.

ఈ విషయం తెలిసిన వ్యక్తులు కేవలం పొట్టనింపుకోవడమే ముఖ్యంగా భావిస్తారు. కానీ శరీరం తన కోరికలను పూర్తిచేసుకొనే తీరుతుంది.

కరువు సమయంలో అన్నంలేని కారణంగా జీవించటానికై ఆకులు మొదలైన ఇతర పదార్థాలను కూడా తినడం జరుగుతుంది. ఈ విధంగా మనం మనస్సు బుద్ధి యొక్క ఆకలికి మంచి మానసిక ఆహారమైన గ్రంథ పఠనం, సత్సంగాలను అందించకపోతే అవి అటూ–ఇటూ చేతికి అందిన వాటిని స్వీకరించి ఆచరిస్తాయి. దానికి అనుగుణంగా తిరిగి ఆలోచనలను, అలవాట్లను ఏర్పరచుకుంటాయి.

ఆహారం ఎలా ఉండాలన్న విషయంపై మనకు కొన్ని విషయాలు తెలుసు, జాగ్రత్తకూడా వహిస్తాం. కానీ మనస్సు, బుద్ధికి సంబంధించిన ఆహారం గురించి ఇప్పటి వరకు చాలా మంది అజ్ఞానంలోనే ఉన్నారు. వారికి ఈ ఆకలిని గురించి తెలియదు. ఇవి శరీరం కంటే కూడా అధిక సామర్థ్యం, క్రియాశక్తి కల్గి ఉంటాయి. అందువలన మనకు ఏది ఎదురైతే ఆ ఆహారంవెంట పడటం ఆ విషసమానమైన ఆహారం స్వీకరించటం జరుగుతుంది. శరీరంలాగానే మన మనస్సు, బుద్ధికూడా రోగగ్రస్తమౌతూ ఉంటాయి.

కుటుంబ పెద్దలకు తమ పరివార సభ్యుల అవసరాలను తీర్చే బాధ్యత ఉంటుంది. ఆహారానికి సంబంధించిన విషయాలలో ఏ విధంగా ఐతే ప్రయోగాలు చేస్తారో అదే విధంగా స్వాధ్యాయ సత్సంగాల విషయంలో కూడా ప్రయోగాలు చేయాలి. దీనికై ఒకటి లేక రెండు గంటలు నిశ్చిత సమయాన్ని పాటించాలి. క్రమం తప్పకుండా ప్రతి రోజూ ఏ విధంగా భోజనం చేస్తామో అదే విధంగా అందరూ స్వాధ్యాయ, సత్సంగాలను క్రమం తప్పకుండా చేయటం అలవాటు చేసుకోవాలి.

ఈ విధమైన వ్యవస్థను ఏర్పరచకపోతే సభ్యుల మనస్సు–మస్తిష్కాలకు పవిత్రమైన పోషకాహారం లభించదు. అవి ప్రక్క దోవలు త్రొక్కి ఏదో విధంగా తమ ఆకలిని తీర్చుకుంటాయి. ఫలితం ప్రమాదకరంగా ఉంటుంది.

మన రోజువారీ జీవితంలో స్త్రీలు అధికంగా మాట్లాడటం చూస్తుంటాం. వారి మాటలలో ముఖ్యవిషయం ఇతరులను నిందించటం, విమర్శించటం. మానసిక ఆకలికి చెడు ఆహారం లభించటం అంటే ఇదే . ఇంతకు ముందు మహిళల చదువుపై

**అవగాహన ఉంటేనే దూరదృష్టి అలవడుతుంది - జిడ్డు కృష్ణమూర్తి.**

శ్రద్ధ చూపించేవారు కాదు. వారిని పురుషులకంటే తక్కువగా భావించేవారు. అందువలన వారి మానసిక శిక్షణపై తక్కువ శ్రద్ధ చూపేవారు. అయినప్పటికీ ఆకలి ఆకలే. ఏవో ఒక పనికిమాలిన మాటలతో తృప్తి పొందడం చేస్తూ ఉంటారు.

భారత స్వాతంత్ర్య ఆందోళనా సమయంలో స్వాధ్యాయనా పరులైన నేతలకు జైళ్ళలో గ్రంథాలు ఇచ్చేవారుకాదు. వారిని మానసికంగా అసంతృప్తులనుచేయడమే దీని ఉద్దేశ్యం. డా. రామ్ మనోహర్ లోహియా లాహోరు జైలులో ఉన్నపుడు కొన్ని నెలల వరకు పుస్తకం చూడటానికి కూడా లభించలేదు. లోహియా వంటి అధ్యయన పరులకు అది భోజనం లేకపోవడం కంటే కూడా పెద్దశిక్ష.

ఏ కుటుంబ పెద్ద ఐనా కుటుంబసభ్యులకు భోజనం, వస్త్రం, ఇల్లు మొదలైన శారీరక అవసరాలను తీర్చి వారి బాధ్యత పూర్తి అయిందనుకుంటే వారు తెలియకుండానే లోహియాకు బ్రిటిష్‌వారు విధించే శిక్షనే విధించినవారౌతారు.

పెరిగే పిల్లల శారీరక అవసరాలు తీరడానికై వారికి పెద్దవారి కంటే ఎక్కువ పోషకాహారం అవసరం. అదే విధంగా వారి మనస్సు మస్తిష్కాలకు కూడా ఆకలి ఔతుంది. ఈ కారణం వల్లనే వారు పెద్దవారిని ఏదోఒక ప్రశ్న అడుగుతూ ఉంటారు. ఈ జిజ్ఞాసే వారి మనస్సుకు మస్తిష్కాలకు కలిగే ఆకలి. బాగా ఆకలివేసిన తరువాత మంచి పౌష్టికాహారం తీసుకోవటం వల్ల శారీరక బలం, సౌష్టవం పెరుగుతాయి. అదే విధంగా పిల్లలకు శరీరక మానసిక ఆహారం లభించటం వల్ల వారి భావిజీవిత పునాది దృఢమౌతుంది. పిల్లల మనస్సులలో ఏర్పరచగలిగే సంస్కారం పెద్దవారైన తర్వాత సాధ్యంకాదు. వారు జిజ్ఞాసతో అడిగే ప్రశ్నలకు సావధానంగా సమాధానాలు ఇచ్చినట్లయితే వారి మానసిక క్షుద్బాధ తృప్తి పడ్తుంది. ఇంతేకాక ఇది వారికి శిక్షణగా కూడా ఉపయోగపడ్తుంది.

ఇంత ముఖ్యమైన ఈ విషయంపై ఇంత వరకు చాలా కుటుంబాలు దృష్టిని కేంద్రీకరించలేదు. కానీ ఇప్పుడు ఈ విషయంపై ధ్యానం ఉంచాలి. కొన్ని గంటలు దీనికై కేటాయించాలి. సమయం లభించినపుడు మాటలతో వృధాపుచ్చక ఈ విషయంపై దృష్టి ఉంచటం వల్ల కుటుంబసభ్యుల మనస్సు–మస్తిష్కాలకు ఆహారం లభిస్తుంది.

కుటుంబ సభ్యుల మానసిక వికాసానికై మంచి పత్రికలు, సాహిత్యం కొనటానికి బడ్జెట్‌లో డబ్బుకేటాయించాలి. ఆహార అవసరాలకై ఖర్చు చేసే డబ్బులో 10వవంతు ధనాన్ని వీటికై వెచ్చించాలి.

సాయంత్రం భోజనాదులు పూర్తయినతరువాత మానసిక సంతోషానికై నీతికథలు చెప్పటం, చదవటం, చేయాలి. దీనిలో కుటుంబ సభ్యులందరి సహకారం ఉన్నట్లయితే జ్ఞాన వృద్ధి కల్గి జీవన నిర్మాణంలో ఉపయోగపడుతుంది.

చిన్న పిల్లలందరూ కథలు వినడాన్ని ఇష్టపడతారు. వారికి భూత, ప్రేతాల కథలు, అప్సరసల కథలు వినిపించకుండా మహా పురుషుల జీవన వృత్తాంతాలు, నీతి కథలు వినిపించినట్లయితే, వాటినుండి పిల్లలు చాలా నేర్చుకుంటారు. భయం, రహస్య, ఊహలతోకూడిన అర్థరాత్రి కథలు పిల్లల వికాసానికి అడ్డంకులుఔతాయి. మహాపురుషుల జీవిత చరిత్రలు వారికి ఎంతో ఉపయోగపడతాయి.

కుటుంబ సభ్యులందరూ విద్యావంతులై వారి వయస్సులు, అభిప్రాయాలు వేరుగా ఉన్నట్లయితే, వారు చదివిన పత్రిక లేక గ్రంథం నుండి కొన్ని తీరిక సమయంలో చదివి వినిపించవచ్చు. దీనివలన అందరూ అన్ని విషయాలను తెలుసుకోగల్గుతారు. దేశ విదేశ సమాచారాలను సమాజంలో పెరుగుతున్న వికృత ధోరణులను గురించి కూడా ఈ సమయంలో చర్చించుకోవచ్చు. విద్యావంతులైనవారు ఏ వయస్సు వారైనప్పటికీ వారి కుటుంబంలోని వారికి ఉపయోగకరమైనవి, జ్ఞానాన్ని పెంచే విషయాలను గురించి చెప్తూ ఉండాలి. చదువుకోవటానికి అవకాశం లభించని తల్లిదండ్రులు వారి కూతుళ్ళు, కొడుకులను చదివించటంలో ఎక్కువ శ్రద్ధ చూపిస్తారు. వారి అక్షర జ్ఞానాన్ని, చదువును ఉపయోగించుకుని వారిచే మంచి పుస్తకాలను చదివించుకోవటం, లేక స్వయంగా చదవటం నేర్చుకోవాలి. విద్యావంతులు కానప్పటికీ జీవితానుభవం కలవారి వద్దనుండి విద్యావంతులు జ్ఞానాన్ని పొందవచ్చు. ఈ విధంగా పరస్పర సహకారం కుటుంబ సమగ్ర వికాసానికి సహాయపడుతుంది.

వంటిల్లులేని ఇంటిని ఏ విధంగా ఊహించలేమో అదే విధంగా స్వాధ్యాయం లేని కుటుంబం కూడా అసమగ్రంగా ఉంటుంది. ఈ సత్యాన్ని త్వరగా గుర్తించి తగిన వ్యవస్థను ఏర్పరచుకోవాలి. అది కుటుంబ నిర్మాణ దశలో మహత్వపూర్ణమైన అడుగుఔతుంది.

అనువాదం – ఎ.ఆర్.నిర్మల

*(యుగనిర్మాణయోజన – 2004)*

**స్వేచ్ఛ కోరే వ్యక్తి సుఖాన్ని త్యాగం చేయక తప్పదు - నేతాజీ**

# మనం - మన ఆరోగ్యం

## అమృతంలాంటి నీటితో అద్భుత చికిత్స (వాటర్ థెరపీ)

మన వేదాలలోని సారం మనం గ్రహించలేకపోతున్నాం. కానీ వేద విజ్ఞానాన్ని మన నుండి కొల్ల గొట్టుకుపోయిన పాశ్చాత్యులు మాత్రం అంతులేని అవగాహనను పొందారు. ఆశ్చర్యకరమైన విషయాలను వెలికి తీశారు. ఏనాడో మన ఋషులు తెలిపిన విషయాలను తామే కనిపెట్టినంత ధీమాగా మనకే చెపుతున్నారు. దానికి మనం ఆహా ! ఓహో ! అంటూ ప్రశంసిస్తూ ఉన్నా. పెరటి చెట్టు వైద్యానికి పనికిరాదన్నట్లు మనదైన అత్యద్భుత వేద విజ్ఞానాన్ని మనమే ఉపయోగించుకోలేని దుస్థితి మనది. అధర్వవేదం నుండి సేకరించిన ఈ అద్భుత చికిత్సా విధానాన్ని ఏదో ఒక వ్యాధితో బాధపడుతున్న సామాన్య ప్రజలందరికీ తెలియచేయాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నది. ఇది సర్వ రోగనివారిణి.

### వాటర్ థెరపీ చేయడం ఎలా ?

చాలా సులభం. ఖర్చుకూడా ఉండదు. ఒక్క వారం రోజులు పాటించారంటే జీవితాంతం విడిచిపెట్టరు. పసిపిల్లలనుండి, వృద్ధులదాకా స్త్రీ పురుష భేదం లేకుండా అందరూ ఆచరించవచ్చు. విధానం :

1) సుమారు నాలుగు గ్లాసుల నీరుపట్టేరాగి పాత్రను సిద్ధం చేసుకోవాలి. రాత్రి పడుకోబోయే ముందు పాత్రతోపాటు దంతాలు కూడ శుభ్రంచేసుకోవాలి. రాత్రి 7 దాటిన తర్వాత కాఫీ, టీ, కూల్‌డ్రింక్, మత్తుపానీయాలు ఏవీ సేవించకూడదు.

2) నిద్రకుపక్రమించే ముందు రాగి పాత్రలో 1 $^1/_4$ లీటరు శుభ్రమైన నీటిని పోయాలి. రాగి మూతనే పెట్టాలి. ప్లాస్టిక్ స్టూల్‌పైగాని, చెక్క స్టూల్‌పైగాని నీటి పాత్రను పెట్టాలి. పొరపాటున కూడ నేలపైగాని, అలమారలోగాని పెట్టకూడదు.

3) మరురోజు ఉదయం నిద్ర లేవగానే ఏలాటి కాలకృత్యాలు (దంతధావనం, ఒకటి, రెండు అవసరాలు) ప్రారంభించవద్దు. కాళ్లు కూడ భూమి మీద పెట్టవద్దు. మంచం మీదనే కూర్చుని రాగిచెంబు అందుకోవాలి. దానిలోని నీటిని చక చకా ఏకబిగిన త్రాగాలి. ప్రారంభంలో ఒకే సారి త్రాగలేకపోతే సాధ్యమైనన్ని త్రాగి మిగిలినవి పారబోసేయాలి. మిగుల్చుకుని తరువాత త్రాగవద్దు. ఒక వారం గడిచేసరికి మొత్తం త్రాగగలిగే స్థితికి చేరుకోవాలి. రాత్రివేళలో మీ నోటిలో ఉండే లాలాజలం అనేక ఔషధ గుణాలను కలిగి ఉంటుంది. ఈ పద్ధతి ద్వారా అవి మన కడుపులోకి చేరుకుని మేలు కలిగిస్తాయి.

4) ఎలాంటి పరిస్థితులలో కూడా మన శరీరం భూమిని తాకకూడదు. అత్యవసరం అయితే ప్లాస్టిక్ చెప్పులు వేసుకుని, భూమిపై నిలబడి త్రాగవచ్చు. ఈ నియమాన్ని పాటించకపోతే ఏమాత్రమూ ఫలితం ఉండదు. అంతా వ్యర్థమే అవుతుంది.

5) ప్రతిరోజూ దప్పిక అయినా కాకపోయినా 7 –8 గ్లాసుల మంచినీరు త్రాగుతూ ఉండాలి. నీరు త్రాగడానికి ఋతువులతో నిమిత్తం లేదు.

**ఫలితాలు :**

6 నెలల పాటు ఈ వాటర్ థెరపీని నియమనిష్ఠలతో పాటించారంటే ఊహించని ఫలితాలు కనిపిస్తాయి.

ముఖం తేజోవంతం అవుతుంది. శరీరం ఉత్సాహంతో ఉరకలు వేస్తుంది. ఏవైనా చిన్నవీ – పెద్దవీ దీర్ఘవ్యాధులు ఉంటే తిరుగుముఖం పడతాయి. వృద్ధాప్యాన్ని దరికి రానీయదు.

ఆయిల్ పుల్లింగ్ చికిత్సతో పోలిస్తే ఇది చాలా సులభం. పైసా ఖర్చులేదు. ఎలాంటి సైడు ఎఫెక్ట్ ఉండదు. కాకపోతే ఎక్కువ నీరు త్రాగుతాం కనుక మొదట్లో రెండు–మూడు రోజులు ఒకటికి రెండుసార్లు మూత్ర విసర్జన చేయాల్సిరావచ్చు. కంగారుపడవలసిన పనిలేదు. క్రమంగా అలవాటైపోతుంది.

బహిష్టు సక్రమంగా రానివారికి హై.బి.పి. ఉన్నవారికి, రక్తహీనత, కీళ్లనొప్పులు ఉన్నవారికి అద్భుతంగా పనిచేస్తుంది. ఊపిరితిత్తుల్లో నెమ్ము, అలర్జీ, ఆయాసం, షుగరు, టి.బి., కేన్సర్ మొదలైన వ్యాధులకు కూడా అమోఘంగా పని చేస్తుంది. గర్భాశయ వ్యాధులకు విశేషంగా ఉపకరిస్తుందని శాస్త్రీయంగా చెప్పబడింది. అంతే కాదు బరువుతగ్గాలన్నా కూడా ఇది బాగా ఉపయోగపడుతుంది. నమ్మకంతో ఓపిగ్గా ఆచరించి చూడాలి.

– బ్రహ్మవర్చస్

**చిరునవ్వుతో చేస్తే పనిలో కష్టం తెలియదు.**

# మహాశక్తి సాక్షాత్కారం

నియమబద్ధంగా గంభీరమైన ఉచ్చారణ కలిగి ఉండడం, మంత్రమాధుర్యాన్ని ఆస్వాదించగలగడం, మంత్రార్థాన్ని గురించి ఆలోచించడం, చేయగలిగామంటే దృఢయోగం, లయయోగాల అవసరం ఉండదు. గాయత్రీ జపంలో ఈ మూడింటినీ చేయగలిగితే పూర్ణత్వం లభిస్తుంది. మంత్రార్థ చింతన అంటే ఇష్ట దేవత యొక్క స్వరూపాన్ని గుణాలలో చూడడం అన్నమాట.

"జపం చేసే విధానం ఇదికాదు." అర్థాన్ని గంభీర భావాలతో అనుసంధానం చేసి, హృదయ అంతరాళం లోంచి ఒక్కొక్క అక్షరాన్ని ఉచ్చరించు. దానితోనే తాదాత్మ్యం చెందు. వెట్టిచాకిరీ చేసినట్టు జప సంఖ్యను పూర్తి చేయడంకాదు. ఒక్క ధాటిలో ఇన్ని మాటలూ అనేసి తలను పట్టి కదిపేసారు. అతను ఉలిక్కిపడి చూసేసరికి ఒక్క దీర్ఘకాయం, దృఢశరీరం, గౌర వర్ణుడు, తేజస్వీ అయిన మహాత్ముడొకరు కళ్ళెదుట దర్శనమిచ్చారు. ఆరోగ్యం, శక్తి, తేజస్సు, జ్ఞానం, మేధ, ఆలౌకికత అతీతమైన ప్రభలతో భాసిస్తున్నారు. సాధకుడు చేతిలోని మాలను వదిలేసి, తలను వారి పాదాలకు తాకించి నమస్కరించాడు. తాను జపానికి కూర్చున్న బల్ల మీదనే వారిని కూర్చోబెట్టి, వారి పాదాల దగ్గర నేలమీద కూర్చుండిపోయాడు.

ఈ దేవపురుషుడు అతనికి కొత్తకాదు. ఐదేళ్ళ వయస్సుకూడా లేనప్పుడే మొదటిసారి వారిని దర్శించాడు. వారు అప్పుడప్పుడు తన తండ్రి దగ్గరికి వస్తూండేవారు. వారిచ్చే దైవ ప్రసాదాన్ని ఇంకా మరిచిపోలేదు. ఒక్కసారి చూడగానే హృదయంలో ముద్రించుకునే విధంగా వారి ప్రసన్న, గౌర ముఖమండలంలో ఆకర్షణీయమైన జ్యోతి వెలుగుతూండేది. మంచి అంగ సౌష్టవం గల దేహము, మనుషులతో తక్కువగా కలవడం, వారి కుటీరంలోనే ఉంటూ ఏకాంతంగా సాధన చేసుకోవడం – ఇవి వారి జీవిత విశేషాలు. మధ్యలో కొన్ని నెలల పాటు హిమాలయాలకి వెళ్ళిపోయేవారు. మిగతా నెలలు వీరి ఊరి నుండి రెండు మైళ్ళ దూరంలో ఉన్న ఒక విశాలమైన వటవృక్షం కింద నిర్మించుకున్న ఒక చిన్న కుటీరంలో ఉండేవారు. అతను ఎన్నో సార్లు వారిని కలిసాడు ఇలా మాత్రం కాదు. ఈ రోజైతే తెల్లవారుజామున మూడింటికి జపం పూర్తి చేసుకుంటూ ఉంటే అనుకోకుండా వారు దర్శనమిచ్చి జపం గురించి ఏవో కొన్ని మాటలు చెప్పి ఆ చిన్న బల్లమీద కూర్చున్నారు. ఆ దేవమానవుడు మౌనంగా ఉన్నారు. వారి చరణాలను చూస్తూ ఇతనూ మౌనంగానే ఉన్నాడు. ఈ విధంగా ఒక ఇరవై ముప్పై నిమిషాలు గడిచిపోయాయి.

మౌనాన్ని భంగం చేస్తూ ఆ మహాభావుడు ఇలా చెప్పారు. ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, అవీ చదువుతున్నట్లు విన్నాను. పరమాత్మ పట్ల పట్టుదలగా ఉన్నట్టున్నావు. సరే నీ పరిస్థితేంటో చూద్దామనిపించింది. మనుషుల నిజమైన ప్రవృత్తి తెలుసుకోవడానికి ఈ సమయమే సరైనది. కాబట్టి పొద్దున్నే వచ్చాను. ఒక మనిషి ఏం చూస్తూ పడుకుండాడు, ఏం చేస్తూ లేస్తాడు అనేది తెలుసుకుంటే అతని అంతరిక ప్రవృత్తి తెలుస్తుంది. ఈ రెండు స్థితులు మనిషిని తన అభిరుచి, ప్రవృత్తులకు దగ్గరగా ఉంచుతుంది. నువ్వు జపం చేస్తూండడం చూసి నాకు చాలా సంతోషం కలిగింది. నీ శుభేచ్ఛ, తత్పరత కొనియాడదగ్గవి. ప్రశంసనీయమైనవి. కాని కొన్ని సవరణలు అవసరం.

ఏ ఏ సవరణలు, మార్పులు చేసుకోవాలో అతను తెలుసుకుందామనుకున్నాడు. కాని ఆ ప్రశ్నలని దాటేస్తూ ఆ దేవమానవుడు, "ఇప్పుడయితే గంగ దగ్గరకి వెళదాం. విశుద్ధమైన ప్రభాతగాలి పీల్చుకుంటే శరీరం, మనస్సు కొత్త స్ఫూర్తిని సంతరించుకుంటాయి. హృదయం ప్రసన్నమవుతుంది. శరీరానికి కూడా వ్యాయామం అవుతుంది. కాబట్టి గంగ ఒడ్డుకి వెళదాం. గంగా స్నానం, ప్రాత: భ్రమణము రెండూ అవుతాయి." వారు ముందుకు సాగిపోతుంటే సాధకుడు అనుసరించసాగాడు.

గంగానది అంటే అతనికి ముందు నుంచే ఆసక్తి ఎక్కువ గంగ ఒడ్డు, అక్కడి చెట్లు, గంగానదిలో ఉప్పొంగి ఎగసిపడే తరంగాలు: ఒక సారి కాదు, గంగ ఒడ్డున నివసించాలని చాలా సార్లు అనిపించేది. వెండిలాగా మెరిసే, వెన్నవంటి మృదువైన ఇసుక మీద యధేచ్ఛగా ఆడుకోవాలి, నిత్యం గంగాజలాన్ని సేవించాలి! ఆ మహాపురుషుని అనుసరిస్తూ వెళ్తున్నంత సేపూ ఇదే ఆలోచించసాగాడు. "చక్కగా గంగాస్నానం చేస్తాను. వారి నుండి జపం, ధ్యానవిధి నేర్చుకుంటాను." కాని దారి పొడుగునా ఇద్దరూ మౌనంగానే ఉండిపోయారు. అయినా గంగ ఎంత దూరం ఉందని! అనుకున్నంత సేపులో గంగకి చేరనే చేరారు. స్నానం,

**మంచితనాన్ని గుర్తించే శక్తి సమాజానికి ఎప్పుడూ ఉంటుంది.**

సంధ్య, తర్పణం మొదలైన నిత్యకర్మలు పూర్తి చేసుకుని అక్కడే ఉన్న ఒక విశాలమైన వటవృక్షం కింద కూర్చున్నారు.

అతను ఆ దేవపురుషుని వైపు చూస్తూ ఇలా ప్రశ్నించాడు. "భగవన్! జపం చేసేటప్పుడు సంఖ్యను పట్టించుకోకపోతే ఎలా కుదురుతుంది? వీలైనంత తొందరగా ఎక్కువ జపం చేయడం ఉత్తమం కదా?" దానికి వారు ఇలా బదులిచ్చారు. "ఎందుకు ఉత్తమం కాదు. గాయత్రి మంత్రాన్ని ఎలా జపించినా ఉత్తమమే. అదే జపం భావయుక్తంగా, ప్రాణయుక్తంగా రసాస్వాదనతో చేస్తే ఆ ఫలితం అడుగడుగునా లభిస్తుంది. ఒక్కో మంత్రోచ్చారణ అమితమైన ఆనందాన్నిస్తుంది. మామూలుగా చేసే మంత్రోచ్చారణ ఫలితాన్నైతే ఇస్తుంది కాని, కాస్త ఆలస్యంగా ఇస్తుంది."

"చూడు నీకు స్పష్టంగా చెప్తున్నాను. మంత్రజపం అన్నది సాధారణంగా నోటి యొక్క పని. నోరు కర్మేంద్రియం. ప్రాణశక్తి ద్వారా సంచాలన జరుగుతుంది. వాగింద్రియంతో జపం చేయడమంటే, ప్రాణంతో దాన్ని ఐక్యం చేయడం. ఆ స్వరంతో జపంచేస్తే, ప్రాణగతి కూడా నియమిత రూపాన్ని ధరిస్తుంది. వంకర టింకరగా అన్యమనస్కంగా, తటపటాయించే శ్వాసతో ఆరేడుసార్లు గాయత్రీ మంత్రం జపించడం కన్నా ఒక్కసారి లయబద్ధంగా జపించడం ఉత్తమం. గంభీరంగా – ఓం భూర్భువ: స్వ: తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియో యోన: ప్రచోదయాత్. ఈ విధంగా జపం చేయడం వల్ల కూడా ప్రాణాయామం వేరుగా చేయవలసిన అవసరం రాదు."

"అంతే కాదు క్రియాశక్తిని నియత్రించుకున్నందువల్ల ఆసనసిద్ధి స్వయంగా కలుగుతుంది. ఇవి స్థూల విషయాలు. జపం కేవలం కర్మేంద్రియంతో జరిగేది కాదు. మిగతా ఇంద్రియాలతో పోలిస్తే నోటికి ఒక విశిష్టత ఉంది. నోటితో పాటు ఒక జ్ఞానేంద్రిమైన నాలుక కూడా కలిసే ఉంటుంది. చాలావరకు మనుష్యులు నోటితోనే జపం చేస్తారు. కాని రసనేంద్రియాన్ని వాడరు. వాడడం కాదు కద, కనీసం దాని స్వరూపం కూడా తెలుసుకోరు. నాలుక పని రసాన్ని ఆస్వాదించడం. గాయత్రి మంత్రోచ్చారణ జరగాలి. నాలుక దాని రసాన్ని ఆస్వాదించాలి. ప్రతి మంత్రం యొక్క మాధుర్యాన్నీ ఆస్వాదిస్తూ ఇలా చేయడంతో వచ్చే పరిణామమే కాదు, వర్తమానం కూడా సుఖంగా ఉంటుంది.

"ఈ విధమైన రసధారణ వల్ల, జ్ఞానేంద్రియం, మనస్సు రెండూ ఒకటైపోతాయి. నియమిత గతి వల్ల వాగింద్రియం ప్రాణంలో లయమవుతుంది. ఇలాంటప్పుడు మంత్రార్థం యొక్క చింతనతో అనుసంధానం జరిగితే, ఆ చింతనలో ప్రాణం, మనస్సు రెండూ ఒకటైపోతాయి అని వేరే చెప్పవలసిన అవసరం లేదు. మన ప్రాణాల ఐక్యమే సుషుమ్న సంచారం. అదే ధ్యానంలో మొదట సమాధికి ముందు ఉండే స్థితి. ఇందుమూలంగా చెప్పదలచుకున్నది ఏంటంటే జపంలో కనుక గాంభీర్యంతో నిండిన నియమిత గతితో చేసే మంత్రోచ్చారణ మంత్ర మాధుర్యాన్ని ఆస్వాదించి, మంత్రార్థం చింతన చేస్తే ఎలాంటి హఠయోగం. లయయోగం అవసరంలేదు. జపంతోటే పూర్ణత్వం లభిస్తుంది. మరో విషయం, మంత్రార్ధ చింతన అంటే అర్థం, వాటి వేరు వేరు శబ్దాల అర్థం తెలుసుకోవడం కాదు. మంత్రానికి ఉన్న ఒకే ఒక అర్థం, ఇష్టదైవం మీ చిత్తంలో ఎలా ఉందో, ఆ రూపాన్ని చింతన చేయడమే మంత్రార్ధ చింతన.

ఇంటికి చేరుతూనే అతను, ఆ దేవపురుషుడు చెప్పిన విధంగానే జపం చేయడం ప్రారంభం చేశాడు, కాని అతని పెదవులు మాత్రం కదలలేదు. అతను గాయత్రి మంత్రజపం చేసేవాడు కాని, ఆ క్రియ మాత్రం ప్రాణశక్తి తోటే పూర్తిఅయ్యేది. మనస్సంతా జపంలోనే నిమగ్నమయ్యేది. రసనేంద్రిం రుచిని ఆస్వాదించేది.

ఎప్పుడు గాయత్రీ మంత్ర జపం చేసినా మనస్సు ఏకాగ్రమయ్యేది, అంటే మరెటూ పోకుండా జపంలోనే పూర్తిగా లగ్నమయ్యేది. అప్పుడు తాను శరీరం కాదు అనేది తెలిసేది. అతను శరీరమంతపెద్ద జ్యోతిపుంజం. తన మనస్సు ఎదుట తన శరీర ఆకృతితోనే ఒక సఘన ప్రకాశపుంజం ఉండేది. ఒకవేళ ఎప్పుడయినా దృష్టి వేరేవైపు మళ్ళితే ఆ ప్రకాశశరీరం కూడా ఒక పల్చటి ప్రకాశంతో కప్పబడినట్టుగా కనిపించేది. దీని అర్థం ఏంటంటే అతని మనస్సు మరే ఇతర భౌతిక పదార్థాలను చూసేది కాదు. తేజస్సుని మాత్రం అనుభవించేది, ఆ తేజోమయ శరీరం లో లోపల గాయత్రి మంత్రోచ్చారణ జరుగుతూ ఉండేది. ఆ జ్యోతి ధార ఊర్ధ్వగమనం చెందుచున్నట్లు తెలిసేది. ఇది అతని స్వయం భావన కాదు, ఎందుకంటే అతను ఇటువంటి భావనలన్నీటినీ మర్చిపోయి, కేవలం జపంలోనే నిమగ్నమయ్యాడు. ఇది మంత్రాక్షరాల స్పందన వల్లనే వచ్చిన ఫలితం అనే దాంట్లో సందేహమే లేదు.

ఈ ప్రకాశధార ఊర్ధ్వముఖంగా ప్రయాణించి మస్తిష్కంలో కేంద్రితమవసాగింది. ఖచ్చితంగా కొన్ని నెలల అభ్యాసం తరువాతే ఇలా తెలియడం మొదలయింది. వేల సూర్యులు ఒక చోట చేరినా

**మంచివాళ్ళు కూడ ఏదో ఒక సమయంలో తప్పు చేయక తప్పదు.**

ఆ మస్తకంలో స్థితమైన ప్రకాశపుంజానికి సరిపోదని ఒక్కోసారి అనిపించేది. కాని ప్రకాశ కేంద్రంలో ఏదో క్రియ జరుగుతున్నట్లు కనిపించేది. గాయత్రీ మంత్ర జపం మాత్రం ఇదివరకు లాగానే సాగిపోయేది. ప్రపంచానికి సంబంధించిన ఏ ముఖ్యమైన కార్యానికి కూడా అతనికి ప్రకాశమే ప్రకాశం గోచరించేది. కాసేపైయ్యాక వస్తువుల భిన్నత్వం కనిపించినప్పటికీ, ఉండి, ఉండి ఒక ప్రకాశ కిరణం అతనిలో వెలిగేది. అప్పుడు కూడా అతని అంతరంగంలో ప్రయత్నించే జపం జరుగుతూ ఉండేది. అప్పుడప్పుడూ అయితే బైట వస్తువులు కూడా జపం చేస్తూ కనిపించేవి. పృధ్విలోని కణకణమూ గాయత్రి మంత్రం పలుకుతున్నట్టుండేది.

కొద్ది రోజుల అభ్యాసంతోనే మస్తిష్కంలో కనిపించే ప్రకాశం చైతన్యంగా మారినట్టు తోచింది. చంద్రుడంతటి చల్లదనంతో, సూర్య సమానంగా ప్రకాశించే ఒక కమలం వంటి జ్యోతి ఒక్కసారిగా వెలిగి మళ్ళీ దాక్కునేది. ఒకోసారి ఆ ఆదిశక్తి మకుటం కనిపిస్తే మరోసారి చరణకమలాల నఖజ్యోతి ఓ మహా ప్రకాశంగా జ్వలించి దట్టమైన అంధకారంలో విద్యుత్తు వెలిగినట్టు వెలిగేది. ఇప్పుడు ఆ ప్రకాశం వైపుకి ధ్యాస పోవట్లేదు. అతనికి అంతగా ఆది భాసించటం లేదు. సంపూర్ణ అంత:కరణలో ఆదిశక్తి గాయత్రి మాత దర్శనానికై ఆతృతగా ఉండేది. ఒక్కోక్షణం ఒక్కో యుగంగా అనిపించేది. సహించలేనంత వేదన కలిగినప్పుడు ఆ జ్యోతి తప్పకుండా ఒక్కసారి నాట్యం చేసేది. ఆ అనుభూతిలో కూడా గాయత్రి మంత్రధార నిలిచిపోయేది కాదు. అస్తిత్వం యొక్క అంతరాళాల లోంచి, జపం, ధ్యానం వల్ల కలిగే అనిర్వచనీయమైన రసధార తీవ్రగతితో ప్రవహించేది.

ఒకరోజు గంగాస్నానం చేసి తిరిగి వస్తుంటే, దారిలోని దట్టమైన చెట్లను చూసి అక్కడే కూర్చోవాలి అనిపించింది. ఒక చిన్న చెట్టు కింద కూర్చుండిపోయాడు. అది చలికాలం, అంత పొద్దున్నే అక్కడ ఎవరూ లేరు. వాయుమండలంలోని నిశ్శబ్ద ధ్వనులు కూడా వినిపించేంతటి ఏకాంత స్వాస్తికాసనంలో కూర్చుని, చేతులు, వడిలో పెట్టుకుని కళ్ళు మూసుకుని గాయత్రీ మంత్ర ధ్వని మీద దృష్టి కేంద్రీకరించాడు. కాని ఇదేంటి? కనురెప్పలు మూసుకోవట్లేదు. ఒక శక్తివంతమైన ప్రకాశం రెప్పల్లోంచి దూసుకుంటూ పోయి కంటి తీగల్లో జొరబడుతోంది. ఎంత ప్రయత్నించినా కళ్ళు మూసుకోలేకపోయాడు.

కళ్ళు తెరచి చూసేసరికి అక్కడ అడవి లేదు, చెట్లు లేవు, ఇంతకుముందు కుర్చున్న చెట్టు లేదు. నలువైపులా గొప్ప ప్రకాశం నిండి ఉంది, దాని మధ్యలో ఎలా కూర్చున్నాడో అలాగే స్వాస్తికాసనంలో కూర్చుని ఉన్నాడు. మనస్సు నడిపించే లీల కావచ్చు అనుకున్నాడు. మళ్ళీ కళ్ళు మూసుకోవడానికి ప్రయత్నించనప్పటికీ అవి మూసుకోవట్లేదు. చేసేది లేక ముందుకు చూశాడు. ఆది శక్తి గాయత్రి మాత భూమికి ఒక జానెడు పైకి నిలుచుని మందహాసంగా చూస్తోంది. మోహింపచేసే కళతో వేదమాత భాసిస్తోంది. స్వయంగా సవితా దేవత ఘనరూపం దాల్చిందా అన్నంతగా ఆ స్వరూపం ప్రకాశిస్తోంది. ఆ ప్రకాశంలోనే అపూర్వమైన శీతలత్వం దాగి ఉంది.

మౌనం వీడింది, అతని చెవులలో అమృతధార ప్రవహించసాగింది. జగన్మాత వాత్సల్యంతో ఇలా అంది, –"నేనే సూర్యుడిని నేనే గాయత్రిని. ఇప్పటికి మాత్రం ఈ స్వరూపంతో మాత్రమే నీవు నన్ను స్పృశించదలుచుకుంటున్నావు. నీవున్న ఈ సంపూర్ణ జగత్తు, నీవు చూస్తున్న ఈ జగత్తు అంతా నాలీలాభూమి. కణ కణాల్లోనూ నా శక్తే క్రీడిస్తోంది. నీ దృష్టికోణాన్ని బట్టి నీవు వాటిని స్థూలంగా, సూక్ష్మంగా, కారణరూపాల్లో చూస్తావు. నన్నే జగత్తని ఎందుకు భావిస్తున్నావు. ఇదంతా నా స్వరూపము. సవితా దేవత నాకు అధిష్ఠాత. వాటి రహస్యమయ స్థానాలలో, వాటి కళ్ళు కూడా చూడలేని ప్రదేశాలలో నా అనంత, అనాది, రసమయ, మధుమయ, లాస్యమయ, ఐక్యరస శక్తిక్రీడ నడుస్తూ ఉంది." జగన్మాత ఈ విధంగా చెప్పి మాటలు ఆపేసింది.

ఏ వైపు చూసినా అతనికి నలుదిక్కులా సవితా దేవత గాయత్రి మాతవలె కనిపించసాగింది. తన శరీరము, జగత్తు, ఒక్కో సంకల్పము, సంపూర్ణ వృత్తులు ఆమె లీలతోనే పరిపూర్ణమవుతున్నాయి. ఎంత సేపు ఇలా చూస్తుండిపోయాడో తెలియదు. చివరకి భావోద్వేగంతో ఆ లీలామయి ఆదిశక్తి చరణాలను స్పృశించి 'అమ్మా' అని పిలవడానికి ఒంగేసరికి స్పర్శ దొరికీ దొరకకుండానే ఆ అడవిలోనే అదే చెట్టు కింద కూర్చుని ఉన్నట్లు చూసాడు. అతని రోమ రోమాలనుండి గాయత్రి మంత్రం యొక్క గంభీర ధ్వని వెలవడుతోంది. కాసేపు విస్మయంతో నిండిన కళ్ళతో చూస్తుండగా కమండలం చేతపుచ్చుకొని ఆ మహాపురుషుడే ఇటుగా వస్తున్నాడు. వారి పెదవులలో అపూర్వమైన చిరునవ్వు కనిపించింది.

*అనువాదం – బచ్చు జయలక్ష్మి*

*(అఖండజ్యోతి, డిశంబర్ 1999)*

**స్త్రీ మంచితనాన్ని ఆమె చేసిన పనులను బట్టి తెలుసుకోవచ్చు.**

# శక్తిని సక్రమంగా వాడుకోవడమే సంయమం

మిగతా ప్రాణుల కంటే మనిషికి శ్రేష్ఠమైన గుణాలు అందాయి. శక్తి యొక్క స్రోతస్సుతో అతనికి అవినావభావ సంబంధం ఉంది. శారీరక శక్తిని దృష్టిలో ఉంచుకొని చూసినట్లయితే మనిషి మిగతా ప్రాణుల కంటే బలహీనమైనవాడు. అయినప్పటికీ, అతడు సాధనాలను సమకూర్చుకొని ప్రపంచానికి సర్వాధికారి అయ్యాడు. కానీ ప్రపంచంలో ఒకవైపు దారిద్ర్యంతో బాధపడేవాళ్ళు, బలహీనులు, అజ్ఞానులు ఉంటే మరొకవైపు తమ ప్రతిభాపాటవాలతో ఈ సమాజానికి ఎన్నో కొత్త ఆవిష్కారాలను అందించిన మహాపురుషులు ఉన్నారు. విజ్ఞానం మనకి అందిస్తున్న అద్భుతాలు మనల్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తున్నాయి. ఇవి కొందరు మహా పురుషులు మనకు అందించిన వరాలు. వారు తమ ప్రతిభను, సామర్థ్యాన్ని ఒక నిశ్చిత దిశగా ఉపయోగించి ఇటువంటి అద్భుతాలను సాధించారు. చరిత్ర తిరగేస్తే ఈ సత్యం మన కళ్ళకు కట్టినట్లుగా కనిపిస్తుంది. ఒక వ్యక్తి సమాజం యొక్క ఆలోచనా విధానాన్ని మారుస్తాడు. అతను తన లోపల ప్రచండమైన ఆలోచనాశక్తిని కలిగి ఉంటాడు. మిగతా వాళ్ళందరూ దానికి అనుగుణంగానే ఆలోచించటం మొదలుపెడతారు. ప్రతిభావంతులతోపాటు అయోగ్యులు కూడా ఈ ప్రపంచంలో ఉన్నారు. ఒక వ్యక్తి తన వ్యక్తిత్వంతో మొత్తం సమాజంలోని సమస్యలన్నింటికీ పరిష్కార మార్గాన్ని చూపిస్తాడు. మరికొంతమంది తమ జీవితంలో ఎదురయ్యే చిన్న చిన్న కష్టాలను చూసి బెంబేలెత్తిపోతారు. దానికి తగిన పరిష్కారం కనుక్కోవడం వాళ్ళకి కొండంత భారంగా అనిపిస్తుంది.

భగవంతుడు ఈ జగత్తును సృజించాడు. ఆయన ఈ శక్తులు ప్రసాదించడంలో ఏమైనా పక్షపాతం చూపించాడా ? అన్న ప్రశ్న మన మదిలో మెదులుతుంది. చూపించలేదు. భగవంతుడు ఆ శక్తులను ఉపయోగించుకోవడానికి ప్రతివ్యక్తికీ అవకాశం ఇచ్చాడు. వాటిద్వారా లోక కల్యాణం జరగాలని ఆయన ఉద్దేశం. మహాపురుషులకు, సామాన్యులకు మధ్య ఉన్న తేడాకి సాధనాలు, పరిస్థితులు కారణం కావు. ఎంతో కష్టతరమైన పరిస్థితులను తట్టుకొని మహాపురుషులు ఎన్నో మహత్‌కార్యాలు చేశారు. లభించిన శక్తిని, కోరుకున్న దిశగా ఉపయోగించిన కారణంగానే వాళ్ళు ఈ ఘనకార్యాలు సాధించగలిగారు. ఆ శక్తులు మనదగ్గర కూడా ఉన్నాయి, మనకు కూడా సాఫల్యాలను తెచ్చిపెట్టేవే. కాని రెండు కారణాల వల్ల మనం వాటి లాభాలను పొందలేకపోతున్నాం.

మొదటి కారణం ఏమిటంటే, మనం మనదగ్గర ఉన్న శక్తులను అనవసరంగా వృథాగా ఖర్చు చేస్తూ ఉంటాం. మన దగ్గర ఉన్న పరిమిత వనరులను అనవసరమైన పనుల కోసం ఖర్చుపెడితే అవి సమాప్తమవడమే కాకుండా, వచ్చే వనరులు కూడా ఆగిపోతాయి. ఉదాహరణకి–ఒక వ్యక్తి వృత్తిగాని, పరిశ్రమ గాని ప్రారంభించాలనుకుంటే మొదట అతని దగ్గర చక్కటి ప్రణాళిక ఉండాలి. అతడు యోగ్యుడై ఉండాలి. ఇవి రెండూ ఉంటే పెట్టుబడి ఎక్కడి నుండైనా తెచ్చి మొదలు పెట్టవచ్చు. ప్రభుత్వం నుండి, ప్రభుత్వేతర సంస్థల నుండి సహాయం లభిస్తుంది. తన సొంత విలాసాల కోసం డబ్బు కావాలని అడిగితే ఇవ్వటానికి ఎవరూ ముందుకు రారు. తన దగ్గర ఉన్న డబ్బులు ఖర్చు అవుతాయి. మన దగ్గర ఉన్న శక్తులను అనుచితమైన పనులు చెయ్యటానికి వినియోగిస్తే కొత్తగా శక్తిని పొందటానికి పాత్రతను కోల్పోతాము. ఆ శక్తి ప్రవహించే మార్గం మూసుకుపోతుంది.

మన దగ్గర ఉన్న వనరుల లాభం మనం పొందలేక పోవటానికి రెండవ కారణం వాటిని సరియైన దిశలో ప్రయోగించలేకపోవటం. ఆవిరి ఒకచోట ఏకత్రితం అయినపుడు దానిని వెంటనే ఉపయోగించాలి. అలా చెయ్యకపోతే గిన్నె మాడిపోతుంది. నీటికి గల లక్షణం ప్రవహించడం. ఈ నీళ్ళు ఎటువంటి నియంత్రణ లేకుండా ప్రవహిస్తూ ఉంటే పెద్ద పెద్ద నష్టాలు సంభవిస్తాయి. వరదలు అంటే ఏమిటి? వర్షాలు వచ్చినప్పుడు కురిసిన నీటిని నియంత్రించలేకపోవడమే. మనకు లభించిన శక్తిని సరియైన దిశలో ప్రయోగించినప్పుడు మనం దాని సంపూర్ణ లాభాన్ని పొందగలుగుతాము.

మన దగ్గర ఉన్న శక్తుల అపవ్యయాన్ని అరికట్టి వాటిని మంచి పనుల కోసం వినియోగించడమే సంయమం. మనీషులు, మహాపురుషులు దీనిని జీవితంలో అంతర్భాగంగా భావించారు. శక్తుల ప్రవాహానికి అడ్డుకట్టవెయ్యడాన్నే సంయమంగా పేర్కొంటూ వచ్చారు. శక్తుల ప్రవాహాన్ని ఆపుచేసి, వాటిని ఉపయోగించక పోయినట్లయితే దానివల్ల లాభం కంటే నష్టం ఎక్కువ జరుగుతుంది. నదుల నీటిని ఆనకట్ట కట్టకుండా, పంట పొలాలకి ఉపయోగించకుండా, విద్యుత్ శక్తిని ఉత్పత్తి చెయ్యకుండా ఉన్నట్లయితే ఆ నీళ్ళు వినాశనానికి దారితీస్తాయి. సంయమం అంటే అర్థం దేనినైనా సరే నిరర్థకంగా, హానికరంగా వినియోగించడానికి బదులు సార్థకంగా, ప్రయోజనకరంగా వాడటమే. ఇలాంటి సంయమం సాధించటానికి ఎంతగా ప్రయత్నిస్తే అంతగా మన వ్యక్తిత్వం ఉన్నతం అవుతుంది.

అనువాదం – లక్ష్మీ సుందరి

**నీవు చూచే దృష్టిని బట్టే నీకు ప్రపంచం కనిపిస్తూ ఉంటుంది.**

నావారితో నామాట

# శతజయంతి ఉత్సవాల రూపురేఖలు-9

## జన్మశతాబ్దివిలక్షణ కార్యక్రమం ప్రారంభం అయింది

### ఆలోచనా క్రాంతి పూర్వాపరాలు

2007 జనవరి నుండి పూజ్యగురుదేవుల శతజయంతి గురించి మార్గదర్శనం చేయబడుతుంది. గతరెండు మాసముల నుండి పరిశోధనాత్మక సాధనా ప్రధానమైన ఏర్పాటు గురించి చర్చించడం జరగుతున్నది. సాధన అనేది వ్యక్తి గతంగానూ ఉండవచ్చు. సామూహికంగానూ ఉండవచ్చు. ఫలితాలు మాత్రం ఉన్నతంగాఉంటాయి. ఈనాడు సమాజంలో కనిపిస్తున్న విషపూరితవాతావరణం సామూహికసాధనవల్లనే దూరం అవుతుంది. రోజులో 3సార్లు 30ని॥ చొప్పున సృజన సాధన – మహాపురశ్చరణలో పాల్గొంటూ, వారంలో ప్రత్యేకంగా రెండు రోజులు దీని కొరకు కేటాయించుకోవాలి. ఆలోచనల్లో మార్పు గురించి, జన్మ శతాబ్ది గురించి చర్చిద్దాం.

ఈ జన్మశతాబ్ది ఎవరికి? యుగపరివర్తన కొరకు ఆవిర్భవించిన ఒక మహా మానవునికి. ఆలోచనల్లో మార్పు తేవడానికి అవతరించిన యుగఋషికి. ఉత్తర ప్రదేశ్‌లోని ఆగ్రాజిల్లా? ఆవల్‌ఖేడా గ్రామంలో 20-09-2011 ఆశ్వయుజ బహుళత్రయోదశినాడు పండిత శ్రీరామశర్మ ఆచార్య జన్మించారు. వారి తల్లి దండ్రులు దానకున్‌వరీదేవి, రూపకిశోరశర్మ. వారి అవతరణకు ముందునుండే కొన్ని శుభాసూచనలు కనిపించాయి. వాటిని బట్టి ఒక విశేష ప్రయోజనం కోసమే వారు జన్మించారని అందరూ భావించారు. ఎవరైనా ఒక అవతార పురుషుడు జన్మించాడంటే అనేక మంది మునులు, ఋషులు, దేవతలు అతని వెన్నంటివస్తారు. కొంత పూర్వభూమికను తయారు చేస్తారు. కొందరు వెంటనంటి ఉంటారు. మరికొందరు తరువాతి కార్యక్రమాలలో కూడా పాలు పంచుకుంటారు.

### మూడు మహత్తరమైన ఘట్టాలు

ఆంగ్లేయుల పాలనలో అణగారిపోతున్న భారతదేశం ఒక మహాత్ముని రాకకై ఎదురుచూస్తున్న రోజులు, ఉద్యమాలు నడుస్తున్నాయి. అయినా ఆంగ్లేయుల దురాగతాలు ఆగడం లేదు. 1857 విప్లవం తర్వాత తెల్లవారు మరింత తెగించారు. ఈ బంగారు భూమిని తేలిగ్గా వదలలేకపోతున్నారు. కాని ఇక్కడ జరిగే దివ్య ఘటనలను, భగవంతుని నిర్ణయాన్ని మార్చలేక పోతున్నారు. స్వామివివేకానందుడు దేశగౌరవాన్ని దేశ దేశాలలో చాటిచెప్పారు. 1902లో వారి మహా ప్రయాణం జరిగింది. దాని తర్వాత కూడా దేశ ప్రతిష్ఠ అదే విధంగా నిలచి ఉంది. శ్రీఅరవింద మహర్షి వివేకానందుని తర్వాత జన్మించారు. కాని వారు విప్లవాత్మక ఘటనల్లో పాలుపంచుకోవడానికి కలకత్తా, బడోదరాలలో అజ్ఞాతంలోకి వెళ్ళిపోయాడు. తరువాత ఆంగ్లేయులను పంపించివేయాలన్న పథకాలు రచించారు. పరమపూజ్యగురుదేవుల జననానికి ముందు 1907లో ఒక మహా మానవుడు పంజాబులో జన్మించాడు. 24సంవత్సరాలు మాత్రమే జీవించిన భగత్‌సింగ్ అమరవీరుడయ్యాడు. ఈ మూడు ఘట్టాలు భారతదేశ ఔన్నత్యానికి మూలస్తంభాలు అని చెప్పవచ్చు. యుగపరివర్తన కొరకు అధ్యాత్మపరంగా మార్గదర్శనం చేయగల మహామానవుడు రావాల్సిఉంది. దానికిగాను (1) స్వామీ వివేకానంద (2) అరవింద మహర్షి (3) భగత్‌సింగ్ ముగ్గురు పునాది రాళ్ళుగా నిలిచిపోయారు.

### గాంధీ మహాత్ముడయ్యాడు

1869లో పోరుబందర్‌లో జన్మించిన మోహన్‌దాస్ కరంచంద్ గాంధి సత్యాగ్రహ ఉద్యమం చేపట్టి మహాత్ముడయ్యాడు. మొట్టమొదటి ప్రయోగం దక్షిణ ఆఫ్రికాలో చేసి, 1909లో భారతదేశానికి తిరిగి వచ్చాడు. ఆనాటి భారతదేశ స్థితిగతులను గమనించి దేశసేవలో నిమగ్నమయ్యాడు. క్రమంగా భారత స్వాతంత్ర్య సంగ్రామానికి నాయకత్వం వహించాడు. ఆయన వృత్తిరీత్యా బారిష్టరు. వృత్తిని వదలివేసి గోఖలేగారి సూచనల ప్రకారం సహచరుల సహకారంతో సత్యాగ్రహ ఉద్యమం

**పురుషుని మంచితనాన్ని అతను చేయని పనులను బట్టి తెలసుకోవచ్చు.**

ప్రారంభించారు. 1942లో 'క్విట్ ఇండియా' నినాదం లేవదీశాడు. 1947లో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చాడు. 1920 నుండి 1933 వరకు గాంధీ యుగంగా చెప్పబడింది. 1934 నుండి 1947 వరకు విభజన యుగంగా చెప్పబడింది. ఆ కాలంలోనే అందమైన, విశాలమైన భారతదేశం మూడు ముక్కలు చేయబడింది. ఎవరుదోషి? అన్నవిషయం మీద చర్చ అనవసరం. మన గురుదేవుల అవతరణ తర్వాతనే గాంధీజీ మహాత్ముడు అయ్యాడు. ఆయన, ఆయనతో పాటు అనేక మంది దేవమానవులు, భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురు మొదలైనవారు స్వాతంత్ర్య సమరంలో ప్రధాన పాత్రవహించారు. ఆ కాలంలోనే శ్రీఅరవిందమహర్షి రమణ మహర్షితో కలసి సూక్ష్మజగత్తును తపింపచేశారు. భావవిప్లవాన్ని, యుగపరివర్తనను సఫలం చేయడానికి తమవంతుపాత్రను నిర్వహించారు. స్వాతంత్ర్యం లభించిన తర్వాత 1947లో మహాత్మాగాంధీ, 1950లో శ్రీ అరవింద మహర్షి ఈ లౌకిక ప్రపంచం నుండి విశ్రాంతి తీసుకున్నారు. అప్పటికి మన గురుదేవుల వయస్సు 40 సంవత్సరాలు.

## విజ్ఞానజగత్తులో ఆవిష్కరణల కాలం

ఆలోచనలలో మార్పుతేవడానికై చేసిన కృషితో పాటు, విజ్ఞానజగత్తులో ప్రపంచం మొత్తం మీద జరిగిన మహత్తర కృషిని మనం గర్వంగా చెప్పుకోవాలి. ఈ ఆవిష్కారఘట్టాలు 21వ శతాబ్దిని ప్రభావితం చేశాయి. 1905 లో ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతాన్ని నిరూపించి, భౌతికతను గురించి ఆమూలాగ్రంగా మార్చివేశాడు. ఈనాటి వరకు మన దైనందిన ఆరోగ్యంలో ఒక భాగంలోని విటమిన్లను 1906లో కనుక్కోవడం జరిగింది. మధుమేహ రోగపీడితులకు వరదానమైన 'ఇన్సులిన్' 1912లో ఆవిష్కరించబడింది. 1911లో 'రుదర్‌ఫోర్డ్' పరమాణు సిద్ధాంతాన్ని ఆవిష్కరించాడు. 1910లో 'అలగ్జాండర్ ఫ్లేమింగ్' 'పెన్సిలిన్‌ను ఆవిష్కరించి, యాంటి బయోటిక్స్ ఈ సమయంలోనే అందించాడు. రేడియో బ్రాడ్ కాస్టింగ్ మొదటి ప్రయోగం, రాడారు, టి.వి., ఎ.ఎమ్, రేడియో యొక్క మొదటి ప్రయోగం 1913–1914లో జరిగాయి. తరువాత మరికొంత అభివృద్ధి మార్గంలో పయనించాయి. టి.వి., ట్రాన్స్‌మిషన్ 1925లో ప్రారంభించబడింది. 'జనసంచార క్రాంతి' 20 శతాబ్దిలో ఆరంభించబడింది. 1935లో కంప్యూటర్‌ను పెద్దహాలులో పెట్టేవారు. దానికి సంబంధించిన ఉపకరణాలు చాలా ఎక్కువగా ఉండేవి. అది మార్కెట్‌లోకి రావడానికి 1943వరకు పట్టింది.

## మరికొన్ని మహత్వపూర్ణఘట్టాలు

ఈ మధ్యలో ధార్మిక దృశ్యంకూడా మారిపోయింది. 20వ శతాబ్ది మొదటి 10 సంవత్సరాలలో ఆస్తికతావాదం, హిందుత్వం, బౌద్ధ మతం ప్రారంభం అయినాయి. నియమానుసారంగా ఆస్తిక వాదానికి గౌరవం లభిస్తోంది. దయానందమహర్షి, స్వామి వివేకానందుల కృషి ఫలితమే అని ఘంటా పథంగా చెప్పవచ్చు. ఇంటర్ ఫేథరిలీజన్, శిక్కు మతం కూడ ఈ రోజుల్లోనే పుట్టుకొచ్చాయి. కార్ల్‌జుంగ్, ఫ్రాయిడ్ ఈ రోజుల్లోనే జన్మించారు. వారు మానసిక శాస్త్రాన్ని నూతన పద్ధతిలో వివరించారు. మనోవిజ్ఞాన శాస్త్రానికి క్రొత్త పద్ధతి దొరికింది. అనేక నిర్ణయాలు వచ్చాయి. వాటిమూలంగా 20వ శతాబ్ది స్వరూపమే పూర్తిగా మారిపోయింది. 1913–1945 మధ్యలో రెండు ప్రపంచ యుద్ధాలు జరిగాయి. ఈ యుద్ధాలు ప్రపంచ పౌరులందరినీ ప్రభావితం చేశాయి. హిరోషిమాపై ప్రయోగింబడిన పరమాణు బాంబు మాయని మచ్చగా మిగిలిపోయింది. 20వ శతాబ్దికి 20సంవత్సరాలకు ముందు అనేక నవలలు భవిష్యత్తును గురించి వ్రాయబడ్డాయి. వాటిల్లో అధికశాతం విజ్ఞానాన్ని గురించి ఉన్నాయి. దీనిని బట్టి భవిష్యత్తును ముందుగానే ఊహించి, మనోశక్తితో ప్రతిపాదించవచ్చునని అర్థం అయింది.

## ఆలోచించడానికిది ప్రత్యేకసమయం

ఈ సమయం చాలా విశేషమైంది. అందుకే ఇన్ని విధాలుగా వ్రాయడం జరుగుతున్నది. 20వ శతాబ్దికి 20 సంవత్సరాల ముందు ఒక్క భారతదేశాన్ని గురించే కాదు ప్రపంచదేశాలన్నింటి గురించి భూమికను తయారుచేయడం జరిగింది. 20వ శతాబ్ది మాత్రమేకాదు. 21వ శతాబ్ది గురించిన స్వరూపాన్ని వ్రాయడం జరిగింది. ఇవే కాకుండా వ్యక్తి యొక్క ఆలోచనావిధానం, సమాజంలో అవాంఛనీయ సంఘటనలు, మూఢవిశ్వాసాలు,

**అందరూ సమస్యలను ఎదుర్కోవలసిందే - ఎట్లా ఎదుర్కొన్నారన్నదే ప్రశ్న.**

మూఢాచారాలు, అంధానుకరణ తెలుపబడ్డాయి. మెల్ల మెల్లగా విజ్ఞానం వృద్ధిచెందింది. కాని సమాజం మాత్రం 2000 సంవత్సరాల నాటి దాస్యంలోనే నిద్రపోతూ ఉంది. సమాజాన్ని మేల్కొల్పాలన్నా, ప్రపంచ ప్రజలకు భారతీయ ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని పరిచయం చెయ్యాలన్నా ఒకానొక మహాపురుషుని రాక ఎంతో అవసరం. ఆ వ్యక్తి కొరకే ప్రపంచమంతా ఎదురుచూస్తుంది. ఆ మహనీయుడే మహత్వపూర్ణమైన ఆయుధాన్ని చేపట్టాలి. వ్యక్తి ఆలోచనల్లో మార్పువచ్చిననాడే సమాజంలో పూర్తిగా మార్పువస్తుంది. భావ విప్లవాన్ని నినదిస్తూ ఒకానొక దివ్యశక్తి 1911లో శ్రీ కృష్ణభగవానుని క్రీడా స్థలంలో ఉద్భవించింది. ఆయన పండాలకు నిలయమైన మధుర – హరిద్వార్ నగరాలను తన కార్యక్షేత్రంగా చేసుకున్నారు. తాను చెప్పదలచిన విషయాన్ని బల్లగుద్ది మరీ చెప్పారు. అదేవ్రాసి ఇచ్చారు. తన ఆలోచనలకు 'గాయత్రీ పరివార్' అని పేరుపెట్టారు.

## ఇదంతా దైవనిర్ణయమే

"అన్ని సమస్యలకు పరిష్కారం భావవిప్లవమే" అని చెప్పేముందు ఈ పూర్వ భూమికను చదవాల్సి ఉంటుంది. ఇది చాలా ముఖ్యమైన విషయం. అప్పుడే పరిజనులు దాని తీవ్రత తెలుసుకోగలుగుతారు. ఇది ఎంత మహోన్నత కార్యమో ఆలోచించడం కూడా కష్టమే. ఆలోచనల్లో మార్పువస్తే సాధ్యం కానిది ఏమి ఉండదు. బ్రెయిన్‌వాష్ జరుగుతుంది. సామ్యవాదంలో హిట్లర్‌నాజీవాదం చేశాడు. కాని ఆలోచనల్లో మార్పు అంటే అన్నింటికన్నా కష్టమైన పని. మన గురుదేవులు జన్మించి తనయొక్క గురుసత్తా చెప్పిన ప్రతీ బాధ్యతను పూర్ణవిశ్వాసంతో పూర్తి చేశారు. స్వాతంత్ర్య సంగ్రామంలో కూడా పూర్తి నిష్ఠతో పనిచేశారు. మహాత్మగాంధీతో కలవడం, ఉద్యమాలలో పాల్గోవడం, అఖండదీపం సమక్షంలో కూర్చుని 8 గంటలు తపస్సు చేయడం, గాయత్రీ అనుష్ఠానాలు చేయడం ఏది చేసినా పూర్తి నియమనిష్ఠలతో మనస్ఫూర్తిగా చేసేవారు. 1926 నుండి 1953వరకు ఈ తపస్సాధనలోనే గడిపివేశారు. 1926లో అఖండ దీపాన్ని స్థాపించడం, శ్రీఅరవింద మహర్షి భాగవత చైతన్యాన్ని భూమిపైకి తీసుకుని రావడం, శక్తి స్వరూపిణి మాతా భగవతీశర్మ ఆగ్రాలో జన్మించడం మొదలైనవన్నీ సహజంగా జరిగినవి కావు. భగవంతుని కనుసన్నల్లో జరిగినవే. "జన్మ రక్మచమే దివ్యం" అని కృష్ణ పరమాత్మ అన్నారు. ఈ మాట పూర్తిగా మన గురుసత్తాకు వర్తిస్తుంది. వారి జీవితం క్రాంతికారీ విషయాలను స్థాపించడంలోనూ, దివ్య సత్తాను చైతన్య పరచడంలోను గడిచిపోయింది. వారి సూక్ష్మ సంరక్షణలో ముందు కాలం కూడా ఇలాగే గడిచిపోతుంది.

'ఆలోచనలో మార్పు' అనే ఉద్యమం ఎలా ప్రారంభం అయిందో వచ్చే మాసం చర్చించుకుందాం.

*(అఖండజ్యోతి – అక్టోబరు – 2009)*

## త్యాగశీలి టాండన్

*"సర్వెంట్ ఆఫ్ పీపుల్" కి సభాపతిగా ఉన్న లాలా లజపత్ రాయ్ స్వర్గస్తులయ్యారు. గాంధీగారు ఆస్థానాన్ని భర్తీ చేయదలచుకున్నారు. కాని కొద్ది జీతానికే పని చేసే యోగ్యుడైన వ్యక్తి ఎక్కడ దొరకుతారు? తమ సుఖ – సౌఖ్యాలు త్యజించి జీవితాన్నే సమర్పించగలిగేవారు ఎవరు అన్నది పెద్ద ప్రశ్నగా మిగిలిపోయింది. టాండన్ గారికి కబురందింది. పదమూడు వందల రూపాయల జీతంతో బ్యాంక్‌లో మ్యానేజర్‌గా పనిచేస్తున్న ఆయన అది వదిలేసి నిర్వహణ యోగ్యానికి మాత్రమే పరిపోయే జీవనభృతికి ఒప్పుకుని ఈ పనికి సిద్ధమయ్యారు. "మీ ఉద్యోగాన్ని వదులుకోవడం వల్ల వచ్చేనష్టానికి మీకు బాధగా లేదా" అని అడిగారు "బాపూ! లోకకల్యాణానికోసం అపరిగ్రహ జీవనం గడపడమే కాదు, శరీరాన్ని వదలేయమని ఆదేశించినా కూడా నేను దాన్ని శిరసావహిస్తాను." అని ఆ రాజర్షి బదులిచ్చారు.*

*గాంధీ గారి సమకాలికుల్లో లభించినంత గౌరవ మర్యాదలు టాండన్ గారికి వేరెవరికీ దొరకలేదన్నది లోక విదితం.*

**ప్రేమించడం సహజం అని తెలుసుకుంటే, అసూయకు ఆస్కారం ఉండదు.**

# ఏ పుస్తకంలో ఏముంది?

## సృష్టికర్త పరమ ప్రసాదం

రచన : **శ్రీరామ శర్మ ఆచార్య**

అనువాదం : **డి.వి.ఆర్. మూర్తి**

క్రాంతి ధర్మీ సాహిత్యంలో ఇది 13వ పుస్తకం. విశ్వ బ్రహ్మాండములో వ్యాపించి ఉన్న శక్తిని భగవంతుడు అని అంటాము. సర్వవ్యాపి సర్వసమర్థత కలిగిన ఆశక్తి యొక్క ఒక అంశ ప్రతివానిలో ఉన్నది. ఈ శక్తిని సముచిత కార్యములో ఉపయోగించిన వారిని ప్రతిభావంతులని, అనుచిత కార్యములలో ఉపయోగిస్తే దైత్యులు అని అంటాము.

సృష్టిక్రమంలో కర్మ, దాని వల్ల వచ్చే కర్మఫలమునకు సమయం పడుతుంది. కాని ఈ రోజులలో తాత్కాలిక లాభాన్ని చూచుకుంటున్నారు. వివేకదృష్టి లేకపోవడం వల్ల కష్టాల పాలవుతున్నారు. ఎంత తర్కించి, ఎంత తెలివితో చేసినా, ఏది నాటామో దాని ఫలితాలే వస్తాయి. కర్మఫలాల నుండి ఎవరు తప్పించుకొనలేరు. ఈ ప్రపంచంలో దండన పడకుండా తప్పించుకొనవచ్చు. కాని తప్పుచేసిన వారు భగవంతుని న్యాయస్థానంలో తప్పించుకొనలేరు.

శక్తి మంతుల సామీప్యం ఎప్పుడూ లాభదాయకమే. సర్వశక్తిమంతుడయిన భగవంతునితో సంబంధం పెట్టుకోవడానికి మనం ఎంత ప్రయత్నిస్తున్నాం? కొద్దిపాటి పూజా పారాయణలతో కోరిన వరాలు ఇస్తాడనే భ్రమ రాజ్యమేలుతున్నది. విశ్వశక్తి భాండారంలో అన్నింటికన్న అత్యుత్తమైన శక్తి ఆత్మశక్తి. దీని ముందు ధనబలం, బుద్ధిబలం, అధికారబలం ఎందుకు కొరగావు. ఆత్మబల సంపన్నులు ఇతరులు చేయలేని పనిని చేసి చూపుతారు. శ్రమకు తగిన ఫలితం ఎలాగూ ఉంటుంది. ఆత్మబల సంపాదన కష్టం కాదు. లోకకళ్యాణ కార్యక్రమాలను కూడా జీవన చర్యలో భాగం చేసుకోవాలి.

ఇంద్రియ సంయమనం, అర్థసంయమనం, ఆలోచనా సంయమనం సాధనకు మూడు చరణాలు. పూజా కార్యక్రమంలో దీపం వెలిగించడం, పుష్పములు అర్పించడం, అక్షింతలు వేయడం, చందనం పూయడం, నైవేద్యం సమర్పించడంలోని అర్థభావములు. తెలుసుకొని చేయడం చాలా ఉపయోగకరం. దీనితో పాటు సమయదానం, అంశదానం, ప్రతిభాదానం గురుదేవుల ప్రణాళికకు ఇవ్వాలి.

సృష్టికర్త రాబోయే రోజులలో యోగ్యులకు అందించనున్న పరమప్రసాదం ప్రఖర ప్రజ్ఞ. మనమందరము నవయుగ నిర్మాణంలో పాలుపంచుకొని పరమప్రసాదం ప్రఖర ప్రజ్ఞ పొందాలని ఈ పుస్తక సందేశం.

## ఆద్యశక్తి గాయత్రి సమర్థ సాధన

రచన : **శ్రీరామశర్మ ఆచార్య**

అనువాదం : **డి.వి.ఆర్. మూర్తి**

క్రాంతి ధర్మీ సాహిత్యంలో ఇది 14వ పుస్తకం. భరతభూమిని జగద్గురువుగా దివ్యసంపదల మూలకేంద్రం అంటారు. భారతీయ సంస్కృతి తత్వదర్శనాన్ని గాయత్రి మంత్రంలోని 24 అక్షరాలు వ్యాఖ్యగా గుర్తించారు. అందువల్ల గాయత్రి మంత్ర జపసాధనతో పాటు దానిలో సన్నిహితమై ఉన్న తత్వజ్ఞానాన్ని అధ్యయనం చేయాలి. గాయత్రిలో రెండు భాగాలున్నాయి. ఒక దానిని గాయత్రి అని రెండో భాగమును సావిత్రి అని అంటారు. గాయత్రి ఆత్మ జ్ఞానానికి సంబంధించినది. సావిత్రి అంటే భౌతిక ప్రయోజనాలలో ఉపయోగపడే విజ్ఞానము. ఈ రెండూ అవసరమే.

మానవ శరీరం గోమాత శరీరం వలె దైవీ శక్తుల దివ్య మందిరం. గాయత్రీ మంత్రంలోని 24 అక్షరములు దైవీ శక్తులను జాగృతం చేస్తాయి. ఇవి ముందుగా సద్గుణముల రూపంలో కనిపిస్తాయి. అవి శ్రమశీలత, సభ్యత, మితవ్యయం, సువ్యవస్థ, ఉదారసహకారం, వివేకం, నిజాయితీ, బాధ్యత, పరాక్రమం, ఈ తొమ్మిది గుణములే యజ్ఞోపవీతములోని 9 పోగులుగా గాయత్రీ సాధకుడు ధరిస్తాడు. గాయత్రీ సాధకుడు ఈ గుణములను పెంపొందించుకునే ప్రయత్నం చేయాలి. గాయత్రి సాధకుని లక్ష్యం అష్ట సిద్ధులు నవనిధులు కావాలి.

గాయత్రికి పూరకం యజ్ఞం. భారతీయ సంస్కృతికి జననీ జనకులుగా గాయత్రి–యజ్ఞాలను వర్ణిస్తారు. గాయత్రీ మంత్రంతో జోడింపబడిన యజ్ఞం పశు పక్షుల, వృక్ష వనస్పతుల ఎదుగుదలతో సహాయపడుతుంది. దీనికి మానవుల శారీరిక మానసిక రోగాలను నివారించగలిగే విశేషశక్తి ఉన్నది.

విశ్వామిత్రుని తపో భూమిలో నిర్మించబడ్డది శాంతికుంజ్. పరమ పావన గంగానది ఒడ్డున నిత్యం నవ కుండీ గాయత్రి యజ్ఞం జరిగే ఈ యుగ తీర్థములో చేసే గాయత్రీ సాధన అధిక ఫలదాయకం. ఇక్కడ జరిగే 9 రోజుల సాధన క్రమంలో పాల్గొని లాభాన్వితులు కావచ్చు.

పాఠకులను గాయత్రి సాధన చేసుకుంటూ, సద్గుణములు పెంపొందించుకుంటూ జీవన క్రమములో ముందుకు పొమ్మని ఈ పుస్తకం ప్రేరణ ఇస్తున్నది.

★★★

**ఒంటరితనానికి విలువే ఉండదు.**

# శాంతికుంజ్ హరిద్వార్‌లో సంజీవనీ విద్యా శిక్షణా శిబిరం
## (ఒక సమీక్ష)

01.09.09 నుండి 09.09.09 వరకు తొమ్మిది రోజులు శాంతికుంజ్ హరిద్వార్‌లో సంజీవనీ విద్యా శిక్షణా శిబిరం తెలుగువారికి ప్రత్యేకంగా తెలుగులో నిర్వహింపబడింది. దీనిలో ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుండి 180 మంది పరిజనులు పాల్గొన్నారు.

**1వ రోజు :** కార్యకర్తల పరిచయ కార్యక్రమాలతో పాటు వారి పేర్లు నమోదు చేసికొనుట జరిగింది.

**2వ రోజు :** ఉదయం 6 గం॥ల నుండి 7 గం॥ల వరకు యోగా తరగతులు, 9 గం॥ల నుండి 11 గం॥ల వరకు ప్రవచనం జరిగాయి. 30 సంవత్సరాలు గురుదేవులతో సహజీవనం కొనసాగించిన శ్రీ నమోనారాయణ పాండేగారు ప్రవచిస్తూ "అందరికీ మంచి బుద్ధినిమ్మని కోరుకోవడం మన సంస్కృతి" అంటూ ముగించారు. మధ్యాహ్నం 3 గం॥ల నుండి 5 గం॥ల వరకు "మంత్ర దీక్ష ప్రాముఖ్యత" గురించి శ్రీ ఉమేశ్ శర్మ ఉపన్యసించారు.

**3వ రోజు :** ఉదయం 6 నుండి 7.30 గం॥ల వరకు 100 మంది పరిజనులకు శ్రీ పరమానంద ద్వివేది గురుదీక్షను ఇప్పించారు. ఆ సందర్భంగా యజ్ఞోపవీత ప్రాముఖ్యతను తెలియచేశారు. మధ్యాహ్నం 3 నుండి 5 గం॥ల వరకు దక్షిణ భారత గాయత్రీ పరివార్ సంచాలకులు శ్రీ అశ్విని సుబ్బారావు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వై.యస్.రాజశేఖరరెడ్డి మరణవార్తను తెలియచేయగా 2 ని॥ మౌనం పాటించడం జరిగింది. తరువాత శ్రీమతి ప్రశాంతి శర్మ శాంతికుంజ్ చరిత్ర-విశేషాలను తెలియచేశారు.

**4వ రోజు :** ఉదయం 7.30 నుండి శ్రీ శివాజీ ఆధ్వర్యంలో శ్రాద్ధ తర్పణ కార్యక్రమం నిర్వహించబడింది. 9.30 నుండి 11 వరకు మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారములను నియంత్రించడం ఎలా? అన్న విషయంపై శ్రీ పరమానంద ద్వివేది ప్రవచనం చేశారు. మధ్యాహ్నం దేవ సంస్కృతీ విశ్వ విద్యాలయాన్ని దర్శించడం జరిగింది. విశ్వ విద్యాలయ కార్యక్రమాలను గురించి అక్కడ నిర్వహిస్తున్న గోశాలను గురించి వివరించడం జరిగింది. రాత్రి 9 గం॥లకు శ్రీమతి ఉషా జైస్వాల్ యజ్ఞ ప్రక్రియ గురించి తెలిపారు.

**5వ రోజు :** హరిద్వార్, ఋషీకేశ్‌ల సందర్శనార్థం సెలవు ప్రకటించబడింది.

**6వ రోజు :** ఉదయం 9.35 నుండి 11 గం॥ల వరకు "కుటుంబ నిర్మాణం" అనే అంశంపై శ్రీమతి అపర్ణ ప్రసంగించారు. 'బలి' అనగా బహుమానము అనీ, వైశ్యము అనగా విశ్వము కొరకు అనీ, 'బలివైశ్యము' అనగా విశ్వ శ్రేయస్సుకై చేసే ప్రక్రియ అనీ తెలియచేశారు. మధ్యాహ్నం 3 నుండి 5 వరకు శ్రీ బ్రిజమోహన్‌గౌడ్, మానవ జన్మ విశిష్టతను గురించి శ్రీ అశ్వినీ సుబ్బారావు గురుదేవుల ఆకాంక్షను, చేయవలసిన సమర్పణను గురించి ప్రసంగించారు.

**7వ రోజు :** ఉదయం 9 నుండి 11 గం॥ల వరకు "నర పశువు, నరపిశాచి, దేవత" అనే మానవ లక్షణాలను శ్రీ బ్రిజమోహనగౌడ్ వివరించారు. దేవతలుగా మారాలన్న సందేశాన్ని అందించారు. ప్రార్థన, మూడు శరీరముల ధ్యానం, తెలుగు సి.డి.లను ఆవిష్కరించారు. శ్రీమతి అనసూయమ్మ పాడిన యుగ సంగీతం పాటల సి.డి.ని. శ్రీ అశ్విని సుబ్బారావు సభకు పరిచయం చేశారు.

**8వ రోజు :** ఉదయం 7 గం॥లకు పూజ్య శ్రీ ప్రణవ పండ్యా గారిని దర్శించడం జరిగింది. పరమ పూజ్య గురుదేవుల జన్మ శతాబ్ది సందర్భంగా 2011లో కోటి మంది పరిజనులతో ఢిల్లీలోనూ 2012లో 2 కోట్లమందితో శాంతికుంజ్ హరిద్వార్‌లోనూ సమావేశాలు జరుగనున్నాయన్న ప్రణాళికను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నుండి 50 వేల మంది పాల్గోవాలని సూచించారు. స్వహస్తాలతో అందరికీ ప్రసాదవితరణ గావించారు. 9 నుండి 11 గం॥ల వరకు శ్రీకాళీ చరణ ప్రసాద్ "జ్ఞాన యజ్ఞం"పై ప్రవచనం చేశారు. త్రివిధ దానాల గురించి వివరిస్తూ జ్ఞానదానం గురించి విపులంగా తెలియచేశారు. జీవన సాధన వైద్య సేవకులుగా ఇంటింటికీ తిరగాలని సూచించారు. 3 నుండి 5 వరకు సాధకులు తమ తమ అనుభూతులను తెలియచేశారు.

**9వ రోజు :** "పరమపూజ్య గురుదేవులు శాంతికుంజ్‌లో దాచి ఉంచిన ఋషుల శక్తిని మీ వెంట తీసుకునిపోయి మీతోటివారిని శక్తి మంతులుగా చేయాలని" శ్రీ గౌరీ శంకర శర్మ ఆశీర్వదించారు. మీలో ఉన్న దుష్ట గుణాన్ని ఒక దానిని ఇక్కడ వదిలిపెట్టి, ప్రేమను-శాంతిని-జ్ఞానాన్ని మీ వెంట తీసుకుని వెళ్ళాలని ఆదరంగా వీడ్కోలు పలికారు.

శాంతి పాఠంతో 9 రోజుల శిక్షణా శిబిరం వైభవంగా ముగిసింది. జ్ఞాన వెలుగులు నింపుకున్న హృదయాలతో ఉల్లాసంగా అందరు తిరుగు ముఖం పట్టారు.

★★★

ఈ ప్రపంచాన్ని సృష్టించి నడిపిస్తున్నది సత్యమే - అరవింద యోగి.

వార్తలు

# రాష్ట్రమంతటా జరిగిన వివిధ కార్యక్రమాలు

## హైదరాబాదులో

14.08.2009నాడు గాయత్రీ చేతనా కేంద్రంలో కృష్ణాష్టమి వేడుకలతోపాటు సామూహిక వరలక్ష్మీ వ్రతం వైభవంగా నిర్వహించబడింది. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటవరకు స్త్రీ సూక్తంతో వరలక్ష్మి ఆవాహన, పురుష సూక్తంతో శ్రీ కృష్ణ ఆవాహన, గాయత్రీ చాలీసా పఠనం, లక్ష్మీ పూజ, శ్రీ కృష్ణ పరమాత్మ పూజ మొదలైనవి జరిగాయి. శ్రీమతి బి. అనసూయమ్మ సందర్భానుసారంగా సంగీతం వినిపించారు. గురుదేవుల సందేశాన్ని అందిస్తూ పరిజనులకు కర్తవ్యాన్ని బోధించారు.

శ్రీమతి పొన్నూరు హైమవతీ శాస్త్రి వరలక్ష్మీ వ్రతకథ మూలతత్వాన్ని వివరిస్తూ సామూహిక వ్రతాల్లో దాగి ఉన్న రహస్యాన్ని విప్పి చెప్పారు. శ్రీమతి విజయా విశ్వనాథ్, శ్రీమతి బృందాదేవి, శ్రీమతి ప్రమీల తదితరులు సహకరించారు. 60 మంది వరకు మహిళలు పాల్గొన్నారు. తదనంతరం భోజన ప్రసాదాన్ని అందించారు.

## వరంగల్‌లో

07.07.2009 గురుపూర్ణిమ సందర్భమున శ్రీ సాయి భక్త మండలి శివనగర్ వారి ఆధ్వర్యంలో పంచకుండీ గాయత్రి మహా యజ్ఞం శ్రీ ఎ.ఆర్.కె. మూర్తి, శ్రీ జి.వెంకటేశ్వర్లు నిర్వహించారు. డా॥ వెంకటేశ్వర రావు గురు పూర్ణిమ విశిష్టత గురించి వివరముగా ప్రవచనం ఇచ్చారు.

శివనగర్‌లో ఒక ప్రజ్ఞామండలి ఏర్పాటు చేయడమైనది. ఇది శ్రీ కేశవాచార్యుల నేతృత్వంలో నిర్వహించబడుతున్నది.

## కారుమంచిలో

28.06.2009 కారుమంచి గ్రామంలో షిర్డి సాయిబాబా వారి ఆలయంలో జరిగిన గ్లోబల్ గాయత్రి మంత్ర సామూహిక జప సాధనలో 123 మంది పాల్గొన్నారు.

## హైదరాబాదులో కార్యకర్తల సమావేశం

15.08.2009 సాయంత్రం 4.30 గంటలకు గాయత్రి చేతనా కేంద్రం హైదరాబాదులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గాయత్రీ పరివార్ రాష్ట్ర కార్య నిర్వాహక సభ్యుల సమావేశంలో పూజ్య గురుదేవుల జన్మ శతాబ్ది ఉత్సవములు 2011-12 గురించిన చర్చ జరిగింది. దక్షిణ భారత సంచాలకులు శ్రీ అశ్విని సుబ్బారావు అధ్యక్షత వహించారు. శాంతికుంజ్ ప్రతినిధి శ్రీ పరమానంద ద్వివేది, శ్రీ హీర్ సింగ్ రాజపురోహిత్, శ్రీ విజయా విశ్వనాథ్ వేదికనలంకరించారు. పూజ్య గురుదేవుల జన్మ శతాబ్ది వేడుకలను దిగ్విజయంగా నిర్వహించుటకు చేపట్టవలసిన కార్యక్రమ వివరములను, ప్రణాళికను శ్రీ పరమానంద ద్వివేదిగారు వివరించారు. పాల్గొన్నవారు వారి వారి అభిప్రాయములను వెల్లడించారు. గురుదేవుల జన్మ శతాబ్ది ఉత్సవములను ఆంధ్రప్రదేశ్‌లో జరుపుటకు కన్వీనర్‌గా శ్రీ పి.ఎన్.సురేశ్ కుమార్‌ను నియమించారు. శ్రీ హీర్‌సింగ్‌గారి వందన సమర్పణతో, శాంతి మంత్ర ఆలాపనతో సభ ముగిసింది.

## శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గాయత్రీ పరివార్ జూలై నెల 2009 కార్యక్రమాలు

07.07.2009 పి.ఎస్.ఆర్. నెల్లూరు జిల్లాలో నవాబుపేట యందు గల సాయిబాబా గుడిలో గురు పూర్ణిమ సందర్భంగా పంచకుండీ గాయత్రి యజ్ఞమును ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో శ్రీ టి.రమణమూర్తి, భువన, సురేఖ, సరళ మరియు భాస్కర నాయుడు గార్లు నిర్వహించారు. సుమారు 1000 మంది భక్తులు ఈ కార్యక్రమానికి హాజరైనారు.

07.07.2009 పి.ఎస్.ఆర్. నెల్లూరు జిల్లాలోని వింజమూరు మండలంలోని చంద్రపడియ గ్రామంలో ఉన్న శ్రీ కాశీనాయన స్వామి ఆశ్రమంలో గురు పూర్ణిమ సందర్భంగా త్రికుండీ గాయత్రి యజ్ఞము ఆశ్రమ కమిటీ ఆధ్వర్యంలో రఘు మరియు సిద్ధారెడ్డి గార్లు నిర్వహించారు. సుమారు 50 మంది భక్తులు ఈ కార్యక్రమానికి హాజరైనారు.

07.07.2009 పి.ఎస్.ఆర్. నెల్లూరు జిల్లాలో వింజమూరు మండల కేంద్రములోని రామాలయము నందు గురు పూర్ణిమ సందర్భంగా 24 కుండీల గాయత్రీ మహా యజ్ఞమును వింజమూరు మండల పుర ప్రముఖుల ఆధ్వర్యంలో కాకివాయి గాయత్రీ శక్తి పీఠం వారు నిర్వహించారు. సుమారు 150 మంది భక్తులు ఈ కార్యక్రమానికి హాజరైనారు.

**అందరి మధ్యా మసలితేనే ఆనందం, గౌరవం.**

12.07.2009 పి.ఎస్.ఆర్. నెల్లూరు జిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెం మండలంలో పైడా రామయ్యగారి కళ్యాణ మండపములో పైడా పెంచలస్వామిగారి ఉభయకర్తృత్వంలో పంచ కుండీ గాయత్రి యజ్ఞమును రఘుబాబు, భువన, భాస్కర నాయుడు, టి. రమణమూర్తి, ఐ. రమణయ్యగార్లు నిర్వహించారు. సుమారు 100 మంది భక్తులు ఈ కార్యక్రమానికి హాజరైనారు. 45 మంది ప్రతి రోజు 1 మాల గాయత్రి మంత్ర జపం చేస్తామని సంకల్పం తీసుకున్నారు.

05.07.2009 నుండి 25.07.2009 వరకు లక్ష్మీపురంలోని శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానము నందు 21 రోజులు ఏక కుండీ గాయత్రి యజ్ఞము నెల్లూరు జిల్లా గాయత్రి పరివార్ ఆధ్వర్యములో సింహపురి ప్రజ్ఞా మండలి ద్వారా శ్రీమతి నాగలక్ష్మి గారు నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా 15 మంది ప్రతి రోజూ గాయత్రి మంత్ర జపము చేస్తామని సంకల్పం చేశారు.

## శ్రీరామహంస సహ్యాద్రి ఆశ్రమంలో (ఒడరేవు)

05.08.2009 పూర్ణిమనాడు సహ్యాద్రి ఆశ్రమంలోని గాయత్రీ మందిర ఆవరణలో పంచకుండీయ గాయత్రీ మహా యజ్ఞం జరిగింది. యజ్ఞ సందర్భంగా రెండు జన్మదిన సంస్కారాలు నిర్వహించబడ్డాయి. 40 మంది భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ డి.వి.ఆర్ మూర్తి, శ్రీ సుబ్బారావు, శ్రీమతి పార్వతి నిర్వహించారు. వీరి ఆధ్వర్యంలో మరికొన్ని చోట్ల ఏక కుండీ యజ్ఞాలు, సంస్కారాలు నిర్వహించబడ్డాయి.

## మహబూబాబాద్‌లో

30.08.2009న శ్రీ జిల్లా వెంకటనారాయణ ఆధ్వర్యంలో 9 కుండీల గాయత్రీ మహాయజ్ఞం నిర్వహింపబడింది. 36 జంటలు యజ్ఞంలో పాల్గొనగా మొత్తం 150 మందికి అన్నదానం జరిగింది. అన్నదాన కార్యక్రమానికి శ్రీ వెంకటేశ్వర్లు బాధ్యత వహించారు.

## ఆరెపల్లిలో

02.08.2009 నాడు శ్రీ ఎల్.లక్ష్మీనారాయణ విశ్వ హిందూ పరిషద్ వారి ఆధ్వర్యంలో 5 కుండీల గాయత్రీ మహా యజ్ఞం జరిగింది. 150 మంది భక్తులు పాల్గొన్నారు. యజ్ఞాన్ని శ్రీ జిల్లా వెంకట నారాయణ నిర్వహించారు. ఇంకా వారి ఆధ్వర్యంలో పలుచోట్ల ఏక కుండీ గాయత్రీ యజ్ఞాలు, సంస్కారాలు నిర్వహించబడ్డాయి.

## మియాపూర్‌లో

01.06.2009న హైదరాబాద్ మియాపూర్‌లోని శ్రీ షిర్డీసాయి దేవాలయం 5వ వార్షికోత్సవ సందర్భంగా ఉదయం 6 గం॥ల నుండి సాయంత్రం 6 గం॥ల వరకు అఖండ గాయత్రి జపం, తదనంతరం 108 కలశముల పూజ, కలశ యాత్ర నిర్వహించారు. సుమారు 150 మంది పాల్గొన్న ఈ కార్యక్రమమునకు శ్రీ మెంటా సత్యన్నారాయణ, గీతారాధిక, శ్రీమతి సుబ్బులు, సుజాత, పావని, ఐశ్వర్యలు ఆధ్వర్యం వహించారు.

03.06.2009న ఉదయం గాయత్రి యజ్ఞమును శ్రీ హీర్ సింగ్ రాజపురోహిత్, శ్రీమతి అనసూయమ్మ నిర్వహించారు. సాయంత్రం దీప యజ్ఞం జరిగింది.

## ఎర్నాకులంలో గాయత్రి చేతనా కేంద్రం

కేరళ రాష్ట్రంలోని ఎర్నాకులం పట్టణంలో గురుపూర్ణిమ పర్వదినమున గాయత్రి చేతనా కేంద్ర శుభారంభం శ్రీ గిరీశ్ గుప్తా, (సర్జన్ కమాండర్ ఇండియన్ నేవీ) సతీ సమేతంగా దీప ప్రజ్వలనతో ప్రారంభించారు. పట్టణ ప్రముఖులు పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని శ్రీ శివలాల్ పటేదార్, మేనేజర్ పంజాబ్ నేషనల్ బ్యాంక్ నిర్వహించారు.

**అడ్రస్ :**

గాయత్రి చేతనా కేంద్రం,
27/12A3, Koithara Road,
Opp. Shipyard Qtrs Road,
Panampilly Nagar (South),
ERANAKULAM - 682 036
Ph : 9020176111.

## స్వర్గ ప్రాప్తి

**డా॥ లక్ష్మీ కస్తూరి,** కో ఆర్డినేటర్ దేవ సంస్కృతి విశ్వ విద్యాలయం దూర విద్యా కేంద్రం, హైదరాబాద్ సెంటర్ 10.09.09 నాడు పరమపదించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాము.



*గాయత్రీ చేతనా కేంద్రము*
హైదరాబాద్

పత్రిక అందనివారు, పత్రికకు సంబంధించిన సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు క్రింది నంబర్లను సంప్రదించగలరు.
**(1) 9652862601 (2) 9032674117**

సత్యం కోసమే జీవించు - తపించు - మరణించు - గాంధీజీ.